ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుల గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 286 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | సోమవారం 12 జనవరి 2026 | పేజీలు : 8 | వెల : 3

Circulated by: Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar

### నెలాఖరులో పబ్లిక్ ఇష్యూకు యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్

**హైదరాబాద్ :** ప్రైమ్ ఫ్యూల్ బ్రాండ్‌తో ఆటో ఎల్‌పీజీ గ్యాస్‌ను విక్రయించే యాక్సియమ్ గ్యాస్ ఇంజనీరింగ్ ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు రానున్నట్టు తెలిపింది. జనవరి చివరి వారంలో ఇష్యూకు వచ్చే అవకాశం ఉందని ఆ సంస్థ ప్రమోటర్ ఎంఎస్ బనాని వెల్లడించా రు. గురువారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బనాని మాట్లాడుతూ..

### భారత్ కోకింగ్ కోల్ ఐపీఓ. నిమిషాల్లోనే సబ్‌స్క్రిప్షన్ పూర్తి!

**దిల్లీ:** ప్రభుత్వరంగ దిగ్గజం కోల్ ఇండియా అనుబంధ సంస్థ భారత్ కోకింగ్ కోల్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకు అనూహ్య స్పందన లభించింది. శుక్రవారం సబ్‌స్క్రిప్షన్ ప్రారంభమైన కొన్ని నిమిషాల్లోనే పూర్తి సబ్‌స్క్రిప్షన్ అందుకుంది. ఎన్ఎస్ఈ డేటా ప్రకారం.. మధ్యాహ్నం 11.15 గంటల సమయానికి 34,69,46,500 (34 కోట్ల) షేర్లకు గానూ 84,15,46,800 (84 కోట్ల) షేర్లకు




## ఇందిరమ్మ ఇళ్లకు సంక్రాంతి కానుక

**ఇక నుంచి లబ్దిదారుల అకౌంట్లో మరింత వేగవంతంగా నిధులు జమ**

- సంక్రాంతి కానుకగా లబ్దిదారులకు ఉపయోగపడేలా మరో కీలక నిర్ణయం
- తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రతిష్టాత్మకంగా అమలు
- అధికారంలోకి రాగానే ఈ పథకాన్ని వెంటనే ప్రారంభించిన ప్రభుత్వం
- రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల్లోని ప్రజలకు ఇళ్లు మంజూరు
- ఇప్పటికే లక్షలాది ఇళ్లు మంజూరు చేయగా..
- వాటిల్లో కొన్ని గృహప్రవేశాలు కూడా పూర్తి

**హైదరాబాద్**

తెలంగాణలో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులకు రాష్ట్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. సంక్రాంతి కానుకగా లబ్దిదారులకు ఉపయోగపడేలా మరో కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి లబ్దిదారుల అకౌంట్లో మరింత వేగవంతంగా నిధులు జమ కానున్నాయి. బిల్లుల చెల్లింపుల్లో జాప్యం జరగకుండా మరింత వేగవంతంగా అందేలా కీలక ఆదేశాలు జారీ అయ్యాయి. ఎంత వేగంగా ఇల్లు పూర్తవుతుంటే అంత వేగంగా లబ్దిదారుల అకౌంట్లో డబ్బులు పడేలా చేయనుంది. ఈ మేరకు అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఈ విషయాన్ని తాజాగా ప్రకటించారు. ఇందిరమ్మ ఇళ్ల నిధులు లబ్దిదారులకు మరింత వేగంగా అందనున్నాయి. తాజాగా రామగుండంలో డిప్యూటీ సీఎం డిప్యూటీ భట్టి విక్రమార్క పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేయగా.. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్, - మిగతా3లో




### అసలు ఫైట్ మాతోనే..
## బీజేపీ ఏనాటికీ ప్రత్యామ్నాయం కాదు

- పార్లమెంటు ఎన్నికల్లో గెలిచింది గాలివాటమే: కేటీఆర్
- తెలంగాణలో కాంగ్రెస్‌కు బీజేపీ ప్రత్యామ్నాయం కాదు...
- తెలంగాణలో బీజేపీ ప్రత్యామ్నాయ శక్తి కాదన్న కేటీఆర్
- అసలు రాజకీయ పోరు బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యేనని ఉద్ఘాటన
- కాంగ్రెస్ 24 నెలల పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు
- పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కేవలం గాలివాటమేనని వ్యాఖ్య
- మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు తమకే పట్టం కడతారని ధీమా



### 2026లో తొలి ప్రయోగానికి ఇస్రో సిద్ధం

- కొనసాగుతున్న కౌంట్ డౌన్
- పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్‌తో 'అన్వేష' ఉపగ్రహం ప్రయోగం
- శ్రీహరికోట నుంచి సోమవారం ఉదయం 10:17 గంటలకు నింగిలోకి
- రక్షణ, విపత్తు నిర్వహణలో కీలకపాత్ర పోషించనున్న 'అన్వేష'
- 'అన్వేష'తో పాటు మరో 15 ఉపగ్రహాలను మోసుకెళ్లనున్న రాకెట్

## శరవేగంగా ఫ్యూచర్ సిటీ!



- ఫ్యూచర్ సిటీ తెలంగాణ పేరుతో కొత్త వెబ్‌సైట్
- సమస్త సమాచారం అరచేతిలోనే
- సరికొత్త వెబ్‌సైట్ రూపొందిస్తున్న సర్కారు
- ఆన్‌లైన్‌లోనే అనుమతులిచ్చేలా సన్నాహాలు
- ఆన్‌లైన్ ద్వారానే అన్నీ రకాల అనుమతులు
- ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పేరుతో వెబ్‌సైట్ ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు
- 300 ఎకరాల్లో ఏఐ సిటీ, 200 ఎకరాల్లో హెల్త్ సిటీ, 500 ఎకరాలను ఎడ్యుకేషన్ హబ్



**హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్మించనున్న భారత్ ఫ్యూచర్ సిటీకి సరి కొత్త వెబ్‌సైట్‌ను అధికారులు రూపొందిస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు వీలైనంత వేగంగా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ పేరుతో వెబ్‌సైట్ ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. ఐటీశాఖలోని ఓ విభాగానికి ఈ పనిని అప్పగించారు. జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ వెబ్‌సైట్ల తరహాలోనే ఈ ఫ్యూచర్ సిటీ పోర్టల్ ఉండనుంది. ఫ్యూచర్ సిటీకి సంబంధించిన సమస్త సమాచారం ప్రజలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, పరిశ్రమల ప్రతినిధులు దీని ద్వారా తెలుసుకునేందుకు సులభమైన పద్దతిలో వీలుంటుంది. ప్రస్తుతానికి ఫ్యూచర్ సిటీ తెలంగాణ పేరుతో ఒక వెబ్‌సైట్ మాత్రం అందుబాటులో ఉంచారు. ఇందులో రకరకాల ప్రాజెక్టుల సమగ్ర వివరాలున్నాయి. - మిగతా3లో



### భారత్‌పై దాడులకు వేలమంది బాంబర్లు సిద్ధం

- కలకలం రేపుతున్న మసూద్ అజహర్ ఆడియో!
- భారత్‌పై దాడులకు సిద్ధంగా వేలాది మంది బాంబర్లు
- జైషే మహ్మద్ చీఫ్ మసూద్ అజార్ పేరిట ఆడియో క్లిప్ వైరల్
- నిజమైన సంఖ్య చెబితే ప్రపంచం షాకవుతుందంటూ హెచ్చరిక
- సోషల్ మీడియాలో తీవ్ర ఆగ్రహావేశాలు



### తమిళనాట కొత్త రాజకీయం?

- డీఎంకే-కాంగ్రెస్ పొత్తు లేనట్లేనా..
- రాబోయే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పని చేసే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి.
- సీట్ల షేరింగ్ తోపాటు, అధికారంలో కూడా భాగస్వామ్యం కల్పించాలని కాంగ్రెస్ డిమాండ్
- అధికారాన్ని పంచుకునేందుకు తమ పార్టీ అధినేత, సీఎం స్టాలిన్ సిద్ధంగా లేరని ఆయన వ్యాఖ్య

## మేడారంలో భక్తుల రద్దీ



- వనదేవతల వద్ద కిక్కిరిసిన భక్తజనం
- ములుగు జిల్లా మేడారంలో పెరిగిన భక్తుల రద్దీ
- సమ్మక్క-సారలమ్మ దర్శనాలకు భారీగా తరలివస్తున్న భక్తులు
- వన దేవతల గద్దెల వద్ద కిక్కిరిసిన భక్తజనం
- సంక్రాంతి సెలవులు కావడంతో పెరిగిన రద్దీ

**హైదరాబాద్**

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క-సారలమ్మ ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు వన దేవతలను దర్శించుకుంటున్నారు. ఈరోజు ఆదివారం కావడం, స్కూళ్లు, కాలేజీలకు సంక్రాంతి సెలవులు రావడంతో రాష్ట్రం నలుమూలల నుంచి భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. అంతే కాకుండా ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిశా నుంచి కూడా భారీగా తరలివచ్చి జంపన్న వాగులో పుణ్యస్నానాలు ఆచరించి తలనీలాలు సమర్పించుకుంటున్నారు. అనంతరం ఆలయంలో మొక్కులు చెల్లించుకుంటున్నారు. ఈరోజు నుంచి వరుస సెలవులు రావడంతో భారీగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. రద్దీ కారణంగా సమ్మక్క సారలమ్మ గద్దెల మీదకు భక్తులను - మిగతా3లో



### పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీ రద్దీ

- సంక్రాంతి పండుగ నేపథ్యంలో పల్లెబాట పట్టిన పట్నం వాసులు
- నిన్న ఒక్క రోజే ఏపీకి 60 వేల వాహనాలు
- ఆదివారం కావడంతో ఈరోజు మరింత రద్దీ

## సంపాదకీయం

# సామ్రాజ్యవాద దురహంకారం

తన దుందుడుకు చర్యతో, దుష్ట పోకడతో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచాన్ని సంక్షోభం ఊబిలోకి నెట్టేశారు. వెనిజులా రాజధాని కారకాస్‌తో సహా దేశంలోని అనేక ప్రాంతాల్లో శుక్రవారం అర్ధరాత్రి అమెరికా సైన్యం భీకర దాడులకు దిగి అధ్యక్షుడు నికోలస్ మదురోనూ, ఆయన భార్య సిలియా ఫ్లోరెస్‌నూ కళ్లకు గంతలు కట్టి, బేడీలు వేసి అపహరించుకుపోయింది. ఆయన 'మాదకద్రవ్య ఉగ్రవాదానికి' పాల్పడినట్టు తప్పుడు ఆరోపణలు చేసి న్యూయార్క్‌లో బంధించింది. అమెరికా సామ్రాజ్యవాద దురహంకారం ప్రపంచానికి కొత్తగాదు. ఆసియా, లాటిన్ అమెరికా, ఆఫ్రికా ఖండ దేశాలు అనేకం దాని వాతబడ్డాయి. కుట్రలు చేసి దేశాధినేతల్ని హతమార్చటం, ప్రజాస్వామ్యం డ్రామాలు నడిపి వ్యవస్థల్ని కూల్చేయటం దానికి మంచినీళ్ల ప్రాయం. నాలుగు దశాబ్దాల నాడు తానే అధికారంలో ప్రతిష్ఠించిన పనామా అధ్యక్షుడు ఆంటోనియో నొరీగాను ఇదేవిధంగా దాడిచేసి అరెస్టు చేసింది. కానీ నొరీగా దాని కీలుబొమ్మ. అమెరికా చర్యల పర్యవసానంగా ఇటీవలి దశాబ్దాల్లో ఇరాక్, లిబియా, అఫ్గానిస్తాన్ నెత్తుటి ముద్దలయ్యాయి. ట్రంప్ తాజా చర్య వాటన్నిటినీ తలదన్నింది. వందలాది మంది సీఐఏ ఏజెంట్ల ద్వారా అధ్యక్షుడి భద్రతను చూస్తున్న దళాలను లోబరు చుకుని, అధ్యక్షుణ్ణి భార్యాసమేతంగా అపహరించటం నికృష్టం. ఆయన స్థానంలో తాత్కాలిక అధ్యక్షురాలిగా బాధ్యతలు స్వీకరించిన డెల్సీ రోడ్రెజ్‌ను 'మదురోను మించిన ప్రారబ్ధం చవిచూడాల్సి వస్తుంద'ని హెచ్చరించటం, ఆమె ఈ అవమానాన్ని దిగమింగు కుని 'కలిసి పనిచేద్దామ'ని స్నేహహస్తం చాచడం ఈ విషాదానికి కొనసాగింపు. దేశాల మధ్య సమస్యలొస్తే శాంతియుతంగా పరిష్కరించుకో వటానికి సిద్ధపడకుండా ఏకపక్షంగా దాడులకు పాల్పడటం, దేశ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించి అధినేతను అపహరించటం ఉగ్రవాదం. అలాంటి చర్యలు ప్రపంచ శాంతిని భగ్నం చేస్తాయి. కానీ పాశ్చాత్య దేశాలూ, అమెరికా ప్రధాన స్రవంతి మీడియా ఈ పరిణామాలను సాధారణ విషయంగా చూపే ప్రయత్నం చేస్తున్నాయి. మదురో పెద్ద నియంతంటూ ప్రచారం లంకించుకున్నాయి. ట్రంప్ దరిదాపుల్లోకి రాగల నియంత ప్రపంచంలో ఉంటాడా? చావెజ్ వారసుడిగా 2013లో అధికారంలోకొచ్చిన మదురో నియంత అనటం పచ్చి బూటకం. 2019 ఏప్రిల్‌లో 'తిరుగుబాటు' చేసి అధికారంలోకొచ్చానని ప్రకటించుకున్న గెయిడో సాయుధ బృందం రక్షణలో రాజధాని కారకాస్ వీధుల్లో స్వేచ్ఛగా తిరుగుతున్నా జనం నవ్వుకున్నారు. పోలీసులూ, సైనికులూ అతగాణ్ణి ఏమీ అనలేదు. చివరకు మదురో స్వయంగా పిలిచి నవ్వుతూ తలమీద ఒక్కటిచ్చి పొమ్మన్నారు. వేరే దేశంలో ఎక్కడైనా అది ఉరికంబం ఎక్కేంత తీవ్ర నేరం. కనీసం యావజ్జీవం జైల్లో మగ్గేంత అపరాధం. వెనిజులా ప్రజలు 1999లో హ్యూగో చావెజ్ అధికారంలోకొచ్చాక దశాబ్దాల దారిద్ర్యం నుంచి విముక్తులయ్యారు. ఆయన హయాంలో దారిద్ర్యం ఒక్కసారిగా 70 శాతానికిపైగా తగ్గింది. నిరుద్యోగం సగానికి సగం పడిపోయింది. పెన్షన్లు నాలుగు రెట్లు పెరిగాయి. అక్షరాస్యత వంద శాతానికి చేరుకుంది. విద్య, వైద్యం, ఉపాధి కల్పన, ఆహారభద్రత అక్కడ ప్రాథమిక హక్కులు. దాదాపు వందేళ్లపాటు దేశ సంపదనంతా తరలించుకుపోయిన అమెరికా చమురు కంపెనీలను చావెజ్ స్వాధీనం చేసుకోవటంవల్లే ఇదంతా సాధ్యమైంది. అప్పటినుంచి అమెరికా కడుపుమంట మొదలైంది. అమెరికా ఆంక్షల వల్ల వెనిజులా దీర్ఘకాలంగా సమస్యలకు ఎదురీదుతోంది. ప్రాణావసర మందులు కరువై లక్షమంది ప్రజలు మరణించారు. దారిద్ర్యాన్ని తట్టుకోలేక 80 లక్షల మంది దేశం వదిలిపోయారు. ఇటీవల మదురో చర్యలు వ్యాపార వర్గాల ప్రయోజనాలకు తోడ్పడుతున్నాయన్న విమర్శలున్నాయి. అయితే మదురో చైనా కరెన్సీ యువాన్లలో వాణిజ్యం నెరపడం, చైనా, రష్యా, ఇరాన్‌లతో జతకట్టడం, బ్రిక్స్‌లో చేరేందుకు సంసిద్ధం కావటం అమెరికాను కలవరపరిచాయి. అత్యధిక చమురున్న దేశం ఎదిగేలా కనబడటంతో డాలర్‌ను కాపాడుకోవటానికి అమెరికా ఈ తప్పుడు చర్యకు దిగింది. ఇవాళ వెనిజులా వంతు. రేపు మెక్సికో, క్యూబా, గ్రీన్‌ల్యాండ్... ఏదైనా కావొచ్చు. అందుకే అమెరికా చర్యను ప్రపంచం ముక్తకంఠంతో ఖండించాలి. ఆధునిక కాలంలో అనాగరిక పోకడలు చెల్లబోవని చాటాలి.

# మలుపు తిరిగిన మహా రాజకీయం



ఆరు దశాబ్దాలుగా మహారాష్ట్ర రాజకీయాలలో చక్రం తిప్పిన శివసేనను చీల్చిన సంతోషం బీజేపీకి ఎంతోకాలం నిలువలేదు. 20 ఏండ్ల క్రితం విడిపోయిన థాకరే సోదరులు తిరిగి ఏకమయ్యారు. మరాఠా అస్తిత్వ నినాదం మళ్లీ తెరపైకి వచ్చింది. బీజేపీ నేతృత్వంలోని అధికార మహాయుతి సంకీర్ణ భాగస్వామి ఎన్సీపీ (అజిత్ పవార్) వేరుకుంపటి పెట్టుకుంది. ఏడాది కిందట జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఇటీవల జరిగిన మున్సిపల్ కౌన్సిల్, నగర పంచాయతీ ఎన్నికల్లో దూసుకుపోయిన బీజేపీ నాయకత్వంలోని మహాయుతి వర్తమాన పరిణామాలతో కలవరపడుతున్నది. ఈనెల 15న జరుగనున్న 29 కార్పొరేషన్ల ఎన్నికలపై కొత్త రాజకీయ సమీకరణల ప్రభావం ఉంటుందా? దశాబ్దాలుగా ఊరిస్తూ వస్తున్న బృహణ్ ముంబై నగరపాలక పీఠం బీజేపీ వశమవుతుందా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీ, లోక్‌సభ స్థానాల్లో మూడింట ఒక వంతు స్థానాలు ఈ 29 కార్పొరేషన్ల పరిధిలోనే ఉన్నాయి. ప్రత్యేకించి దేశ ఆర్థిక రాజధాని ముంబైని గెలుచుకోవాలన్న కృతనిశ్చయంతో రెండేండ్లుగా పావులు కదుపుతోంది బీజేపీ. అందులో భాగంగా దశాబ్దాలుగా ముంబైపై ఏకచ్ఛత్రాధిపత్యం వహిస్తున్న శివసేనను రెండుగా చీల్చి అధికారం నుండి దించేసింది. చీలికవర్గం నాయకుడు ఏక్‌నాథ్ షిండే ముఖ్యమంత్రిగా మహాయుతి పేరుతో సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. పనిలో పనిగా శరద్ పవార్ నేతృత్వంలోని ఎన్సీపీని చీల్చి చీలికవర్గం నేత అజిత్ పవార్‌కు ఉపముఖ్యమంత్రి పదవి కట్టబెట్టింది. దీంతో బలమైన మరాఠా అస్తిత్వ శక్తులు రెండూ బలహీనమయ్యాయి. ఇదే అదనుగా గత అసెంబ్లీ ఎన్నికల్లో పట్టు, పైచేయి సాధించిన షిండే, అజిత్ పవార్‌లను ఉపముఖ్యమంత్రులుగా చేసి పక్కన పెట్టేసింది. ఫడ్నవీస్‌కు పగ్గాలు అప్పగించింది. ఈ సంక్రాంతికి జరుగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రత్యేకించి ముంబైలో పాగా వేయడం ద్వారా మహారాష్ట్ర సర్వంసహాధికారాన్ని కైవ సం చేసుకోవచ్చని భావించిన బీజేపీ తాజా రాజకీయ పరిణామాలతో బిత్తరపోయింది. 1966లో పాత్రికేయుడు బాల్ థాకరే మరాఠా అస్తిత్వ నినాదంతో శివసేన ప్రారంభించారు. ఐదేండ్లకే మహారాష్ట్ర రాజకీయాలు శాసించే స్థాయికి శివసేన చేరుకుంది. ప్రత్యేకించి రాజధాని ముంబై నగరంలో తిరుగులేని ఆధిపత్యాన్ని సాధించింది. హిందుత్వ భావసారూప్యతతో దగ్గరైనా ఏనాడూ శివసేనను దాటి వెళ్ళే సాహసం చేయలేక పోయింది బీజేపీ. బాల్ థాకరే బతికున్నంత కాలం మహారాష్ట్రలో ప్రత్యేకించి ముంబైలో ఆయన చెప్పిందే వేదం. అయితే తమ్ముని కుమారుడు రాజ్ థాక్రే 2006లో శివసేనను వీడి మహారాష్ట్ర నవనిర్మాణ సేన ఏర్పాటు చేశారు. దాంతో శివసేన ఒక కుదుపునకు గురయింది. 2012లో బాల్ థాకరే మరణించాక ఆయన కుమారుడు ఉద్ధవ్ థాకరే శివసేనకు నాయకత్వం వహించారు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఉద్ధవ్ నేతృత్వంలో శివసేన, కాంగ్రెస్, ఎన్సీపి సంకీర్ణం విజయం సాధించి అధికారంలోకి వచ్చింది. కానీ అది ఎంతో కాలం నిలవలేదు. శివసేన నుంచి బీజేపీ విడిపోయి బయటకు వచ్చిన ఏక్‌నాథ్ షిండే మద్దతుతో ముఖ్యమంత్రి అయ్యారు. అజిత్ పవార్ నాయకత్వంలో ఎన్సీపీ చీలిక వర్గం కూడా పంచన చేరింది. వడ్డించే వాళ్ళు తనవాళ్ళే కదా. ఇంకేముంది అసలైన శివసేన, ఎన్సీపీ అవేనంటూ ఎన్నికల కమిషన్ నిర్ధారించింది. ఆ పార్టీలకు అసల్‌దార్ అధినేతలైన ఉద్ధవ్ థాక్రే, శరద్ పవార్ తమ పార్టీ పేర్లు సహా ఎన్నికల గుర్తులను సైతం కోల్పోయారు. ఇంత జరిగినా గత లోక్‌సభ ఎన్నికల్లో వారిద్దరి నేతృత్వంలోని మహా వికాస్ అఘాడీ 30 లోక్‌సభ స్థానాలను గెల్చుకుంది. బీజేపీ సారథ్యంలోని అధికార మహాయుతి కూటమి 18కే పరిమితమైంది. అయితే ఆరు నెలలకే జరిగిన మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో అనూహ్యంగా మహాయుతి ఘన విజ యం సాధించింది. అదే ఒరవడిలో గత డిసెంబర్‌లో జరిగిన మున్సిపల్, నగర పంచాయ తీ ఎన్నికల్లో జోరును కొనసాగించింది. ఈ నె ల 15న జరుగనున్న కార్పొరేషన్ ఎన్నికల్లో ముచ్చటగా మూడో విజయాన్ని ముద్దాడాలనుకున్న కూటమిలో వరుస రాజకీయ పరిణామాలు బీజేపీకి కునుకు లేకుండా చేస్తున్నాయి. ముఖ్యంగా ఉద్ధవ్ థాక్రే శివసేన, రాజ్ థాక్రే మహారాష్ట్ర నవనిర్మాణ సేన ఒక్కటి కావడం ముంబై సహా మిగతా కార్పొరేషన్‌లపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. శివసేన నుండి నవనిర్మాణ సేన విడిపోయిన తర్వాత 2007, 2012, 2017లో జరిగిన ముంబై నగరపాలక ఎన్నికల్లో శివసేన పైచేయి సాధించి అధికారం కైవసం చేసుకున్నప్పటికీ నవనిర్మాణ సేన గణనీయమైన ఓట్లను, సీట్లను సాధించింది. ఇప్పుడు ఈ రెండూ ఒక్కటి కావడం అగ్నికి వాయువు తోడైనట్టు అయ్యింది. మరోవైపు సంకీర్ణ భాగస్వామి అజిత్ పవార్ ఎన్సీపీ 94 సీట్లలో సొంతంగా పోటీ చేస్తున్నది. పైగా శరద్ పవార్ ఎన్సీపీతో కలిసి పుణె, పింప్రీ చించ్వాడ కార్పొరేషన్ ఎన్నికల్లో సంకీర్ణానికి వ్యతిరేకంగా రంగంలోకి దిగింది. నాగపూర్‌లోనూ అదే పరిస్థితి. మిగతా కార్పొరేషన్ల సంగతి అలాఉంచితే ఇప్పుడు దేశం చూపంతా ముంబై వైపే ఉంది. 2022 మార్చి లోపే ఎన్నికలు జరగాల్సి ఉండగా సుమారు నాలుగేండ్లు కాలయాపన జరిగింది. 137 ఏండ్ల చరిత్ర కలిగి, ఆసియా ఖండంలోనే అతిపెద్ద కార్పొరేషన్ అయిన ముంబై వార్షిక బడ్జెట్ రూ 40 వేల కోట్లు. 1972 నుండి పడుతూ లేస్తూ పదేండ్లు పరిపాలించిన శివసేన 1997 నుండి పాతుకుపోయి 2022 వరకు ముంబై పీఠంపై అధివసించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్ని మారినా పాతికేండ్ల పాటు ముంబై పీఠం శివసేనదే. ప్రారంభంలో అంతగా బలంలేని బీజేపీ శివసేన పంచన చేరి ఎదిగి వచ్చి తిన్నింటి వాసాలు లెక్కపెట్టినట్లు ఆశ్రయమిచ్చిన శివసేననే చీల్చింది. సూదిలా వచ్చి దబ్బనంగా మారడం బీజేపీకి అలవాటే. భేద, దండోపాయాలతో ఢిల్లీని కైవసం చేసుకున్న బీజేపీ ముంబైపై కన్నువేసింది. 1951లో ఏర్పడ్డ భారతీయ జనసంఘ్‌కు గానీ ఆ పేరు మార్చుకొని కొత్తపేరుతో 1980లో ఏర్పడ్డ భారతీయ జనతా పార్టీకి గానీ ముంబై మేయర్ పీఠం 65 ఏండ్లుగా అందని ద్రాక్షే అయింది. అందుకే ఈ ఎన్నికల్లో అప్పుడే ముందస్తు అక్రమాలకు తెర లేపింది. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 68 మంది ప్రత్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. ఈ వ్యవహారంలో ఆ త్యాగధనులకు నజరానాల రూపంలో రూ.50 కోట్ల చొప్పున రూ.3500 కోట్లు అందాయని విపక్షాలు ఆరోపించాయి. బాల్ థాకరే మరణానంతరం మసకబారుతూ వచ్చిన మరాఠా అస్తిత్వం మళ్లీ తలెత్తింది. సోదరులు ఉద్ధవ్ థాక్రే, రాజ్ థాక్రేలను తిరిగి ఒకటి చేసింది. ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన హిందీ తప్పనిసరి విధానం దక్షిణాది రాష్ట్రాలతో పాటు మహారాష్ట్రలోనూ బెడిసి కొట్టింది. ఉపముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే ఒక సభలో 'జై గుజరాత్' అని నినదించడం మరాఠాల కోపానికి కారణమైంది. కేంద్ర ఆరోగ్య శాఖ సహాయమంత్రి ప్రతాప్ జాదవ్ ముంబైని గుజరాత్ రాజధానిగా వ్యాఖ్యానించడం పెను సంచలనం కలిగించింది. 1960లో ముంబాయి నుండి విడిపోయి ప్రత్యేక గుజరాత్ రాష్ట్రం ఏర్పడ్డప్పటికీ గుజరాతీయులు, మరాఠాలకు మధ్య ముంబై ఆధిపత్యపోరు కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో 'ఆవాజ్ మరాఠీచి ' నినాదం ముందుకొచ్చింది. ముంబై నగరం తమది కాకుండా పోతుందేమోనన్న ఆందోళన అక్కడి మరాఠీలను వేధిస్తున్నది. ఏ ఇతర రాష్ట్రాల రాజధానుల్లో లేనివిధంగా ముంబై జనాభాలో మరాఠీ మాతృభాషగా కలిగినవారి సంఖ్య 36%కు పడిపోయింది. హిందీ రాష్ట్రాల నుంచి వచ్చి ముంబైలో స్థిరపడ్డవారు 23 శాతం ఉంటే గుజరాతీలు 12 శాతానికి చేరుకున్నారు. తమ వ్యాపార విస్తరణతో ముంబైని శాసిస్తున్నారు. ఈ నేపథ్యంలో మహారాష్ట్రేతర ఉత్తరాది రాష్ట్రాల ఓట్లను ఆశిస్తున్న కాంగ్రెస్ థాక్రే సోదరులు ముందుకు తెచ్చిన మరాఠా అస్తిత్వ జెండా ఎత్తుకోవడానికి జంకి ఆ కూట మి నుంచి బయటకు వచ్చి 143 స్థానాల్లో పో టీకి దిగింది. రాజకీయ స్వార్థం కోసం రాష్ట్రాల అస్తిత్వాన్ని బలి పెట్టడానికి జాతీయ పార్టీలు వెనుకాడవన్నది మరోసారి రుజువయింది. సంపూర్ణ ఆధిపత్యం కోసం, పతనావస్థ నుండి పునరుత్థానం కోసం కాంగ్రెస్, మరాఠా అస్తిత్వం ఆత్మగౌరవం కోసం థాక్రే సోదరులు మూడువైపులా తమ సంకీర్ణ సేనలతో మోహరించి తలపడుతున్న మహారాష్ట్ర కార్పొరేషన్ కదనరంగంలో ప్రత్యేకంగా ముంబై విజయం కీలకం కానుంది. పోటీలో ఉన్నప్పటికీ కాంగ్రెస్‌కు అంత సీన్ లేదు. ఇక బాల్ థాకరే వారసత్వం ముంబైని నిలబెట్టుకుంటుందా లేక కైవసం చేసుకుని తన 65 ఏండ్ల కలను బీజేపీ నిజం చేసుకుంటుందా చూడాలి. కొసమెరుపు: గత డిసెంబర్‌లో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో హంగ్ ఏర్పడ్డ అంబర్‌నాథ్‌లో కాంగ్రెస్‌తో, అకోట్ మున్సిపాలిటీలో ఎంఐఎంతో జతకట్టి బీజేపీ చైర్మన్ పదవులు కొట్టేసింది. ఈ అపూర్వ కలయికను ఆయా పార్టీల అధిష్ఠానాలు వ్యతిరేకించాయి. అయితేనేం అంబర్‌నాథ్ వికాస్ అఘాడీ, అకోట్ వికాస్ మంచ్ పేరుతో కొత్త దుకాణాలు తెరిచి కొనసాగుతున్నారు. హతవిధీ.

# ట్రంప్ అడుగుజాడల్లో చైనా



మంచేదైనా జరిగితే తమ ఖాతాలో వేసుకోవటానికి సిద్ధపడేవాళ్లు కోకొల్లలు. ఇది లోకో త్తర సత్యం. ఒకరకంగా అదొక వ్యాధి. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు ఆ సమస్య ఉంది. తన ప్రమేయం లేకుండా ముగిసిన యుద్ధాలనూ, ఇంకా ముగియని యుద్ధాలనూ తానే ఆపానని చెప్పుకోవడంతోపాటు ఉనికిలో లేనివాటికి కూడా అడ్డుచక్రం వేశాననటం ఆయనకే చెల్లింది. ఆ బాణీ ఇంకా ఆపలేదు. ఇప్పుడు చైనా వంతు వచ్చినట్టుంది. 2025లో భారత్‌పాక్ ఘర్షణలు నివారించటంతోపాటు అనేక ఇతర యుద్ధాలను ఆపిన ఘనత తమదంటూ తాజాగా వాంగ్‌యీ ప్రకటించుకున్నారు. ఆ రెండు దేశాలూ అనేక రంగాల్లో పోటీపడుతున్నాయి. ఆర్థికంగా ఇప్పటికీ అమెరికాదే పైచేయి అయినా, రేపో మాపో దాన్ని చైనా అధిగమిస్తుందని ఎవరో కాదు... ఆర్థిక నిపుణులే దండోరా వేస్తు న్నారు. ఆ విషయంలో చైనాను ప్రశంసించాల్సిందే! అమెరికాతో పోలిస్తే ఎక్కడో అట్ట డుగునుండే దేశాన్ని 75 ఏళ్లలోనే ఈ స్థాయికి తీసుకురావటం మాటలు కాదు మరి. అంతమాత్రాన అమెరికా చెప్పే అబద్ధాలను కూడా వల్లెవేయటం వంటి చౌకబారు అనుకరణలు బెడిసికొడతాయని చైనా గ్రహించకపోవటం క్షమార్హం కానిది. కశ్మీర్‌లోని పెహల్గాంలో పాక్ నుంచి చొరబడిన ఉగ్రవాదులు అనేకమంది అమాయ కులను పొట్టనబెట్టుకున్న వైనం తర్వాత గత ఏడాది మే మొదటివారంలో మన దేశం 'ఆపరేషన్ సిందూర్' పేరుతో అక్కడి ఉగ్ర స్థావరాలపై దాడులు చేయటం, దానికి ప్రతిగా పాకిస్తాన్ సైన్యం మనపై దాడి చేసే ప్రయత్నం, మనం తిప్పికొట్టడం, ఎదురు దాడి చేయడం వంటివి జరిగాయి. చివరకు కుదిరిన కాల్పుల విరమణ వెనక రెండు దేశాల మిలిటరీ ఆపరేషన్స్ డైరెక్టర్ జనరళ్లు (డీజీఎంలు) ఉన్నారని మన దేశం చెబుతోంది. ఇలాంటి విషయాల్లో మూడో పక్షం జోక్యాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించ బోమని అప్పట్లోనే స్పష్టం చేసింది. నిజానికి 'ఆపరేషన్ సిందూర్' సందర్భంగా పాక్ సైన్యం వాడిన ఆయుధ సామగ్రిలో చైనా సరఫరా చేసినవి కూడా ఉన్నాయని అప్పుడే బయటపడింది. ఆ సామగ్రి 81 శాతం అని కూడా తేలింది. పాకిస్తాన్ మనపై ప్రయోగించిన ఆయుధ సామగ్రి చూశాక, ఈ ఘర్షణను 'సజీవ ప్రయోగశాల'గా చైనా ఉపయోగించుకున్నట్టు కనబడుతోందని కూడా మన దేశం విమర్శించింది. అలాంటి దేశం 'తగుదు నమ్మా...' అంటూ ఇరుపక్షాల మధ్యా రాజీకీ దౌత్యం నెరపానని ఇప్పుడు గప్పాలు కొడుతోంది. లోపాయకారీగా ఘర్షణలను ఎగదోయటం, పైకి శాంతి వచనాలు వల్లించటం ఇటీవలి ధోరణేం కాదు. ఇలాంటి జిత్తులమారి ఎత్తుగడల్లో అమెరికా ఆరితేరింది. ఇజ్రా యెల్ సాగించే అన్ని దాడుల వెనకా ఆ దేశం ఉంటుంది. అవే దాడుల్ని ఆపినట్టు కనబడటంలో ముందుంటుంది. శాంతి సాధన కోసం 'ఏ సమస్యనైనా వస్తునిష్ఠతో చూడటం, న్యాయమైన వైఖరి తీసుకోవటం' తమ విధానమని... లక్షణాలనూ, మూల కారణాలనూ తొలగించటమే తమ ధ్యేయమని వాంగ్‌యీ చెప్పుకున్నారు. డాలర్ ఇంకా శాసిస్తూనే ఉంది కనుక అమెరికా ఇలాంటి అబద్ధాలు చెప్పినా ఏదోమేరకు చెల్లుబాటవుతాయి. సుంకాలు పెంచుతామని బెదిరించానంటే 'అవును కాబోలు...' అని ఎవరికైనా అనిపించవచ్చు. కానీ చైనా సైతం 'అన్నీ నేనే... అంతా నేనే' అని అనటం ఎబ్బెట్టుగా ఉంటుంది. అదను చూసుకుని పక్కనున్న తైవాన్‌ను కబళించాలని ప్రయత్నిస్తూ, మనతో సరిహద్దుల్లో అకారణ వైరానికి దిగుతూ, అరుణాచల్ ప్రదేశ్‌లో గ్రామాల పేర్లు మార్చు కుని మురిసిపోతూ ఇలా తటస్థత నటించటం అనైతికత. చైనాకూ, తైవాన్‌కూ మధ్య రాజీ కుదర్చటానికి ప్రయత్నిస్తానని మన దేశం ముందుకొస్తే చైనా అంగీకరిస్తుందా? అధికారంలోకొచ్చిన నాటి నుంచీ నోబెల్ బహుమతి కోసం వెంపర్లాడటం ట్రంప్‌కు ఎక్కువైంది. బహుశా ఆయనకు మోకాలడ్డాలని చైనా ఏమైనా ప్రయత్నిస్తోందేమో! అలా చేయదల్చుకుంటే ట్రంప్ తప్ప వేరెవరూ చైనాను ఆటంకపరచరు. తామిచ్చే శాంతి బహుమతి సైతం ప్రతిష్ఠాత్మకమైనదిగా ఉండేలా చూసుకొనే బాధ్యత నోబెల్ కమిటీది. ఈలోగా లేని పెద్దరికాన్ని ప్రదర్శించటం వల్ల నవ్వులపాలు కావటం ఖాయమని అటు ట్రంప్, ఇటు చైనా తెలుసుకోవాలి.

ధర్మఘంట

# తమిళనాట కొత్త రాజకీయం?



ఈ ఏడాది జరగబోయే తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల వేళ కొత్త పొత్తులు కలిసే అవకాశాలు కనిపిస్తున్నాయి. అదే సమయంలో ఇప్పటిదాకా కలిసున్న పార్టీలు దూరమయ్యే అవకాశాలున్నట్లు తాజా పరిణామాలు చెబుతున్నాయి. తమిళనాడులో అధికార డీఎంకేకు కాంగ్రెస్ పార్టీ మద్దతుగా ఉన్న సంగతి తెలిసిందే. అయితే, రాబోయే ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు కలిసి పని చేసే అవకాశాలు తక్కువగా కనిపిస్తున్నాయి. దీనికి కారణం కాంగ్రెస్ ప్రతిపాదనే అని తెలుస్తోంది. సీట్ల షేరింగ్ తోపాటు, అధికారంలో కూడా భాగస్వామ్యం కల్పించాలని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. దీనికి డీఎంకే అంగీకరించలేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్-డీఎంకే పొత్తు ఉండకపోవచ్చని తమిళనాడు మంత్రి పెరియసామి తెలిపారు. అధికారాన్ని పంచుకునేందుకు తమ పార్టీ అధినేత, సీఎం స్టాలిన్ సిద్ధంగా లేరని ఆయన వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అగ్రనేత మాణిక్కం ఠాగూర్ తమకు అధికారంలో వాటా కావాలని అడిగినా ఇందుకు డీఎంకే సానుకూలంగా స్పందించలేదు. పైగా తమిళనాడులో 1967 నుంచి ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. ఒంటరిగానే గెలిచాయని పెరియసామి అన్నారు. 2006లో డీఎంకే.. ఇతర పార్టీల మద్దతుతో అధికారం చేపట్టినప్పటికీ.. ఇతర పార్టీల నేతలకు మంత్రివర్గంలో చోటు మాత్రం కల్పించలేదు. తమిళనాడుకు సంబంధించి మద్రాస్ రాష్ట్రంగా ఉన్న సమయంలో, 1952-57 వరకు కాంగ్రెస్ అధికారంలో ఉంది. అయితే, మెజారిటీ లేని కారణంగా అప్పుడు మాత్రమే నాన్ కాంగ్రెస్ నేతలకు మంత్రి పదవులు దక్కి, ప్రభుత్వంలో భాగస్వాములయ్యారు. మిగతా ఎప్పుడూ తమిళనాడులో ఇతర పార్టీలు ప్రభుత్వంలో ఉన్నా.. మంత్రివర్గంలో చోటు మాత్రం దక్కలేదు. ఈ నేపథ్యంలో రెండు పార్టీలు కలిసి పోటీచేసినా సరే.. కాంగ్రెస్ పార్టీకి ప్రభుత్వంలో భాగస్వామ్యం ఇవ్వడానికి డీఎంకే సిద్ధంగా లేదు. మరోవైపు.. నటుడు విజయ్ స్థాపించిన టీవీకేతో కాంగ్రెస్ పార్టీ పొత్తుకు ప్రయత్నిస్తోందనే ప్రచారం జరుగుతోంది. వచ్చే మార్చి-ఏప్రిల్ లో తమిళనాట అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయి.

# ప్రమాదంలో కేరళ భద్రత



తిరువనంతపురం: కేరళలో శాంతి భద్రత పైకి సాధారణంగా కన్పిస్తున్నా లోపల అనేక ముప్పులు క్రమేపీ పెరుగుతున్నాయని హోం మంత్రి అమిత్ షా అన్నారు. భవిష్యత్తులో ఇవి ప్రమాదకరంగా మారనున్నాయని హెచ్చరించారు. మలయాళ పత్రిక కేరళ కౌముది ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. "పీఎఫ్ఐ, జమాతె ఇస్లామీ, ఎస్‌డీపీఐ వంటి రాజకీయ పార్టీలు కేరళను సురక్షితంగా ఉండనిస్తాయా? ఇటువంటి బెదరలను ముందుగానే గుర్తించి, తొలగించడం బాధ్యత కలిగిన ప్రభుత్వం చేయాల్సిన పని' అని అన్నారు. పీఎఫ్ఐ కేడర్ మొత్తాన్నీ కటకటాల్లోకి నెట్టేసి, దేశాన్ని తాము సురక్షితంగా ఉంచామని చెప్పారు. తెరవెనుక ఉన్న ముప్పులను తొలగించినప్పుడే కేరళ సురక్షితంగా ఉండగలదని అమిత్ షా అన్నారు. బీజేపీ వల్లనే అది సాధ్యమని చెప్పారు.

**పద్మనాభుని సన్నిధిలో పూజలు**

కేరళలో ఒక్క రోజు పర్యటనకు గాను శనివారం రాత్రి తిరువనంతపురం చేరుకున్న అమిత్ షా ఆదివారం ఉదయమే అనంత పద్మనాభుని ఆలయానికి చేరుకున్నారు. సంప్రదాయ ధోవతి, సిల్కు శాలువాతో వచ్చిన అమిత్ షాకు ట్రావెన్‌కోర్ రాచ కుటుంబ సభ్యుడు ఆదిత్య వర్మ, ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అమిత్ షాకు ఆలయ అధికారులు పద్మనాభస్వామికి అంకితమిచ్చే సంప్రదాయ విల్లును బహూకరించారు. .

**కేరళ, బెంగాల్‌లలో ఒకేసారి ఎన్నికలు**

అనంతరం కేంద్ర మంత్రి అమిత్ షా నూతనంగా ఎన్నికైన తిరువనంతపురం బీజేపీ కౌన్సిలర్ల సమావేశంలో మాట్లాడారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలతోపాటే కేరళలోనూ ఎన్నికలు జరుగుతాయని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఈ రెండు రాష్ట్రాల్లోనూ బీజేపీ ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. శబరిమల ఆలయంలో బంగారు తరుగు కేసుపై స్వతంత్ర సంస్థతో దర్యాప్తు చేయించాలని హోంమంత్రి అమిత్ షా డిమాండ్ చేశారు. అసలైన దోషులను కాపాడేందుకు అధికార ఎల్డీఎఫ్ ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. ఆలయ ఆస్తులనే కాపాడలేని వారు ప్రజల విశ్వాసాలను ఎలా పరిరక్షించగలరంటూ ప్రశ్నించారు.

## ఠాక్రేలు తలుచుకుంటే ముంబై పరిస్థితి అదే?: సంజయ్ రౌత్



బృహత్ ముంబై కార్పొరేషన్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ శివసేన (ఠాక్రే) ఎంపీ సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముంబైలో ఠాక్రే కుటుంబానికి ఎదురులేదన్నారు. ప్రస్తుతం మరాఠీల గౌరవం కోసమే ఠాక్రే సోదరిలిద్దరూ కలిసి ప్రచారానికి వచ్చారన్నారు. మహానగరంలో శివసేన పట్టు ఇప్పటికీ సడలేదని ఠాక్రేలు తలుచుకుంటే 10 నిమిషాల్లో ముంబైనగరం మూసివేయగలరని సంచలన వ్యాఖ్యలు చేశారు. గతేడాది మహారాష్ట్ర రాజకీయాలలో కీలక పరిమాణం చోటుచేసుకుంది. కుటుంబ విభేదాలతో విడిపోయిన ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రేలిద్దరూ 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తరువాత తిరిగి కలిశారు. అనంతరం ముంబై మహానగర పాలక సంస్థకు జరిగే ఎన్నికల్లో శివసేన (ఠాక్రే), మహారాష్ట్ర నవనిర్మాణ సేన రెండు పార్టీలు కలిసి పోటీ చేస్తాయని ప్రకటించారు. దీంతో మహారాష్ట్ర రాజకీయాలు ఒక్కసారిగా టర్న్ తీసుకున్నాయి. ఈ నేపథ్యంలో ఎంపీ సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. "ముంబై నగరంలో ఠాక్రేలు ఎప్పుడు ఓడిపోలేదు. వారు తలుచుకుంటే ముంబైని 10 నిమిషాల్లో స్తంబింపచేయగలరు. ఉద్ధవ్ ఠాక్రే, రాజ్ ఠాక్రేలిద్దరూ అన్నదమ్ములూ వారు మళ్లీ కలవడం అదృష్టం" అన్నారు. వారిద్దరి మధ్య విబేధాలున్నప్పటికీ దేశం కోసం ఏకమయ్యారని తెలిపారు. "ఠాక్రేలు అంటే ఒక బ్రాండ్ వారు ఉంటేనే మరాఠాల గౌరవం బ్రతికుంటుంది. ఉద్ధవ్, రాజే ఒకరే, మేయర్ మనవారే" అని రౌత్ అన్నారు. అయితే ఈ వ్యాఖ్యలను మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ తోసిపుచ్చారు. "ఒకవేళ బాల్‌ఠాక్రే బతికి ఉంటే ఇది సాధ్యమయ్యేది.కానీ వీరివల్ల కాదు ఏక్ నాథ్ శిండేని ముంబైలో అడుగుపెట్టనివ్వమన్నారు. కానీ 50మంది ఎమ్మెల్యేలతో కలిసి ఆయన ప్రభుత్వం ఏర్పాటు చేశారు" అని ఠాక్రే సోదరులను ఫడ్నవీస్ దుయ్యబట్టారు.

## ఘాటూ"ఇంటర్నెట్ నాకు తెలియదు": అజిత్ దోవల్



అజిత్ దోవల్ ఇండియన్ జేమ్స్ బాండ్‌గా పిలుచుకునే ఈ ఆఫీసర్ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. భారత గూఢచారిగా ఎన్నో సీక్రెట్ మిషన్లలో పాల్గొని దేశ భద్రతలో కీలక పాత్ర పోషించారు. తాజాగా ఆయన ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను ఇంతవరకూ ఇంటర్నెట్ వాడడం లేదని, మెబైల్‌కు సైతం చాలావరకూ దూరంగా ఉంటానని తెలిపారు. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ మాతృభూమి రక్షణ కోసం అనునిత్యం తపించే ఈ ఆఫీసర్ దేశం కోసం ఎన్నో రిస్కీ ఆపరేషన్‌లు చేశారు. 1980 దశకంలో పాకిస్థాన్‌లో ఏడేళ్లపాటు ముస్లిం వ్యాపారిగా, బిచ్చగాడిగా నటిస్తూ భారత్‌కు ఎంతో కీలక సమాచారాన్ని చేరవేశారు. అంతేకాకుండా అమృత్ సర్ గోల్డెన్ టెంపుల్‌లో నక్కిన మిలిటెంట్లను బయిటకి తీసేందుకు అండర్ కవర్ ఏజెంట్‌గా పనిచేశారు. ఇలా భారత్ కోసం ఆయన ప్రాణాలు తెగించి చేసిన ఆపరేషన్‌లు అనేకం. అందుకే ఆయనను అందరూ ఇండియన్ జేమ్స్‌బాండ్ అని పిలుచుకుంటారు. అయితే శనివారం ఢిల్లీ భరత మండపంలో జరిగిన వికసిత్ భారత్ యంగ్ లీడర్స్-2026- కార్యక్రమం జరిగింది. అందులో అజిత్ దోవల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిస్తూ" నేను అసలు ఇంటర్నెట్ వినియోగించను. ఇది నిజం అంతేకాకుండా మెబైల్ ఫోన్ అసలు వాడను. కేవలం విదేశాల్లో ఉన్నప్పుడు మా కుటుంబసభ్యులతో మాట్లాడడానికి తప్ప దానిని వినియోగించను. నాపని అంతా అలానే సాగుతుంది" అని అజిత్ దోవల్ అన్నారు. 1945లో ఉత్తరాఖండ్‌లో జన్మించిన అజిత్ దోవల్ 1968లో ఐపీఎస్ సాధించి కేరళ క్యాడర్‌కు ఎంపికయ్యారు. కాందహార్ ఫ్లైట్ హైజాక్ సమయంలో భారత్ తరపున చర్చలలో పాల్గొన్నారు. అంతేకాకుండా అత్యంత చిన్న వయసులో కీర్తి చక్ర అవార్డుకు ఎంపికయిన పోలీసు ఆఫీసర్‌గా ఆయన రికార్డు సృష్టించారు. అజిత్ దోవల్ ఇంటిలిజెన్స్, ఇంటర్నల్ సెక్యూరిటీ, కౌంటర్ టెర్రరిజం విభాగాల్లో దశాబ్దాల కాలం పాటు భారత్‌కు సేవలందించారు

## 2026లో తొలి ప్రయోగానికి ఇస్రో సిద్ధం



భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) 2026 సంవత్సరంలో తన తొలి ప్రయోగానికి సిద్ధమైంది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్డీఓ) రూపొందించిన 'అన్వేష' భూపరిశీలన ఉపగ్రహాన్ని పీఎస్ఎల్వీ-సీ62 రాకెట్ ద్వారా అంతరిక్షంలోకి పంపనుంది. ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి జనవరి 12వ తేదీ ఉదయం 10:17 గంటలకు ఈ ప్రయోగం జరగనుంది. ఇందుకు సంబంధించిన 22.5 గంటల కౌంట్‌డౌన్ ఆదివారం మధ్యాహ్నం 12:17 గంటలకు మొదలైంది. 'అన్వేష' ఉపగ్రహం దేశ రక్షణ, వాతావరణ అధ్యయన రంగాల్లో అత్యంత కీలకం కానుంది. హైపర్‌స్పెక్ట్రల్ ఇమేజింగ్ టెక్నాలజీతో పనిచేసే ఈ ఉపగ్రహం భూమి ఉపరితలాన్ని అత్యంత సూక్ష్మంగా పరిశీలించగలదు. దీని ద్వారా సరిహద్దుల వద్ద పర్యవేక్షణ, వ్యూహాత్మక నిఘా కార్యకలాపాలకు కీలక సమాచారం అందుతుంది. అంతేకాకుండా, వాతావరణ మార్పులను అధ్యయనం చేయడం, తుఫానులు, వరదలు వంటి ప్రకృతి విపత్తులను ముందుగానే పసిగట్టి హెచ్చరికలు జారీ చేయడంలో ఇది సహాయపడనుంది. ఈ మిషన్‌లో 'అన్వేష' ప్రధాన ఉపగ్రహం కాగా, దీనితో పాటు మరో 15 చిన్న ఉపగ్రహాలను కూడా ఒకేసారి నింగిలోకి పంపుతున్నారు. వీటిలో 7 దేశీయ, 8 విదేశీ ఉపగ్రహాలు ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ 'టేక్‌మీ2స్పేస్' రూపొందించిన ఉపగ్రహం కూడా వీటిలో ఉండటం విశేషం. పీఎస్ఎల్వీ రాకెట్‌కు ఇది 64వ మిషన్. షార్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఈ ప్రయోగం జరగనుండగా, ఇస్రో శాస్త్రవేత్తలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. భారత అంతరిక్ష ప్రయోగాల్లో మరో మైలురాయిగా నిలవనున్న ఈ ప్రయోగంపై దేశవ్యాప్తంగా సర్వత్రా ఆసక్తి నెలకొంది.

## భారత్‌పై దాడులకు వేలమంది బాంబర్లు సిద్ధం



నిషేధిత ఉగ్రవాద సంస్థ జైషే మహ్మద్ (జీవవీ) చీఫ్ మసూద్ అజహర్‌దిగా చెబుతున్న ఓ కొత్త ఆడియో రికార్డింగ్ ఆదివారం ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమైంది. భారత్‌పై దాడులకు వేలాది మంది ఆత్మాహుతి దళ సభ్యులు సిద్ధంగా ఉన్నారంటూ అందులో చేసిన హెచ్చరికలు సోషల్ మీడియాలో తీవ్ర దుమారం రేపుతున్నాయి. ఈ ఆడియో క్లిప్ వైరల్ కావడంతో నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆడియో క్లిప్‌లో, వెయ్యి మందికి పైగా ఆత్మాహుతి బాంబర్లు ఏ క్షణంలోనైనా భారత్‌ను లక్ష్యంగా చేసుకుని దాడులకు దిగేందుకు సిద్ధంగా ఉన్నారని అజహర్ చెప్పినట్టుగా ఉంది. "వీళ్లు ఒకరు, ఇద్దరు, వంద కాదు.. వెయ్యి మంది కూడా కాదు. అసలు సంఖ్య చెబితే ప్రపంచ మీడియాలో రేపు పెను సంచలనం అవుతుంది" అని అందులో హెచ్చరించాడు. తమ యోధులు ప్రాపంచిక సుఖాల కోసం కాకుండా 'షహాదత్' (అమరత్వం) కోసం సిద్ధంగా ఉన్నారని కూడా ఆ వాయిస్ పేర్కొంది. అయితే, ఈ ఆడియో రికార్డింగ్ ఎప్పటిది, దీని ప్రామాణికత ఎంతవరకు నిజమనే విషయంపై ఇంకా స్పష్టత రాలేదు. దీనిని స్వతంత్రంగా ధృవీకరించాల్సి ఉంది. ఐక్యరాజ్యసమితి ద్వారా అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించబడిన మసూద్ అజహర్, పాకిస్థాన్ గడ్డపై నుంచి భారత్‌పై విషం చిమ్ముతూ అనేక ఉగ్రదాడులకు కుట్ర పన్నిన విషయం తెలిసిందే. 2001 పార్లమెంట్ దాడి, 2008 ముంబై దాడులతో సహా పలు భారీ ఉగ్రవాద ఘటనలకు ఇతడే ప్రధాన సూత్రధారి. 'ఆపరేషన్ సిందూర్'లో భారత బలగాల చేతిలో భారీగా నష్టపోయిన తన సంస్థకు మళ్లీ ఊపు తేవడానికే అజహర్ ఈ బెదిరింపులకు దిగి ఉంటాడని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది కేవలం ప్రచారం కోసం చేస్తున్న ఓ ఉత్తుత్తి బెదిరింపుగానే వారు అభివర్ణిస్తున్నారు.

## పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీ రద్దీ



సంక్రాంతి పండుగకు పట్నం వాసులు పల్లెబాట పట్టారు. వరుస సెలవుల నేపథ్యంలో సొంతూర్లకు వెళుతున్నారు. దీంతో పంతంగి టోల్ ప్లాజా వద్ద భారీ రద్దీ నెలకొంది. నిన్న ఒక్కరోజే సిటీ నుంచి ఏపీకి 60 వేల వాహనాలు వెళ్లాయని టోల్ ప్లాజా సిబ్బంది తెలిపారు. ఈ రోజు ఆదివారం కావడంతో మరింత ఎక్కువ రద్దీ నెలకొందని చెప్పారు. మరోవైపు రోడ్డు నిర్మాణ పనులతో ఏపీలోని నందిగామ వద్ద భారీ ట్రాఫిక్ జామ్ అయింది. సొంత వాహనాలలో జనం రోడ్డెక్కడంతో హైదరాబాద్- విజయవాడ రహదారిపై భారీ రద్దీ నెలకొంది. వాహనాలు నెమ్మదిగా సాగుతున్నాయి. రద్దీ కారణంగా ఏపీ వైపు వెళ్లే వాహనాల కోసం ఎక్కువ టోల్‌బూత్‌లు తెరిచారు.

## ఆస్పత్రి నుంచి సోనియా డిశ్చార్జ్



**న్యూఢిల్లీ:** కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ(79) ఆదివారం సాయంత్రం 5 గంటలకు ఢిల్లీలోని సర్ గంగారామ్ హాస్పిటల్ నుంచి డిశ్చార్జి అయ్యారు. ఛాతీలో ఏర్పడిన ఇన్ఫెక్షన్ కారణంగా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారడంతో వారం క్రితం ఆమెను ఆస్పత్రిలో చేర్పించారు. సోనియా గాంధీ పూర్తి స్థాయిలో కోలుకుని ఆరోగ్యంగా ఉన్నారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. ఇంటివద్దే వైద్య చికిత్సలు కొనసాగించాలని ఆమెకు సూచించామని ఓ అధికారి తెలిపారు.

# మేడారంలో భక్తుల రద్దీ

-మొదటిపేజీ తరువాయి

పోలీసులు అనుమతించడం లేదు. మేడారంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పర్యటించారు. ఆయనతో పాటు మంత్రులు కొండా సురేఖ, సీతక్క, శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌లు ఈ పర్యటనలో పాల్గొన్నారు. అధికారులతో కలిసి మేడారం జాతర పనులపై సమీక్షా సమావేశం నిర్వహించిన అనంతరం మీడియాతో మాట్లాడారు.



**తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక**

మేడారం మహాజాతర తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీక అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మహాజాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. మేడారంలో శాశ్వత నిర్మాణాలు జరుగుతున్నాయని, రూ.251 కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. మరో 2 రోజుల్లో పనులన్నీ పూర్తవుతాయని వెల్లడించారు.

"సమ్మక్క-సారలక్కలకు సంబంధించిన ఉత్సవాలను కేవలం ఒక జాతరగానే కాకుండా తెలంగాణ గుండె చప్పుడులాగా, ప్రజల ఆత్మగౌరవ ప్రతీకలాగా దీన్ని దేశానికి ప్రపంచానికి చాటి చెప్పాలనే ఉద్దేశంతోనే మా ప్రభుత్వం శాశ్వత నిర్మాణాలను చేపట్టింది. లక్షలాదిగా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. ఇప్పటికే జాతరకు సంబంధించి రూ.150 కోట్లు, అలాగే శాశ్వత నిర్మాణాలకు రూ.101 కోట్లు ఖర్చు చేస్తున్నాం. అభివృద్ధి పనులు నిధుల ఖర్చుపై ఇక్కడే అధికారులతో కలిసి సమావేశం నిర్వహించడం జరిగింది. పనులు చక్కగా జరుగుతున్నాయి. కొద్ది పనులు ఇంకో రెండు మూడ్రోజుల్లో పూర్తి కాబోతున్నాయి. ఈ జాతరకు దేశం, ప్రపంచంలో మంచి పేరు ప్రఖ్యాతలు వచ్చే విధంగా చేయబోతున్నాం. అదే విధంగా వనదేవతల ఆశీస్సులు కూడా తెలంగాణ ప్రజలపైన ఉండే విధంగా కోరుకుతున్నా" -భట్టి విక్రమార్క, డిప్యూటీ సీఎం

**వనదేవతలను దర్శించుకున్న భట్టి**

డిప్యూటీ సీఎం బృందం ఆర్టీసీ బస్టాండ్, జంపన్న వాగు వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులు మరింత వేగవంతం చేయాలని దిశా నిర్దేశం చేశారు. మేడారం మహా జాతర తెలంగాణ గుండెచప్పుడుగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అభివర్ణించారు. రూ. 251 కోట్లతో కనివిని ఎరుగని రీతీలో అభివృద్ధి పనులు చేస్తున్నామని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా శాశ్వత నిర్మాణాలు చేపట్టామని తెలిపారు. సమీక్షా సమావేశం అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తో పాటు మంత్రులు వనదేవతలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మేడారం జాతర ఈ నెల జనవరి 28 నుంచి 31 వరకు అంగరంగ వైభవంగా జరగనుంది. దీనికి తెలంగాణతో పాటు చుట్టుపక్కల ఉండే రాష్ట్రాల నుంచి కోటి మందికి పైగా భక్తులు తరలి వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఒక రోజు రాత్రి మేడారంలోనే బస చేయనున్నట్లు అధికార వర్గాలు వెల్లండించాయి. మంత్రుల సీతక్క, కొండా సురేఖలు ఇటీవల మాజీ సీఎం కేసీఆర్‌ను జాతరకు రావాలని ఎర్రవల్లి ఫాంహౌస్‌కు వెళ్లి ఆహ్వానించిన విషయం విధితమే.

# శరవేగంగా ఫ్యూచర్ సిటీ!

-మొదటిపేజీ తరువాయి

రంగారెడ్డి జిల్లా మీర్‌ఖాన్‌పేట్, బేగరికంచ గ్రామాల పరిధిలో ఫ్యూచర్ సిటీ నిర్మాణమవుతోంది. ఇటీవల ఇదే ప్రాంతంలో నిర్వహించిన తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్-2047 విజయవంతం కావడంతో నిరంతర అభివృద్ధి కార్యక్రమాలు ఊపందుకోనున్నాయి. ఐటీ, ఫార్మా సంస్థలతో పాటు గేమింగ్ జోన్లు, వినోద కేంద్రాలు కూడా ఇక్కడ ఏర్పాటు చేయనున్నారు.



**ఆన్‌లైన్ ద్వారానే అన్నీ రకాల అనుమతులు**

తొలిదశలో 32 గ్రామాల పరిధిలో 432 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ఫ్యూచర్ సిటీ నిర్మించాలని ప్రతిపాదించగా, భవిష్యత్ విస్తరణకు అనువుగా 56 గ్రామాలు, 765 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో నిర్మాణం కానుంది. ఇందులో ఇళ్లు, బహుళ అంతస్తుల భవనాలు, పరిశ్రమలు, ప్రైవేటు విద్యా సంస్థలు ఏర్పాటుకు అనుమతులు ఇచ్చేందుకు ఆన్‌లైన్ ద్వారా అప్లికేషన్లను స్వీకరించనున్నారు.

**20 మంది సర్వేయర్లు**

ఫ్యూచర్‌సిటీ పరిసర ప్రాంతాల్లో ప్రైవేటు భూములు, పట్టాలు, ప్రభుత్వ భూముల సరిహద్దులను నిర్ణయించేందుకు ప్రత్యేకంగా ఇరవై మంది సర్వేయర్లను ప్రభుత్వం నియమించింది. మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్‌సిటీ శాశ్వత భవన కార్యాలయాన్ని ఫిబ్రవరి నెలాఖరులోపు ప్రారంభించేందుకు అధికార వర్గాలు సన్నాహాలు చేస్తున్నారు. ఫ్యూచర్‌సిటీకి సంబంధించి కీలక అంశాలను ప్రశ్నలు, సమాధానాల రూపంలో ఫ్యూచర్‌సిటీ తెలంగాణ పోర్టల్‌లో అందులో ఉంచారు. ఇందులో ఇళ్ల నిర్మాణాలు, ప్లాట్ల క్రయవిక్రయాలకు సంబంధించిన పూర్తి వివరాలు ఉన్నాయి. ప్రాజెక్టుపై ప్రజల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేసేందుకు వెబ్‌సైట్‌లో ప్రశ్నలు-సమాధానాలు (ఖీూుం) డిపార్ట్‌మెంట్‌ను కూడా ఏర్పాటు చేశారు.

**భారత్ ఫ్యూచర్ సిటీలో డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానం**

భారత్ ఫ్యూచర్ సిటీలో డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానం (డీసీఎస్) అమలులోకి తేనున్నారు. ఏసీ లేకుండానే చల్లబర్చే డీసీఎస్‌ను కొత్తగా నిర్మించే నగరాలు, టౌన్‌షిప్పులు, మాల్స్‌లో ఇప్పుడు ఎక్కువగా వాడుతున్నారు. తెలంగాణలో మొదటగా ఫ్యూచర్‌సిటీలో అమలుకు సర్కారు వివిధ ప్రణాళికలు సైతం సిద్ధం చేసింది. ఇటీవల తెలంగాణ విజన్ 2047 డాక్యుమెంట్‌లో దీని గురించి ప్రకటన సైతం చేశారు. ఈ ఫ్యూచర్ సిటీలో సెంట్రల్ బిజినెస్ డిస్ట్రిక్ట్(సీబీడీ) అత్యంత కీలకం కానుంది. సీబీడీని క్రమంగా పలు జోన్లుగా అభివృద్ధి చేస్తారు. ఇందులో 300 ఎకరాల్లో ఏఐ సిటీ, 200 ఎకరాల్లో హెల్త్ సిటీ, 500 ఎకరాలను ఎడ్యుకేషన్ హబ్‌గా మారుస్తారు. 3 వేల ఎకరాల్లో లైఫ్ సైన్సెస్ హబ్‌ను డెవలప్ చేయనున్నారు. ఇక్కడ డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానాన్నే అమలు చేయనున్నారు. గుజరాత్‌లోని గిఫ్ట్ సిటీలో డిస్ట్రిక్ట్ కూలింగ్ విధానాన్నే వాడుతున్నారు. అలానే రాష్ట్రంలోని పోచారంలో ఇన్ఫోసిస్, ఐటీ కారిడార్‌లోని ఒక గేటెట్ కమ్యూనిటీలో ఈ తరహాలోనే కూలింగ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పుడు అధునాతమైన డీసీఎస్‌ను సిటీకి ప్రభుత్వం పరిచయం చేయనుంది.

# మద్యప్రవాహానికి అడ్డుకట్టే లేదా?

ఆంగ్ల నూతన సంవత్సర ఆరంభ వేళ యావత్ భారతా వని సిగ్గుతో తలదించు కోవాల్సిన దృశ్యాలు దేశ వ్యాప్తంగా ఆవిష్కృతమయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీ మొదలుకొని హైదరాబాద్, విజయవాడ వరకు నగరాలన్నీ ఒకే రకమైన అనాగరిక ప్రవర్తనకు వేదికలయ్యాయి. ఫుల్లుగా మద్యం సేవించిన మందుబాబులు రోడ్లపై వేసిన వీరంగం చూస్తే వెనుకబడిన దేశాల్లో కూడా ఇలాంటి వికృత చేష్టలు ఉండవేమోనన్న భావన కలుగుతుంది. పీకల దాకా తాగి తామేమి చేస్తున్నామో కనీస స్పృహ లేకుండా ఫుట్‌పాత్‌లపై పడిపోవడం, వాంతులు చేసుకోవడం, శాంతిభద్రతలు పరిరక్షించే పోలీసులతో వాగ్వాదానికి దిగడం వంటి దృశ్యాలు వీక్షకులకు తీవ్ర ఇబ్బంది కలిగించాయి. కొత్త సంవత్సరాన్ని ఆహ్వానించడం అంటే కేవలం మద్యం, గంజాయి, ఇతర మత్తు పదార్థాల్లో మునిగి పోవడమేనా? దేశంలోని 29 రాష్ట్రాల గణాంకాలను పరిశీలిస్తే, డిసెంబర్ 31న జరిగిన మద్యం అమ్మకాల్లో తెలంగాణ ప్రథమ స్థానంలో నిలవగా, ఆంధ్రప్రదేశ్ ద్వితీయ స్థానాన్ని ఆక్రమించింది. డిసెంబర్ 30 నుంచి జనవరి 1 వరకు కేవలం మూడు రోజుల్లోనే తెలంగాణలో రూ. 1,671 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి. ఇందులో గ్రేటర్ హైదరాబాద్ వాటానే అత్యధికం. ఒక నిమిషానికి తెలంగాణలో 95 బాటిళ్లు, ఆంధ్రప్రదేశ్‌లో 93 బాటిళ్ల చొప్పున అమ్ముడయ్యాయంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. పెట్టుబడుల ఆకర్షణలో పోటీ పడాల్సిన రాష్ట్రాలు, మద్యం అమ్మకాల్లో పోటీ పడటం శోచనీయం.

**యువత భవితవ్యం ప్రశ్నార్థకం**

మద్యం అలవాటు క్రమంగా గంజాయి, ఇతర ప్రమాదకర మత్తుపదార్థాల వైపు మళ్లుతోంది. విదేశీ వికృత సంస్కృతికి అద్దం పట్టే రేవ్ పార్టీలు ఇప్పుడు నగరాల శివార్లలోని ఫామ్‌హౌస్‌లలో గుట్టుచప్పుడు కాకుండా సాగిపోతున్నాయి. పోలీసులు దాడులు చేసి కేసులు పెడుతున్నా, డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడం సాధ్యం కావడం లేదు. కేవలం మద్యం తాగడానికే పరిమితం కాకుండా, యువత మాదక ద్రవ్యాల చీకటి వ్యాపారంలో కూరుకుపోతోంది. అంతర్జాతీయ ముఠాల ప్రమేయంతో సరిహద్దులు దాటి మత్తు పదార్థాలు దేశంలోకి దిగుమతి అవుతున్నాయి. మరీ దారుణమైన విషయం ఏమిటంటే, స్కూల్ పిల్లలు ఇష్టంగా తినే చాక్లెట్లలో కూడా మత్తు పదార్థాలు కలిపి విక్రయిస్తున్నట్లు నిఘా వర్గాలు వెల్లడించాయి. భావి భారత పౌరులుగా ఎదగాల్సిన విద్యార్థులు పాఠశాల స్థాయిలోనే ఇలాంటి వ్యసనాలకు బానిసలైతే దేశ భవిష్యత్తు ఏమవుతుంది? తమ కష్టార్జితాన్ని పిల్లల చదువుల కోసం వెచ్చిస్తున్న తల్లిదండ్రులకు తమ బిడ్డలు మత్తులో జోగుతున్నారని తెలిస్తే వారి గుండెలు పగిలిపోవా? మాదక ద్రవ్యాల సరఫరాను అడ్డుకోవడానికి అత్యాధునిక సాంకేతికత, సుశిక్షితులైన పోలీసు యంత్రాంగం అవసరం. కానీ అనేక రాష్ట్రాల్లో అటువంటి ప్రత్యేక నియంత్రణ వ్యవస్థలు లోపించాయి. పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాల్లో వ్యవసాయం ముసు గులో గంజాయి సాగు చేస్తూ, దేశ ఆర్థిక వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసే కుట్రలు జరుగుతున్నాయి. మానవ వనరులను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా సాగుతున్న ఈ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఉంది.

**ప్రభుత్వాల ద్వంద్వ ప్రమాణాలు**

మరోవైపు ప్రభుత్వాల ద్వంద్వ నీతి కూడా విమర్శలకు తావిస్తోంది. మాదక ద్రవ్యాల వినియో గానికి వ్యతిరేకంగా ర్యాలీలు, అవగాహన కార్యక్ర మాలు నిర్వహిస్తున్న ప్రభుత్వాలు, మద్యం అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయం కోసం ఎందుకు పాకులాడు తున్నాయి? మద్యం కూడా ఒక మత్తు పదార్థమే కదా! దానివల్ల కలిగే అనర్థాల గురించి ఎందుకు ప్రచారం చేయడం లేదు? ఆదాయం కోసం ప్రజల

## అసలు ఫైట్ మాతోనే..
## బీజేపీ ఏనాటికీ ప్రత్యామ్నాయం కాదు..



తెలంగాణలో బీజేపీ ఏనాటికి ప్రత్యామ్నాయం కాబోదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. 24 నెలల కాంగ్రెస్ పార్టీ అసమర్థ పాలనకు, గత పదేండ్లలో జరిగిన అద్భుతమైన అభివృద్ధికి మధ్య తేడాను ప్రజలు బేరీజు వేసుకుంటున్నారని తెలిపారు. కచ్చితంగా మరోసారి బీఆర్ఎస్ వేపే నిలిచేందుకు ప్రజలు సంసిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. అందుకే ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఎన్నికల నుంచి మొదలుకొని పంచాయతీ సర్పంచ్‌ల వరకు ప్రతి ఎన్నికల వరకు ప్రతి ఎన్నికల్లో బీఆర్ఎస్ వైపే ప్రజలు నిలబడ్డారని పేర్కొన్నారు. ఆదిలాబాద్, మెదక్ జిల్లాలకు సంబంధించిన జిల్లా అధ్యక్షులు, పార్టీ ముఖ్య నేతలు, ప్రజాప్రతినిధులతో పురపాలక ఎన్నికల సమావేశాన్ని నిర్వహించారు. ఈ రెండు జిల్లాల్లో పార్టీ అనుసరించాల్సిన మున్సిపల్ ఎన్నికల వ్యూహాన్ని, ఇతర అంశాలపై కేటీఆర్ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెండు సంవత్సరాల కింద జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ సాధించిన విజయం గాలివాటమేనని అన్నారు. ఆనాడు దేశంలోని రాజకీయ పరిస్థితులు కేవలం ద్విధృవంగా మారడం, ఎన్నడూ లేని ఒక విభిన్నమైన పరిస్థితి ఏర్పడటం వల్ల బీజేపీ గెలిచిందే తప్ప.. గతంలో కానీ.. భవిష్యత్తులో కానీ బీజేపీకి తెలంగాణలో క్షేత్రస్థాయిలో బలం లేదని తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రతి ఒక్క బీజేపీ సీనియర్ నేత ఘోరమైన ఓటమిని చవిచూశారని గుర్తుచేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో మాత్రం గాలివాటంగా గెలిచారని అన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీ కాబోదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ అరాచకాలపై, అవినీతిపై, అక్రమాలపై 24 నెలలుగా తెలంగాణ ప్రజల పక్షాన కొట్లాడుతున్న బీఆర్ఎస్ మాత్రమే ప్రత్యామ్నాయమని తెలిపారు. మొన్నటి పంచాయతీ ఎన్నికల్లో చేసిన అధికార దుర్వినియోగం, చెప్పిన తప్పుడు లెక్కలు అన్నీ రానున్న మున్సిపల్ ఎన్నికల్లో తేలిపోతాయని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలను మోసం చేస్తున్నప్పటికీ.. కృష్ణా జలాల నుంచి మొదలుకొని అంతర్‌రాష్ట్ర వ్యవహారాల్లో తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నా.. బీజేపీ ఒక్క మాట కూడా మాట్లాడటం లేదని విమర్శించారు. తెలంగాణ ప్రయోజనాలకు, భవిష్యత్తుకు వ్యతిరేకులైన ఈ రెండు జాతీయ పార్టీలను, వారి తెలంగాణ వ్యతిరేక ఎజెండాలను ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. ఈ రెండు పార్టీలకు రానున్న రోజుల్లో ప్రజలు తగిన బుద్ధి చెబుతారని అన్నారు. పురపాలక ఎన్నికల్లో సమిష్టిగా కలిసి కొట్లాడి కాంగ్రెస్‌పై ఘనమైన విజయం సాధించేలా ప్రయత్నం చేయాలని ఆదిలాబాద్, మెదక్ జిల్లా నాయకులకు కేటీఆర్ ఈ సందర్భంగా సూచించారు. ఇందుకోసం ఎక్కడికక్కడ కాంగ్రెస్ పార్టీ పరిపాలన వైఫల్యాలను, హామీల అమలు మోసాన్ని ప్రజల దగ్గరికి తీసుకుపోవాలన్నారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లోని మున్సిపాలిటీలలో ఉన్న స్థానిక పరిస్థితులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేటీఆర్‌తో పాటు పార్టీ సీనియర్ నేత, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఈ సమావేశంలో పాల్గొని అనేక అంశాల పైన పార్టీ శ్రేణులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. పార్లమెంట్ ఎన్నికల నాటికి ఇప్పటికి బీజేపీ గ్రాఫ్ తెలంగాణలో దాదాపుగా పడిపోయిందని, రానున్న ఎన్నికల్లో పోటీ ముమ్మాటికీ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ మధ్యలోనే ఉంటుందని పార్టీ నేతలు క్షేత్రస్థాయిలోని పరిస్థితులను పార్టీ సీనియర్ నేతలకు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇళ్లకు సంక్రాంతి కానుక

-మొదటిపేజీ తరువాయి

కొండా సురేఖ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లపై కీలక ప్రకటన చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ఎంత వేగంగా పూర్తయ్యే కొద్ది అంతే వేగంతో లబ్దిదారుల అకౌంట్లో నిధులు జమ చేయనున్నట్లు ప్రకటించారు. ప్రతీవారం లబ్దిదారుల అకౌంట్లోకి డబ్బులు విడుదల చేసేలా అధికారులకు ఆయన ఆదేశాలిచ్చారు. బిల్లులు విడుదల చేయడంలో ఎలాంటి జాప్యం జరగకూడదని, వీలైనంత త్వరగా రిలీజ్ చేయాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున మంజూరు చేయగా.. ఇప్పటివరకు ప్రభుత్వం 22 వేల 500 కోట్లు విడుదల చేసింది. త్వరలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కూడా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గ్రామాల్లోని కాకుండా పట్టణాల్లోని ప్రజలకు కూడా ఇళ్లను కేటాయించేందుకు రెడీ అవుతోంది.

**రామగుండంలో పవర్ ప్లాంట్**

రామగుండంలో త్వరలో 800 మెగావాట్ల థర్మర్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వస్తుందని తెలిపారు. అటు పారిశ్రామికంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేయనున్నట్లు స్పష్టం చేశారు. సింగరేణి సంస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందదని, అందుకోసం అన్ని రకాలుగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. సింగరేణి కార్మికులకు కోటి రూపాయల ప్రమాద బీమా ఇప్పటికే ప్రవేశపెట్టినట్లు స్పష్టం చేశారు. కేవలం బొగ్గుకు మాత్రమే కాకుండా సింగరేణిని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తామని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధిలో సింగరేణి పాత్ర కీలకంగా ఉందని పేర్కొన్నారు.

## ఎన్నికల నిర్వహణ ప్రక్రియ..
## బెల్జియంకు తెలంగాణ సీఈఓ



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సుదర్శన్ రెడ్డి ఎన్నికల నిర్వహణలో అనుభవాల మార్పిడి, ఉత్తమ విధానాల అధ్యయనం లక్ష్యంగా మూడు రోజుల అధికారిక పర్యటనకు బెల్జియంకు బయలుదేరారు. బెల్జియన్ ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ ఇంటీరియర్ నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు ఈ పర్యటన జరుగుతోంది. ఈ సందర్భంగా ఎన్నికల ప్రక్రియల్లో పారదర్శకత, సమగ్రత, సామర్థ్యాన్ని మెరుగుపర్చే అంశాలపై రెండు దేశాల అధికారుల మధ్య విస్తృత స్థాయి చర్చలు జరగనున్నాయని అధికారులు తెలిపారు. సీఈఓ సుధర్శన్ రెడ్డి నేతృత్వంలోని బృందంలో ఖమ్మం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అనుదీప్ దురిశెట్టి, సీఈఓ కార్యాలయ రాష్ట్ర శిక్షణ నోడల్ అధికారి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ బోయపాటి చెన్నయ్య, ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఈఆర్వో కంకనాల అనంత రెడ్డి, నాంపల్లి నియోజకవర్గం పోలింగ్ స్టేషన్ నం.97 బూత్ స్థాయి అధికారి వేముల ధ్రువ కుమార్ రెడ్డి ఉన్నారు. పర్యటనలో భాగంగా బెల్జియన్ ఎఫ్‌పీఎస్ ఇంటీరియర్, ఎఫ్‌పీఎస్ ఫారిన్ అఫైర్స్ ఉన్నతాధికారులతో సమావేశాలు, కేయూ లూవెన్ యూనివర్సిటీ నిపుణులతో చర్చలు, బ్రస్సెల్స్‌లోని భారతీయ రాయబార కార్యాలయంలో సేవా ఓటర్లతో పరస్పర చర్యలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం ఇండియా ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డెమోక్రసీ అండ్ ఎలక్షన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో జరుగుతున్న అంతర్జాతీయ అవుట్‌రీచ్ కార్యక్రమంలో భాగమని అధికారులు తెలిపారు.

# కుంకుమ పువ్వుతో ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా?



అత్యంత ఖరీదైన సుగంధ ద్రవ్యాల్లో కుంకుమ పువ్వు ఒకటి. ఇది లిల్లీ కుటుంబానికి చెందినది. కుంకుమపువ్వును సేకరించడం చాలా శ్రమతో కూడుకున్న పని. ఇది ఎక్కువగా ఇరాన్, గ్రీస్, మొరాకో, స్పెయిన్, కాశ్మీర్, ఇటలీలలో ఎక్కువగా ఉత్పత్తి అవుతుంది. దీనిని సేకరించడంతోపాటు పండించడం కూడా చాలా కష్టంతో కూడుకున్నది కనుక దీని రేటు ఎప్పుడూ ఎక్కువగానే ఉంటుంది. ఖరీదైన వంటకాల్లో మాత్రమే దీనిని ఎక్కువగా వాడతారు. బిర్యానీ, కుక్కీస్, కేక్స్, స్వీట్స్ తయారీలో కుంకుమపువ్వును ఎక్కువగా వాడతారు. అలాగే కుంకుమపువ్వు ఔషధ లక్షణాలను కూడా కలిగి ఉంటుంది. ఆధునిక ప్రకారం కుంకమపువ్వును కామోద్దీపనగా, దయాఫోరేటిక్ గా, కార్మినేటివ్ గా, ఋతుస్రావం కలిగించడానికి కూడా ఉపయోగించవచ్చు.

**క్యాన్సర్ కణాలకు..**

కుంకుమపువ్వును వాడడం వల్ల మన శరీరానికి ఎంతో మేలు కలుగుతుంది. అనేక ఆరోగ్య ప్రయోజనాలను మనం సొంతం చేసుకోవచ్చు. కుంకుమపువ్వులో క్రోసిన్ అని పిలవబడే ముదురు నారింజ రంగులో ఉండే నీటిలో కరిగే కెరోటిన్ ఉంటుంది. ఇది మానవ క్యాన్సర్ కణాలు, అండాశయ కార్సినోమా, పెద్దప్రేగు అడెనోకార్సినోమా, మృదుకణజాల సార్కోమాలో అపోప్టోసిస్ ( ప్రోగ్రామ్డ్ సెల్ డెత్) ను ప్రేరేపిస్తుందని కనుగొనబడింది. కుంకుమపువ్వు ప్రాణాంతక క్యాన్సర్ కణాలను నిరోధించే సామర్థ్యాన్ని కలిగి ఉందని పరిశోధనల ద్వారా వెల్లడించారు. అలాగే క్యాన్సర్ కణాలను నాశనం చేయడంలో సహాయపడే రోగనిరోధక కణాలైన లింఫోసైట్‌లు ఏర్పడటాన్ని కూడా ప్రేరేపిస్తుంది. అలాగే కుంకుమపువ్వు సారం వయస్సు పైబడడం వల్ల వచ్చే బలహీనతలను తగ్గించడంలో, వయసు పైబడడం వల్ల వచ్చే జ్ఞాపకశక్తి తగ్గుదలను తగ్గించే చికిత్సలో కూడా ఉపయోగపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

**హార్మోన్ సమస్యలకు..**


అదే విధంగా కొందరు బాలికలు వయసు వచ్చినప్పటికీ వారిలో ఋతుక్రమం ప్రారంభమవ్వదు. అలాంటి వారికి పాలల్లో కుంకుమపువ్వు కలిపి ఇవ్వాలి. ఇలా చేయడం వల్ల వారిలో హార్మోన్లు ఉత్తేజితమవుతాయి. లైంగిక కోరికలు, లైంగిక సామర్థ్యం తక్కువగా ఉన్నవారికి కూడా కుంకుమపువ్వు సహాయపడుతుంది. నిద్రించే ముందు ఒక గ్లాస్ పాలలో చిటికెడు కుంకుమపువ్వు కలిపి తీసుకోవాలి. ఇలా తీసుకోవడం వల్ల లైంగిక సామర్థ్యం పెరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. జుట్టు పెరుగుదలను ప్రేరేపించడంలో కూడా కుంకుమపువ్వు మనకు సహాయపడుతుంది. పాలలో కలిపి కుంకుమపువ్వును తీసుకోవడం వల్ల జుట్టు పెరుగుదల చక్కగా ఉంటుంది. జలుబు, జ్వరం వంటి వాటికి చేసే చికిత్సలో కూడా కుంకుమపువ్వు ప్రభావవంతంగా పని చేస్తుంది.

**సీజనల్ వ్యాధులకు..**

జలుబు, జ్వరం వంటి వాటితో బాధపడే వారికి పాలల్లో కలిపిన కుంకుమపువ్వును నుదిటిపై రాయాలి. ఇలా చేయడం వల్ల ఆయా సమస్యల నుండి త్వరగా ఉపశమనం కలుగుతుంది. అలాగే వంటకాల తయారీలో చాలా మంది కృత్రిమ రంగులను వాడుతూ ఉంటారు. అలాంటి కృత్రిమ రంగులకు ప్రత్యామ్నాయంగా కంకుమపువ్వు పనిచేస్తుంది. ఈ విధంగా కుంకుమపువ్వు మన ఆరోగ్యానికి మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అయితే ఇది ఎంత ఆరోగ్యకరమైనదే అయినప్పటికీ దీనిని తక్కువ మొత్తంలో తీసుకోవాలని వారు చెబుతున్నారు. ముఖ్యంగా గర్భిణీలు, పాలిచ్చే తల్లులు దీనిని తీసుకోకపోవడమే మంచిదని వారు తెలియజేస్తున్నారు. ఎక్కువ మొత్తంలో కుంకుమపువ్వు తీసుకోవడం వల్ల కొన్నిసార్లు అది విషపూరితం కూడా కావచ్చని కనుక దీనిని తక్కువ మోతాదులో మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

### ఈ లక్షణాలు కనిపిస్తున్నాయా..?

# అయితే మీ కిడ్నీల పనితీరు మందగించినట్లే..!



మన శరీరంలో అతి ముఖ్యమైన అవయవాల్లో మూత్రపిండాలు కూడా ఒకటి. ఇవి రక్తం నుండి వ్యర్థాలను, అదనపు నీటిని ఫిల్టర్ చేసి మూత్రం ద్వారా బయటకు పంపిస్తాయి. శుభ్రపడిన రక్తాన్ని తిరిగి శరీరానికి పంపిస్తాయి. రక్తాన్ని శుభ్రం చేయడంతో పాటు రక్తపోటును అదుపులో ఉంచడంలో, ఎలక్ట్రోలైట్లను సమతుల్యం చేయడంలో, ఎముకల ఆరోగ్యాన్ని కాపాడడంలో, ఎర్ర రక్త కణాలను ఉత్పత్తి చేయడంలో కూడా మూత్రపిండాలు మనకు సహాయపడతాయి. మూత్రపిండాల ఆరోగ్యం దెబ్బతింటే శరీర మొత్తం ఆరోగ్యం దెబ్బతింటుంది. మూత్రపిండాల పనితీరు సరిగ్గా లేకపోవడం వల్ల శరీరంలో వ్యర్థాలు పేరుకుపోతాయి. శారీరక విధులకు అంతరాయం కలుగుతుంది. ఇది క్రమంగా తీవ్ర అనారోగ్య సమస్యలకు దారి తీస్తుంది. కనుక మూత్రపిండాల ఆరోగ్యాన్ని ఎప్పటికప్పుడు పరీక్షించుకుంటూ ఉండడం చాలా మంచిది.

**మూత్రం రంగులో మార్పు..**

మూత్రపిండాల పనితీరు తగ్గినప్పుడు, మూత్రపిండాలకు సంబంధించిన సమస్యలు వచ్చినప్పుడు ముందుగా కనిపించే లక్షణాలను గమనించడం చాలా అవసరం. ఈ లక్షణాలను గుర్తించడం వల్ల మూత్రపిండాల సమస్యలు మరింత తీవ్రతరం కాకుండా మనం కాపాడుకోవచ్చు. మూత్రపిండాల సమస్యలను తెలియజేసే ముందస్తు హెచ్చరికల గురించి.. అలాగే మూత్రపిండాల ఆరోగ్యాన్ని మెరుగుపరుచుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి.. వైద్యులు వివరిస్తున్నారు. మూత్రపిండాల పనితీరు సరిగ్గా లేనప్పుడు తరచుగా మూత్ర విసర్జన చేయడం లేదా మూత్రం బయటకు తక్కువగా రావడం జరుగుతుంది. అలాగే మూత్రం రంగులో కూడా మార్పులు వస్తాయి. మూత్రపిండాల పనితీరు తగ్గినప్పుడు శరీరంలో ద్రవం ఎక్కువగా ఉంటుంది. దీంతో కాళ్లల్లో వాపు వస్తుంది.

**జీర్ణ వ్యవస్థ సైతం..**

అలాగే మూత్రపిండాల పనితీరు తగ్గడం వల్ల శరీరంలో వ్యర్థాలు ఎక్కువగా పేరుకుపోతాయి. కనుక శరీరం బలహీనంగా అవ్వడం, తరచూ అలసటగా ఉండడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మూత్రపిండాల పనితీరు సరిగ్గా లేకపోవడం వల్ల ఊపిరితిత్తుల్లో ద్రవాలు ఎక్కువగా పేరుకుపోతాయి. కనుక ఊపిరి తీసుకోవడం కష్టంగా మారుతుంది. వ్యర్థాలను తొలగించడం మూత్రపిండాల ప్రాథమిక విధి. వీటి పనితీరు సరిగ్గా లేకపోవడం వల్ల జీర్ణాశయంలో వ్యర్థాలు పేరుకుపోయి జీర్ణవ్యవస్థ పనితీరు మందగిస్తుంది. తద్వారా వికారం, వాంతులు వంటి జీర్ణ సమస్యలు కూడా వస్తాయి. అలాగే మూత్రపిండాల పనితీరు మందగించడం వల్ల రక్తపోటు పెరగడం వంటివికూడా జరుగుతాయి. కనుక ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా వైద్యున్ని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవడం చాలా అవసరం.

**వీటికి దూరంగా ఉండాలి..**

ఇక మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉండాలంటే నీటిని ఎక్కువగా తాగాలి. నీరు ఎక్కువగా తాగడం వల్ల శరీరం నుండి వ్యర్థాలు బయటకు పోతాయి. అలాగే పండ్లు, కూరగాయలు, లీన్ ప్రోటీన్ ఉండే ఆహారాలను ఎక్కువగా తీసుకోవాలి. ఉప్పు, చక్కెర, ప్రాసెస్ చేసిన ఆహారాలను తక్కువగా తీసుకోవాలి. అదేవిధంగా శరీరానికి తగినంత శారీరక శ్రమ ఉండేలా చూసుకోవాలి. తద్వారా రక్తపోటు, శరీర బరువు, షుగర్ వ్యాధి అదుపులో ఉంటుంది. ఇది మూత్రపిండాలపై ఒత్తిడిని తగ్గిస్తుంది. ధూమపానం, మద్యపానం రెండూ కూడా మూత్రపిండాల ఆరోగ్యాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయి. కనుక ఈ రెండింటికీ దూరంగా ఉండడం చాలా మంచిది. మూత్రపిండాల ఆరోగ్యంపై శరీర మొత్తం ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. కనుక మూత్రపిండాల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం చాలా అవసరమని వైద్యులు చెబుతున్నారు.

# మసాలా దినుసుగా ఉపయోగపడే పువ్వు.. అనేక లాభాలను అందిస్తుంది..

క్ఘుతీ

ూఅఅంవ । భారతీయ వంటకాల్లో సుగంధ ద్రవ్యాలకు ఎంతో ప్రాధాన్యత ఉంది. వీటిని అనేక రకాల వంటకాల్లో మనం విరివిగా ఉపయోగిస్తూ ఉంటాం. మనం వంటల్లో వాడే ఈ సుగంధ ద్రవ్యాలన్నీ కూడా మన ఆరోగ్యానికి మేలు చేసేవే. మనం వాడే సుగంద ద్రవ్యాల్లో అనాస పువ్వు కూడా ఒకటి. ఇది చూడడానికి స్టార్ ఆకారంలో చూడగానే ఆకట్టుకునే విధంగా ఉంటుంది. వంటల్లో దీనిని వేయడం వల్ల వాటి వాసనతో పాటు రుచి కూడా పెరుగుతుంది. వంటల్లో వాడడంతో పాటు ఈ అనాస పువ్వు నీటిని తీసుకోవడం వల్ల కూడా మన ఆరోగ్యానికి మేలు కలుగుతుంది. ముఖ్యంగా చలికాలంలో ఈ నీటిని తీసుకోవడం వల్ల మనం అధిక ప్రయోజనాలను పొందవచ్చు. శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, బరువు తగ్గడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో ఇలా అనేక రకాలుగా అనాస పువ్వు నీరు మనకు సహాయపడుతుంది.

**జీర్ణ సమస్యలకు..**

అనాస పువ్వు నీటిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాల గురించి, అలాగే ఈ నీటిని ఎలా తయారు చేసుకోవాలి.. అన్న వివరాలను వైద్యులు వివరిస్తున్నారు. అనాస పువ్వు నీటిని తీసుకోవడం వల్ల మన శరీర బరువు అదుపులో ఉంటుంది. వీటిలో ఉండే పాలీఫినాల్స్, టెర్పెనాయిడ్లు శరీర జీవక్రియలను మెరుగుపరచడంలో సహాయపడతాయి. తద్వారా శరీర బరువు నియంత్రణలో ఉంటుంది. అనాస పువ్వులో అనెథోల్ అనే రసాయన సమ్మేళనం ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. అనాస పువ్వులతో నీటిని తయారు చేసి తీసుకోవడం వల్ల గ్యాస్, ఉబ్బరం వంటి జీర్ణ సంబంధిత సమస్యలు కూడా తగ్గుతాయి. ఈ పువ్వులలో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. వీటితో నీటిని తయారు చేసి తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. ముఖ్యంగా చలికాలంలో ఇన్ఫెక్షన్ లు ఎక్కువగా వస్తూ ఉంటాయి. ఇటువంటి సమయంలో



ఈ నీరు మనకు ఎంతో ఉపయోగపడుతుంది.

**సీజనల్ వ్యాధులకు..**

ఈ నీటిని తరచూ తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు, ఫ్లూ వంటి ఇన్ఫెక్షన్ లు తగ్గుతాయి. అంతేకాకుండా ఈ నీటిని తీసుకోవడం వల్ల చర్మానికి మేలు కలుగుతుంది. వీటిలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు ఫ్రీరాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి చర్మాన్ని కాపాడుతాయి. కనుక ఈ నీటిని తాగడం వల్ల చర్మం పొడిబారడం, మొటిమలు వంటి సమస్యలు తగ్గుతాయి. అనాస పువ్వు శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. వీటితో చేసిన నీటిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల శరీరంలో మంట, వాపు వంటి సమస్యలు తగ్గుతాయి. ఇలా అనేక విధాలుగా అనాస పువ్వు నీరు మనకు మేలు చేస్తుంది. ఇక ఈ నీటిని తయారు చేసుకోవడం కూడా చాలా సులభం.

ఒక గిన్నెలో రెండు కప్పుల నీటిని తీసుకుని అందులో 3 లేదా 4 అనాస పువ్వులను వేసి నీరు రంగు మారే వరకు బాగా మరిగించాలి. తరువాత ఈ నీటిని వడకట్టి అందులో రుచి కోసం తేనె లేదా నిమ్మరసం కలిపి తీసుకోవచ్చు. ఈ విధంగా అనాస పువ్వు నీటిని తీసుకోవడం వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.

# అనుమతులు లేకున్నా.. అక్రమ రవాణా

పెన్‌గంగా నది నుంచి అక్రమంగా ఇసుక తరలింపు
బోటు ద్వారా వెలికితీత.. టిప్పర్లతో సరఫరా..
బేల మండలంలోని కాంగార్‌పూర్ నదిలో తనిఖీలు

ఆదిలాబాద్ : ఆదిలాబాద్ జిల్లాలోని పెన్‌గంగా నుంచి ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా కొనసాగుతున్నది. జైనథ్, బేల, భోరజ్ మండలాల నుంచి దందా జరుగుతున్నది. అనుమతులు లేకుండా టిప్పర్ల ద్వారా అక్రమార్కులు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. భారీ వానలతో పెన్‌గంగాలో మేటలు వేశాయి. ప్రస్తుతం నది ప్రవాహం తగ్గడంతో ఇసుకాసురులు అక్రమ రవాణాకు తెరలేపారు. ఆదిలాబాద్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు కొనసాగుతుండగా.. పంచాయతీ కార్యదర్శులు సిఫార్సు లేఖలతో ట్రాక్టర్ల ద్వారా ఉచితంగా రవాణాకు అధికారులు అనుమతులు ఇస్తున్నారు. ప్రైవేటు అవసరాలకు ట్రాక్టర్‌కు రూ.400 చలాన్ తహసీల్దార్ కార్యాలయంలో చెల్లించివారికి పెన్‌గంగా నుంచి ఇసుక తీసుకుపోవడానికి అనుమతులు మంజూరు చేస్తారు.

**బోటు ద్వారా వెలికితీత**

నదిలో భారీగా ఇసుక నిల్వలు ఉండడంతో అక్రమార్కులు సరికొత్త విధానం అవలంబిస్తున్నారు. బోటు ద్వారా ఇసుకను వెలితీస్తున్నారు. జేసీబీలతో టిప్పర్లలో నింపుతూ జిల్లాలోని వివిధ ప్రాంతాలతోపాటు మహారాష్ట్రకు చేరవేస్తున్నారు. బేల మండలంలోని కాంగార్‌పూర్ వద్ద పెన్‌గంగా నదిలో శనివారం పోలీసులు తనిఖీలు నిర్వహించగా బోటుతోపాటు జేసీబీలు, టిప్పర్లు ఉండగా ఒక జేసీబీ, టిప్పర్లను బేల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గతంలో ఇసుక క్వారీల ఏర్పాటు వల్ల భూగర్భ జలాలకు నష్టం జరుగుతుందని మైనింగ్ అధికారులు నివేదికలు ఇచ్చారు. పెన్‌గంగా నదిలో క్వారీలు ఏర్పాటు చేయడానికి అవకాశం లేదని నివేదికల్లో సూచించారు. ప్రస్తుతం నది నుంచి భారీగా ఇసుకను తరలిస్తుండడంతో రైతులతోపాటు స్థానికులు నష్టపోయే ప్రమాదం ఉంది. ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని స్థానికులు కోరుతున్నారు. బేల మండలంలో పెన్‌గంగా నది నుంచి టిప్పర్ల ద్వారా ఇసుక తరలించడానికి అనుమతుల లేవని తహసీల్దార్ రఘునాథ్‌రావు తెలిపారు.



# పరిషత్ ఎన్నికల్లో ధర్మారంలో సత్తా చాటేందుకు సమిష్టిగా కృషి

రాంబాబును సన్మానించిన పార్టీ నాయకులు

**ధర్మారం :** రానున్న స్థానిక మండల పరిషత్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే ప్రధాన ధ్యేయంగా సత్తా చాటడానికి పార్టీ శ్రేణుల సమిష్టి కృషి చేస్తానని పెద్దపల్లి జిల్లా ధర్మారం బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు తుమ్మల రాంబాబు స్పష్టం చేశారు. రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ రాంబాబును ధర్మారం పార్టీ పట్టణ అధ్యక్షుడిగా నియమించిన విషయం తెలిసిందే. కాగా ధర్మారం మండల కేంద్రం లోని ఆర్బీఎస్ జిల్లా మాజీ సభ్యుడు రామారావు స్వగృహంలో ఆయనను పార్టీ నాయకులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి తనను పార్టీ పట్టణ అధ్యక్షుడిగా రెండో సారి నియమించినందుకు పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, సహకరించిన పార్టీ మండల అధ్యక్షుడు శ్రీధర్, ఇతర పార్టీ నాయకులకు అయన కృతజ్ఞతలు తెలిపారు. మాజీ మంత్రి ఈశ్వర్ ఆదేశానుసార నడుచుకొని స్థానిక కమిటీ పార్టీ మాజీ ప్రతినిధులు, స్థానిక నాయకులు, పార్టీ కార్యకర్తల సహకారంతో ధర్మారంలో పార్టీని బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. పార్టీకి పూర్వ వైభవం తీసుకువస్తానని ఆయన పేర్కొన్నారు. గత పది సంవత్సరాల కాలంలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి ఈశ్వర్ చేసిన అభివృద్ధి పనులను వివరించి రాబోయే మండల పరిషత్ ఎన్నికల్లో ప్రజలను ఓట్ల అడిగి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తానని పేర్కొన్నారు. స్థానిక ఎంపీటీసీ రెండు స్థానాల్లో పార్టీ అభ్యర్థుల విజయం కోసం సమిష్టిగా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. మాజీ మంత్రి ఈశ్వర్ ఆదేశాల మేరకు త్వరలో పార్టీ పట్టణ కమిటీని ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంల పార్టీ మండల అధ్యక్షుడు రాచూరి శ్రీధర్, ఏఎంసీ మాజీ చైర్మన్లు కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, గుర్రం మోహన్ రెడ్డి, ధర్మారం మాజీ సర్పంచ్ పూస్కురు జితేందర్ రావు, ఆర్బీఎస్ జిల్లా మాజీ సభ్యుడు పూస్కురు రామారావు, మండల పరిషత్ మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ రఫీ, నంది మేడారం మాజీ ఎంపీటీసీ మిట్ట తిరుపతి, ధర్మారం మాజీ ఉప సర్పంచ్ ఆవుల లత, పార్టీ సోషల్ మీడియా మండలాధ్యక్షుడు దేవి నళినికాంత్, పార్టీ మండల ఉపాధ్యక్షులు గాజుల రాజు, నాడెం శ్రీనివాస్, వార్డు సభ్యుడు నార ప్రేమ్ సాగర్, మహిళ నాయకురాళ్లు కాంపల్లి అపర్ణ, రేగుల లక్ష్మి, పార్టీ నాయకులు పాక వెంకటేశం, సల్వాజీ మాధవరావు, అర్ధవెల్లి రాము, రాగుల మల్లేశం, ఎండీ షరీఫ్, అయిత వెంకటస్వామి, గోగు దేవేందర్, కాంపల్లి చందు, బోయిని మల్లేశం తదితరులు పాల్గొన్నారు.



# అక్రమాల పుట్ట

**ఆదిలాబాద్:** సర్వే భూరికార్డుల శాఖలో అక్రమాల పుట్ట పగులుతోంది. అధికారం అడ్డుపెట్టుకొని అడ్డగోలుగా అదనపు సేత్వార్లు (సప్లిమెంటరీ సేత్వార్) జారీ చేయడం, అసలు హక్కుదారుల వివరాలు నామరూపాలు లేకుండా చేయడంలో ఈ శాఖ సర్వేయర్లు, అధికారులు రియల్టర్లతో కలిసి నడిపిన అక్రమ భూ దందా ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి. గతేడాది అక్టోబర్‌లో జిల్లా కేంద్రంలోని 65 సర్వే నంబర్‌లో కోట్ల విలువైన 2.10 ఎకరాల భూమికి సంబంధించిన వ్యవహారంలో సప్లిమెంటరీ సేత్వార్ జారీతోనే భూ అక్రమార్కులకు పని సులువైంది. ఈ వ్యవహారంపై బాధితులు జిల్లా పోలీసులకు ఫిర్యాదు ఫిర్యాదు చేయడంతో బడా రియల్టర్లు, వ్యాపారులపై కేసు నమోదైన విషయం తెలిసిందే. ఓ సర్వేయర్‌పై కూడా పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం విధితమే. తాజాగా మావల పరిధిలో జరిగిన మరో ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందింది.

**గతేడాదిలో..**

గత అక్టోబర్‌లో 65 సర్వే నంబర్‌లో 2.10 ఎకరాల భూమాఫియాకు సంబంధించిన వ్యవహారంలో పోలీసులు కేసు నమోదు చేయడం సంచలనం కలిగించింది. ఈడీ ఆధీనంలో, ఎస్‌బీఐ మార్టిగేజ్‌లో ఉన్న భూమికి సంబంధించి రియల్టర్లు కుమ్మక్కై మొదట తహసీల్దార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకొని, ఎలాగైనా ఈ భూమిని ఆక్రమించాలనే ఉద్దేశంతో సర్వే అధికారుల ద్వారా సప్లిమెంటరీ సేత్వార్ తీసుకున్నారు. ఇలా భూములకు సంబంధించి అసలు హక్కుదారుల వివరాలను నామరూపాలు లేకుండా చేసి అదనపు సేత్వార్ జారీ ద్వారా అక్రమార్కులకు రెవెన్యూ, సర్వే, భూరికార్డుల శాఖ అధికారులు వంతుపాడుతూ వస్తున్నారు. తద్వారా ఏళ్లుగా ఒకే దగ్గర పనిచేస్తున్న ఈ శాఖలోని ఉద్యోగుల్లో కొంత మంది కోట్లకు పడగలెత్తారనే ఆరోపణలు లేకపోలేదు.

**తాజాగా మావలలో..**



మావలలో కోట్ల విలువైన 16 గుంటల భూమికి సంబంధించి జరిగిన భూమాఫియాపై బాధితులు 2018లో పోలీసులకు ఫిర్యాదు చేయగా అప్పట్లో కేసు నమోదు చేశారు. విచారణ ముందుకు సాగలేదు. తాజాగా ఆ బాధితులు మళ్లీ పోలీసులను ఆశ్రయించడం, జిల్లా పోలీసులు తిరిగి ఈ కేసుపై దృష్టి సారించడం సంచలనం కలిగిస్తోంది. మావల గ్రామ సర్వేనం.181/4లో అదనపు సేత్వార్ అక్రమంగా జారీ చేయడం, ఫోర్జరీ ఆరోపణలపై పోలీసులు మావల తహసీల్దార్‌ను కొన్ని వివరాలు ఇవ్వాలని వివరణ కోరడం సంచలనం కలిగిస్తుంది.


**భూమిపై హక్కును హరించివేశారు..**

మావలలో కోట్ల విలువైన ఈ భూమికి సంబంధించి ఓ బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు ఆ భూమికి సంబంధించి అదనపు సేత్వార్ జారీ విధానంపై వివరాలు కోరుతూ మావల తహసీల్దార్‌ను వాటిని పంపించాలని కోరడం ఇప్పుడు సంచలనం కలిగిస్తోంది. సర్వే రికార్డులను మార్చివేసి కొంత మంది అధికారులతో కలిసి అక్రమంగా ఆ భూమిని పొందారని, తద్వారా ఆ భూమిపై తన హక్కును హరించారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఇది ఓ భూమికి సంబంధించిన వ్యవహారమే అయినప్పటికీ జిల్లాలో రెవెన్యూ, సర్వే భూరికార్డుల శాఖల అధికారులు ఇటు రిజిస్ట్రేషన్, అటు అదనపు సేత్వార్లు జారీతో ఎలా అక్రమాలకు పాల్పడుతున్నారు.. అసలు హక్కుదారుల వివరాలను నామరూపాలు లేకుండా చేసి రియల్టర్లకు ఎలా వంతు పాడుతున్నారనేది తేటతెల్లం అవుతుంది.

**అదనపు సేత్వార్ జారీ విధానంపై ఆరా..**

అదనపు సేత్వార్ జారీలో జరుగుతున్న అక్రమాలపై పోలీసులు నిశితంగా దృష్టి సారించారు. ఈ సప్లిమెంటరీ సేత్వార్ జారీలో సర్వేయర్లు ఫీల్డ్ పరిశీలన నిర్వహించారా..? ప్రభావిత పట్టాదారులందరికి (పిటిషనర్‌తో సహా) నోటీసులు జారీ చేశారా..? అనే విషయాలపై స్పష్టతనివ్వాలని రెవెన్యూ అధికారులను పోలీసులు కోరడం జరిగింది. ఇదీ ఈ ఒక్క కేసు విషయంలోనే అనుకుంటే పొరపాటే. ఆదిలాబాద్ చుట్టుపక్కల అనేక భూములకు సంబంధించి సప్లిమెంటరీ సేత్వార్ల జారీలో జరిగిన అనేక మోసాలకు ఈ సేత్వార్ జారీ విధానంలో సర్వేయర్లు ప్రభుత్వ నిబంధనల ప్రకారం వ్యవహరించారా లేదా అనేది స్పష్టమవతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్షంగా కృషి చేయాలి..
## ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేతలతో కేటీఆర్..!



రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే లక్షంగా కృషి చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉమ్మడి అదిలాబాద్ నేతలకు సూచించారు. హైదరాబాద్‌లో కేటీఆర్, మాజీ మంత్రివర్యులు హరీష్ రావు ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా నేతలతో మున్సిపల్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపే లక్ష్యంగా నాయకులు కృషి చేయాలని కేటీఆర్ తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కేంద్ర, రాష్ట్రాల్లో అధికారంలో ఉండి కూడా పెద్దగా చేసింది ఏమిలేదన్న విషయాన్ని నగర ప్రజలకు అవగాహన కల్పించాలని కేటీఆర్ చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల వేళ ఇచ్చిన 6 గ్యారంటీలు, 420 హామీల అమలు గాలికొదిలేసిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇంకేమీ చేయలేదని కేటీఆర్ విమర్శించారు. సీఎంకు దోపిడీపై ఉన్న శ్రద్ధ ప్రజలపై లేదనే విషయాన్ని ప్రజలకు వివరించాలని కేటీఆర్ కోరినట్లు ఉమ్మది అదిలాబద్ జిల్లా నేతలు తెలిపారు. బీఆర్ఎస్ 10 ఏళ్లలో చేసిన అభివృద్ధిని వివరించి భైంసా మునిసిపాలిటీని కైవసం చేసుకోవాలన్నట్లు కార్యనిర్వాహక అధ్యక్షుడు దిశా నిర్దేశం చేసినట్లు నాయకులు తెలిపారు. బీఆర్ఎస్ పార్టీ ముధోల్ నియోజకవర్గ సమన్వయ సమితి సభ్యులు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్, విలాస్ గాదెవార్, డా. పడకంటి రమాదేవి, లోలం శ్యాంసుందర్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ జెట్టి
## ఎలిజిబెత్ దంపతులకు ఘన నివాళి



**జై నూర్ :** ఆదివాసీల ఆత్మబంధువులు ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ జెట్టి ఎలిజిబెత్ దంపతులని ఆదిలాబాద్ పార్లమెంటు సభ్యులు గొడం నగేష్ అన్నారు. ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ , జెట్టి ఎలిజిబెత్ దంపతుల 39వ వర్ధంతి సందర్భంగా జిల్లాలోని జైనూర్ మండలం మార్లవాయి గ్రామంలో వర్ధంతిని నిర్వహించి వారి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైమన్ డార్ఫ్ జెట్టి ఎలిజిబెత్ దంపతులు నివసించిన మార్లవాయి ఎంతో చారిత్రాత్మక ప్రాంతమని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను ప్రాంత యువకులు సద్వినియోగం చేసుకొని విద్య, ఉద్యోగ రంగాలలో రాణించాలని తెలిపారు. ఎలాంటి సౌకర్యాలు లేని రోజులలో ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ జెట్టి ఎలిజిబెత్ దంపతులు ఈ ప్రాంతంలో పర్యటించి గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై నివేదిక తయారుచేసి ప్రాంత అభివృద్ధికి చర్యలు తీసుకున్నారని కొనియాడారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రొఫెసర్ హైమన్ డార్ఫ్ జెట్టి ఎలిజిబెత్ దంపతులు స్వాతంత్రం రాకముందే ఈ ప్రాంతంలో పర్యటించి గిరిజనులతో మమేకమై ఆదివాసీల చైతన్యం కోసం కృషి చేశారని, హైమన్ మానవ పరిణామ పర్యావరణవేత్త, గొప్ప శాస్త్రవేత్త అని తెలిపారు. ప్రభుత్వం హైమన్ డార్ఫ్ జెట్టి ఎలిజిబెత్ దంపతుల పేరిట స్మృతి వనం ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఎస్పీ నితికా పంత్, సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థచ ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి యువరాజ్ మర్మాట్, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు మాట్లాడారు. జైనూర్, ఆసిఫాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్లు విశ్వనాథ్, ఇరుకుల్ల మంగ, డీసీసీ అధ్యక్షురాలు సుగుణ, ఆసిఫాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాం నాయక్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, మార్లవాయి సర్పంచ్ కనక ప్రభావతి, రాజ్ గోండ్ సేవా సమితి ప్రతినిధి సిడాం అర్జు, రాయి సెంటర్ జిల్లా మేడి కుర్సింగ మోతిరామ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో బయటపడ్డ విభేదాలు..
## స్టేజిపైనే కొట్టుకున్న హస్తం నాయకులు



**పెద్దపల్లి :** పెద్దపల్లి జిల్లాలో కాంగ్రెస్ నాయకుల మధ్య విభేదాలు భగ్గుమన్నాయి. గోదావరిఖనిలో ఆదివారం జరిగిన ఇందిరమ్మ పట్టాల పంపిణీ సభలో ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య ఘర్షణ జరిగింది. గోదావరిఖనిలో జరిగిన కార్యక్రమానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ, అడ్లూరి లక్ష్మణ్ పాల్గొన్నారు. వీరు కార్యక్రమానికి హాజరై సభపై నుంచి కిందకు దిగిన అనంతరం ద్వితీయ శ్రేణి నాయకుల మధ్య వేదికపైనే తోపులాట జరిగింది. ఇద్దరు నాయకుల మధ్య మొదలైన వాగ్వాదం ముదిరి ఘర్షణకు దిగింది. సభా వేదికపైనే ఒకరిపై ఒకరు పిడిగుద్దులు గుప్పించుకున్నారు. ఈ ఘటనతో ఒక్కసారిగా అక్కడ ఉద్రిక్త వాతావరం నెలకొంది. గోదావరిఖనిలోని ఒకే డివిజన్‌కు చెందిన ఇద్దరు నాయకుల మధ్య కొంతకాలంగా విభేదాలు కొనసాగుతున్నాయి. అయితే ఆ గొడవలు ఈ సమావేశంలో బయపడినట్లు తెలుస్తోంది. ఈ ఘటన కాంగ్రెస్ పార్టీ శ్రేణుల్లో తీవ్ర ఆందోళన రేకెత్తించింది. మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు హాజరైన వేదికపై ఇలాంటి ప్రవర్తన ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. “ఇదేనా సభా మర్యాదలు..? ఇదేనా మంత్రులకు ఇచ్చే గౌరవం? స్థానిక ఎమ్మెల్యేకు ఇచ్చే విలువ ఇదేనా?” అంటూ పలువురు ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. జిల్లా మంత్రులు పాల్గొన్న సమావేశాల్లో నాయకులు క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. స్టేజీపై ఘర్షణకు దిగడం పార్టీకి ఎంత నష్టం చేస్తుందన్న అంశంపై కూడా చర్చ సాగుతోంది. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఇంత జరిగినా, పలు సంఘటనలు పునరావృతమైనా, సదరు నాయకుడిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్నది ఇప్పటికీ అంతుచిక్కని ప్రశ్నగానే మిగిలింది. పార్టీ అధిష్టానం, జిల్లా నాయకత్వం ఈ వ్యవహారంపై ఎలా స్పందిస్తుందో వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

## బిజినెస్

### హోమ్ లోన్ ఏ వయసులో బెస్ట్?



ఈరోజుల్లో బ్యాంక్ నుంచి గృహ రుణం తీసుకోకుండా ఇల్లు కొనడం అసాధ్యమే. ఆకాశాన్నంటిన భూముల ధరలు, పెరిగిన నిర్మాణ వ్యయాలతో అపార్ట్‌మెంట్ల ధరలు రూ.కోట్లలో ఉంటున్నాయి. దీంతో పొదుపు చేసిన సొమ్ముతో పాటు గృహ రుణం తీసుకుంటే తప్ప ఇల్లు సొంతమయ్యేలా లేదు. అయితే ఏ వయసులో హోమ్ లోన్ తీసుకుంటే ఉత్తమమైన ఫలితాలు దక్కుతాయో ముందుగానే కొంత అవగాహన కలిగి ఉండటం బెటర్. రుణానికి అర్హత ఉంది కదా అని ఏ వయసులో పడితే ఆ వయసులో గృహ రుణం తీసుకుంటే లేనిపోని చికాకులు, మానసిక ఒత్తిళ్లకు లోను కావాల్సి వస్తోందని బ్యాంకింగ్ రంగ నిపుణులు చెబుతున్నారు. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ పైసా పైసా కూడబెడుతుంటారు. ఖర్చులను అదుపులో పెట్టుకొని పొదుపుపై దృష్టి పెడుతుంటారు. అయితే మన సొంతింటి కలకు బ్యాంక్‌లు లోన్ రూపంలో సహకారం అందిస్తుంటాయి. వడ్డీ రేట్లు కూడా అందుబాటులోనే ఉండటంతో ప్రతి ఒక్కరూ గృహ రుణం వైపు మొగ్గు చూపిస్తుంటారు. వస్తు సేవల పన్ను(జీఎస్టీ) 2.0 అమలులోకి వచ్చాక పన్ను విధానం సరళతరమైంది. స్టీల్, శానిటరీ ఉత్పత్తులు, రంగులు వంటి నిర్మాణ సామగ్రిపై పన్ను శ్లాబ్‌లు తగ్గాయి. ఇది గృహ కొనుగోలుదారులకు డిస్కౌంట్‌గానే కాకుండా దీర్ఘకాలంలో పొదుపుగా మారుతుంది.

**30 ఏళ్ల వయసులో రుణం..**

సాధారణంగా ఇంటి యాజమాన్యానికి దాదాపు 30 సరైన వయసు. ఈ వయస్సులో చాలా మంది తమ కెరీర్ మార్గాలు, స్థిరమైన ఆదాయం, భవిష్యత్తు ఖర్చుల గురించి బాగా అర్థం చేసుకుంటారు. అలాగే కుటుంబాలతో స్థిరపడాలని ప్లాన్ చేసుకుంటారు కాబట్టి గృహ రుణం దీర్ఘకాలిక ఆర్థిక నిబద్ధతను తీసుకోవడాన్ని సులభతరం చేస్తుంది. కెరీర్ ప్రారంభంలోనే అంటే 2530 ఏళ్ల వయస్సులోనే గృహ రుణం తీసుకుంటే ఈఎంఐ ఎక్కువ కాలపరిమితి తీసుకునే అవకాశం ఉంటుంది. దీంతో జేబుకు అధిక భారం కాకుండా తక్కువ ఈఎంఐ చెల్లించే వీలుంటుంది. కెరీర్ ప్రారంభంలోనే ఉండటంతో సిబిల్ స్కోర్‌కు కూడా మెరుగ్గా ఉంటుంది. దీంతో ఎక్కువ రుణం తీసుకునే వీలుతో పాటు కొంత వడ్డీ తగ్గే అవకాశం ఉంటుంది. 750కు మించి క్రెడిట్ స్కోర్ ఉన్నప్పుడే బ్యాంక్ రుణం తేలిగ్గా లభిస్తుంది. ఇక క్రెడిట్ స్కోర్ 800 దాటితే వడ్డీలోనూ 0.5 శాతం వరకూ తగ్గింపులు కూడా లభిస్తాయి. అంతేకాకుండా క్రెడిట్ స్కోర్ ఎక్కువగా ఉంటే కాస్త ఎక్కువ మొత్తంలో రుణం తీసుకునేందుకు వీలవుతుంది.

**నలభైలో ఒత్తిళ్లు..**

ఉద్యోగ విరమణ లేదా జీవితంలో చివరి దశలో 40 50 ఏళ్ల వయసు ప్రారంభంలో ఇల్లు కొనడమనేది కొంత సవాళ్లతో కూడుకున్న అంశం. సాధారణంగా గృహ రుణ కాలపరిమితి 20 సంవత్సరాలకు మించి ఉంటుంది కాబట్టి జీవితంలోని ఈ దశలో నెలవారీ వాయిదా(ఈఎంఐ) భారం ఒత్తిడితో కూడుకున్నది. పిల్లల చదువులు, పెళ్లిళ్ల వంటి ఇతర బాధ్యతలు వంటి అధిక ఖర్చులుండే వయసులో ఈఎంఐ లేనిపోని ఇబ్బందులకు గురి చేస్తుంది. ఏమైనా అనుకోని ఘటన జరిగితే సొంతిల్లుని బ్యాంక్ జప్తు చేసుకుంటుంది. కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఎదురవుతుంది.

**అద్దెకూ వయసుందీ..**

ఇల్లు కొనడమనేది వ్యక్తి ఆర్థిక సంసిద్ధత, స్థిరత్వం అనే అంశాలపై ఆధారపడి ఉంటుంది. సొంతిల్లు ఆర్థికంగా, సామాజికంగా గుర్తింపును, హోదాను తీసుకొస్తుంది. భవిష్యత్తుకు భద్రతా భావాన్ని అందిస్తుంది. అయితే ప్రాపర్టీని కొనడానికి లేదా అద్దెకు తీసుకోవడానికి అనువైన సమయం ఎక్కువగా వ్యక్తి వ్యక్తిగత పరిస్థితులు లక్ష్యాలు, ఆర్థిక స్థిరత్వంపై ఆధారపడి ఉంటుంది. 20 ఏళ్ల వయసు ప్రారంభంలో అద్దెకు తీసుకోవడం ఆచరణాత్మకమైంది. ఎందుకంటే యువ నిపుణులు స్థిరమైన ఆదాయం కోసం పలు ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నిస్తుంటారు.

# బంగారం @ 2లక్షలు?

**జూన్ నాటికి చేరుకునే అవకాశం**

**ధరలు పెరుగడానికి ప్రధాన కారణాలు**

**డాలర్ బలహీనపడటం**

**అంతర్జాతీయంగా ఉద్రిక్త పరిస్థితులు**

**రియల్ ఎస్టేట్ రంగం తిరోగమనబాట పట్టడం**

**పలు సెంట్రల్ బ్యాంక్‌లు ఎగబడి కొనుగోళ్లు జరపడం**



**న్యూఢిల్లీ :** బంగారం భగ..భగ మండుతున్నది. ఆకాశమే హద్దుగా దూసుకుపోతున్న పుత్తడి ధర మరో రికార్డుకు చేరువకాబోతున్నదా అంటే ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఇది నిజమేననిపిస్తున్నది. ఇప్పటికే 2025లో రికార్డు స్థాయిలో దూసుకుపోయిన గోల్డ్ ధర..2026లోనూ అదే ట్రెండ్‌ను కొనసాగించనున్నదని మార్కెట్ వర్గాలు హెచ్చరిస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు భారీగా పుంజుకోవడంతో దేశీయంగా ధరలు హీటెక్కుతున్నాయి. ఇప్పటికే దేశవ్యాప్తంగా పదిగ్రాముల బంగారం ధర రూ.1.41 లక్షల స్థాయిలో కదలాడుతున్న ధర ఈ ఏడాది జూన్ నాటికి రూ.2 లక్షలకు చేరుకునే అవకాశాలు మెండుగావున్నాయని వ్యాపార వేత్తలు అంచనావేస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర ప్రస్తుతం 4,500 డాలర్ల స్థాయిలో ఉండగా, ఈ ఏడాది మార్చి నాటికి 5 వేల డాలర్లను తాకే అవకాశాలున్నాయని హెచ్ఎస్‌బీసీ కమోడిటీ అంచనావేస్తున్నది. దీంతో దేశీయంగా ధరలు రూ.2 లక్షలు తాకిన ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని వారు పేర్కొంటున్నారు. గత నెల చివర్లో గోల్డ్ ధర నూతన గరిష్ఠాలను తాకిన విషయం తెలిసిందే. 1979 నుంచి ఇప్పటి వరకు ఒకే ఏడాది భారీగా పెరిగిన ధర 2025లో 64 శాతం రిటర్నులు పంచింది. అలాగే 2023 నుంచి ఇప్పటి వరకు 140 శాతం ఎగబాకింది. 2025లో పలు దేశాల సెంట్రల్ బ్యాంక్‌లు 900 నుంచి 950 టన్నుల మేర పసిడిని కొనుగోళ్లు చేశాయి. దీంతో గతేడాది గోల్డ్ డిమాండ్ 4,850 మెట్రిక్ టన్నులకు చేరుకున్నది. 2011 తర్వాత ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో డిమాండ్ నెలకొనడం ఇదే తొలిసారి.

**చివర్లో తిరోగమనం!**

ప్రస్తుతం రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న బంగారం ధరలు ఈ ఏడాది చివర్లో తిరోగమన బాటపట్టే అవకాశాల కూడా లేకపోలేవని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పెరుగుట..విరుగుటకేనని వారు అంటున్నారు. గడిచిన ఏడాదికాలంలో రికార్డుల మీద రికార్డులు బద్దలు కొడుతున్న గోల్డ్ ధర శాంతించే అవకాశాలు కూడా ఉన్నాయని వారు పేర్కొంటున్నారు.

**దుకాణాలు వెలవెల**

రికార్డు స్థాయికి చేరుకున్న ధరల కారణంగా ఆభరణాల విక్రయ దుకాణాలు వెలవెలబోతున్నాయి. గత పండుగ సీజన్‌లో కొంతలో కొంత అమ్మకాలు జరిగినప్పటికీ ప్రస్తుతం కొనేవాడు కరువయ్యారని వారు వాపోతున్నారు. ఈ ధరలను చూసి సామాన్యులు ఇటువైపు రావడానికి జంకుతున్నారని ఓ దుకాణదారుడు వెల్లడించారు.

**రోల్డ్‌గోల్డ్ ఆభరణాలకు డిమాండ్**

రికార్డు స్థాయికి చేరుకున్న ధరల కారణంగా సామాన్యుడు వీటి స్థానంలో రోల్డ్‌గోల్డ్ ఆభరణాలకు మొగ్గుచూపుతున్నారు. ఫంక్షన్ వచ్చిన..పండుగ వచ్చిన వీటిని కొనుగోలు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. గడిచిన ఆరు నెలల్లో వీటి విక్రయాలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. ప్రధానంగా ఆభరణాల విక్రయ సంస్థలే వీటిని అమ్మకానికి పెడుతున్నాయి అంటే మార్కెట్లో వీటి డిమాండ్ ఎలావుందో అర్థమవుతున్నది.

### కంపెనీ ఎందుకిలా అడుగుతోంది?

### అమెజాన్ ఉద్యోగుల్లో ఆందోళన




అమెజాన్ తన ఉద్యోగుల వార్షిక పనితీరు సమీక్ష విధానంలో కీలక మార్పులు చేసింది. ఏడాది కాలంలో తాము సాధించిన ముఖ్యమైన విజయాలు మూడు నుంచి ఐదు పేర్కొనడంపాటు, కంపెనీలో మరింత వృద్ధి సాధించడానికి తాము తీసుకోవాల్సిన చర్యలను కూడా వివరించాల్సిందిగా సంస్థ ఉద్యోగులను కోరుతోంది. అసలే లేఆఫ్‌లు కొనసాగుతున్న తరుణంలో కంపెనీ ఎందుకిలా అడుగుతోందని ఉద్యోగుల్లో ఆందోళన పట్టుకుంది. బిజినెస్ ఇన్‌సైడర్ నివేదిక ప్రకారం, ఉద్యోగులు ఇప్పుడు తమ ప్రభావాన్ని స్పష్టంగా చూపించే ప్రాజెక్టులు, లక్ష్యాలు లేదా కార్యక్రమాల నిర్దిష్ట ఉదాహరణలను వార్షిక సమీక్షలో భాగంగా సమర్పించాలి. "ఫోర్టే" అనే ఈ కొత్త కార్యక్రమం ద్వారా, అమెజాన్ ఉద్యోగులు తమ విలువను నిరూపించుకునేలా తొలిసారిగా వ్యక్తిగత సాఫల్యాల జాబితాలను తప్పనిసరి చేసింది. ఇంతకుముందు అమెజాన్ పనితీరు సమీక్షలు మరింత ఓపెన్-ఎండెడ్‌గా ఉండేవి. ఉద్యోగులను వారి "సూపర్ పవర్స్" ఏమిటో, లేదా వారు అత్యుత్తమంగా పనిచేసే సమయంలో ఎలా వ్యవహరిస్తారో ప్రతిబింబించమని మాత్రమే అడిగేవారు. అయితే కొత్త విధానం స్పష్టమైన మార్పును సూచిస్తోంది. ఈ కొత్త వ్యవస్థతో అమెజాన్ కొలవదగిన ఫలితాలపై ఎక్కువగా దృష్టి సారిస్తోంది. అదే సమయంలో, ఉద్యోగులు తీసుకున్న రిస్కులు లేదా పూర్తిగా విజయవంతం కాకపోయిన ఆవిష్కరణల గురించి కూడా ప్రస్తావించమని అడుగుతోంది. "విజయాలు అనేవి మీ పని ప్రభావాన్ని చూపించే నిర్దిష్ట ప్రాజెక్టులు, లక్ష్యాలు, కార్యక్రమాలు లేదా ప్రక్రియలలో చేసిన మెరుగుదలలు. ఆశించిన ఫలితాలు రాకపోయినా, మీరు రిస్క్ తీసుకున్న లేదా ఆవిష్కరణ చేసిన సందర్భాలను పరిగణనలోకి తీసుకోండి" అంటూ అమెజాన్ అంతర్గత మార్గదర్శకాల్లో సూచించింది.

**ఆందోళన ఎందుకంటే..**

అమెజాన్‌లో ఫోర్టే సమీక్ష ప్రక్రియ వేతన నిర్ణయంలో కీలక పాత్ర పోషిస్తుంది. ఉద్యోగులు జాబితా చేసిన వారి విజయాలు, సహోద్యోగుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్, అమెజాన్ నాయకత్వ సూత్రాలకు వారు ఎంతవరకు కట్టుబడి ఉన్నారు, అలాగే ఉద్యోగానికి సంబంధించిన నైపుణ్యాల ఆధారంగా వారి మేనేజర్లు అంచనా వేస్తారు. ఈ అంశాలన్నింటి ఆధారంగా ఉద్యోగికి "మొత్తం విలువ" (ాజవతీఖశ్రీశ్రీ ఖశ్రీబవ) రేటింగ్ కేటాయిస్తారు. ఇది వార్షిక వేతనాన్ని నేరుగా ప్రభావితం చేస్తుంది.

## స్పోర్ట్స్

# ఉత్కంఠ పోరులో కివీస్‌కు షాక్..
# సిక్సర్‌తో భారత్‌ను గెలిపించిన రాహుల్!



ఆఖరి వరకూ ఉత్కంఠ రేపిన వడోదర వన్డేలో భారత జట్టునే విజయం వరించింది. ఛేదనలో విరాట్ కోహ్లీ(93), శుభ్‌మన్ గిల్(56) అర్ధ శతకాలతో అలవోకగా గెలుస్తుందనుకున్న టీమిండియా.. కైలీ జేమీసన్ (4-41) తన ఆఖరి స్పెల్‌లో మూడు వికెట్లు తీయడంతో కష్టాల్లో పడింది. శ్రేయస్ అయ్యర్(49)ను బౌల్డ్ అయ్యాక.. కేఎల్ రాహుల్(29 నాటౌట్) ఒత్తిడిలోనూ ఖతర్నాక్ ఇన్నింగ్స్ ఆడాడు. కాలి గాయంతో బాధపడుతున్న వాషింగ్టన్ సుందర్(7 నాటౌట్) సాయంతో జట్టును గెలిపించాడు రాహుల్. క్లార్క్ వేసిన 49వ ఓవర్లో వరుసగా రెండు ఫోర్లు, సిక్సర్‌తో టీమిండియాకు థ్రిల్లింగ్ విక్టరీ అందించాడు. దాంతో, మూడు వన్డేల సిరీస్‌లో భారత్ 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. స్వదేశంలో ఇటీవలే దక్షిణాఫ్రికా వన్డే సిరీస్ గెలుపొందిన భారత జట్టు మరో సిరీస్‌ను విజయంతో ఆరంభించింది. ఆదివారం వడోదరలో న్యూజిలాండ్‌పై కాస్త కష్టంగానే గెలుపొందింది. భారీ స్కోర్ దిశగా దూసుకెళ్లిన న్యూజిలాండ్‌ను 300లకే కట్టడి చేసిన భారత్‌కు ఓపెనర్ రోహిత్ శర్మ(26)తన స్టయిల్లో శుభారంభమిచ్చాడు. పవర్ ప్లే తర్వాత గేర్ మార్చాలనుకున్న అతడిని కైలీ జేమసన్ వెనక్కి పంపాడు. ఫామ్‌లేమితో బాధపడుతున్న కెప్టెన్ శుభ్‌మన్ గిల్(56) ఆచితూచి ఆడగా.. విరాట్ కోహ్లీ(93) ఫోర్ల మీద ఫోర్లు కొడుతూ స్కోర్‌బోర్డును ఉరికించాడు. ఈ క్రమంలోనే అతడు అంతర్జాతీయ క్రికెట్‌లో 28వేల పరుగుల మైలురాయిని అధిగమించాడు. గిల్‌తో కలిసి విరాట్ సెంచరీ భాగస్వామ్యం నెలకొల్పి జట్టును గెలుపు దిశగా నడిపాడు. అర్ధ శతకంత తర్వాత గిల్ ఔటైనా కోహ్లీ మాత్రం క్రీజును వదల్లేదు. శ్రేయాస్ అయ్యర్(49)తో కలిసి కివీస్ బౌలర్లను ఒత్తిడిలో పడేశాడు. సెంచరీకి చేరువైన విరాట్‌ను జేమీసన్ ఔట్ చేసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అదే ఓవర్లో జడేజాను వెనక్కి పంపిన అతడు.. తర్వాత ఓవర్లో అయ్యర్‌ను బౌల్డ్ చేయడంతో ఉత్కంఠ మొదలైంది. అప్పటికీ విజయానికి 53 బంతుల్లో 59 రన్స్ కావాలి.

**రాహుల్ కూల్‌గా..**

చూస్తుండగానే మూడు బిగ్ వికెట్లు పడడంతో స్టేడియంలోని ప్రేక్షకులంతా స్టన్ అయ్యారు. అయితే.. హర్షిత్ రానా(29) జతగా కేఎల్ రాహుల్(29 నాటౌట్) సమయోచితంగా ఆడాడు. కివీస్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో రాహుల్ రిస్క్ తీసుకోలేదు. సాధించాల్సిన రన్‌రేటు పెరిగిపోతుండడంతో హర్షిత్ దూకుడుగా ఆడాడు. రానా ఔటయ్యాక వాషింగ్టన్ సుందర్(7 నాటౌట్) అండగా రాహుల్ జట్టును విజయతీరాలకు చేర్చాడు. క్లార్క్ వేసిన 49వ ఓవర్లో చివరి మూడు బంతుల్ని 4, 4, 6గా మలిచిన అతడు 4 వికెట్ల విజయాన్ని కట్టబెట్టాడు.

**మిచెల్, నికోల్స్ మెరవగా**

టాస్ ఓడిన జట్టుకు కివీస్ ఓపెనర్లు హెన్రీ నికోల్స్(62), డెవాన్ కాన్వే(56)లు అర్ధ శతకాలతో శుభారంభమిచ్చారు. 21 ఓవర్ల వరకూ వికెట్ పడకపోవడంతో అలవోకగా మూడొందలకు పైగా కొడుతుందనిపించింది. కానీ, హర్షిత్ రానా(2-65) ఈ ఇద్దరిని వెనక్కి పంపి పరుగులకు అడ్డుకట్ట వేశాడు. ప్రసిధ్ కృష్ణ(2-60) పొదుపుగా బౌలింగ్ చేయగా మిడిలార్డర్ తోకముడిచింది. ఓవైపు వికెట్లు పడుతున్న డారిల్ మిచెల్ (84) ఒంటరి సైనికుడిలా పోరాడాడు. హాఫ్ సెంచరీ తర్వాత గేర్ మార్చిన అతడిని ప్రసిధ్ వెనక్కి పంపడంతో న్యూజిలాండ్ 300లకే పరిమితమైంది.

### అంతర్జాతీయ క్రికెట్‌లో కోహ్లీ మరో ఘనత..
### మూడో ఆటగాడిగా రికార్డు..!



ప్రపంచంలోని అగ్రశ్రేణి బ్యాటర్లలో విరాట్ కోహ్లీ ఒకడైన అంతర్జాతీయ క్రికెట్‌లో మరో ఘనత సాధించాడు. ఈమధ్య వన్డేల్లో వరుస సెంచరీలతో రికార్డులు నెలకొల్పిన విరాట్.. ఈసారి 28 వేల పరుగుల క్లబ్‌లో చేరాడు. వడోదరలో న్యూజిలాండ్‌పై తొలి వన్డేలో 26 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద విరాట్ ఈ మైలురాయికి చేరుకున్నాడు. తద్వారా ఈ అరుదైన క్లబ్‌లో చేరిన మూడో ఆటగాడిగా అవతరించాడు కోహ్లీ. అంతర్జాతీయ క్రికెట్‌లో టీమిండియా దిగ్గజం విరాట్ కోహ్లీ రికార్డుల పర్వం కొనసాగుతోంది. ఈమధ్యే స్వదేశంలో దక్షిణాఫ్రికాపై వరుసగా రెండు శతకాలతో వన్డేల్లో తనకు తానే సాటి అని నిరూపించిన అతడు.. 28వేల పరుగులు సాధించాడు. అతడికంటే ముందు భారత లెజెండ్ సచిన్ టెండూల్కర్ కుమార సంగక్కర(శ్రీలంక దిగ్గజం) మాత్రమే 28వేల పరుగులు పూర్తి చేసుకున్నారు. అయితే.. కోహ్లీ 624 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఘనత సొంతం చేసుకోగా.. సచిన్ 644 ఇన్నింగ్స్‌లు తీసుకున్నాడు. అంటే.. మాస్టర్ బ్లాస్టర్ కంటే20 ఇన్నింగ్స్‌ల కంటే ముందే విరాట్ ఈ క్లబ్‌లో చేరాడు. శ్రీలంక వెటరన్ సంగక్కరకు 666 ఇన్నింగ్స్‌ల్లో 28 వేల రన్స్ సాధించాడు.

### డబ్ల్యూపీఎల్‌లో ఢిల్లీ పేసర్ హ్యాట్రిక్..
### నాలుగో బౌలర్‌గా రికార్డు..!



మహిళల ప్రీమియర్ లీగ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్ నందని శర్మ హ్యాట్రిక్ నమోదు చేసింది. గుజరాత్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 20వ ఓవర్లో వరుసగా మూడు వికెట్లు తీసి చరిత్రకెక్కింది. నాలుగో బంతికి కనికా ఆహుజాను వికెట్ కీపర్ లీ స్టంపౌట్ చేసింది. ఐదో బంతికి రాజేశ్వరీ గైక్వాడ్‌ను నందని బౌల్డ్ చేసింది. అనంతరం క్రీజులోకి వచ్చిన రేణుకా సింగ్‌ను బౌల్డ్ చేసి హ్యాట్రిక్ పూర్తి చేసుకుంది. మొత్తంగా ఈ లీగ్ చరిత్రలో ఈ ఫీట్ సాధించిన నాలుగో బౌలర్‌గా నందని అవతరించింది. డబ్ల్యూపీఎల్‌లో నందని కంటే ముందు ఇసీ వాంగ్(ముంబై ఇండియన్స్), దీప్తి శర్మ(యూపీ వారియర్స్), గ్రేస్ హ్యారిస్(యూపీ వారియర్స్)లు హ్రాట్రిక్ వికెట్లు పడగొట్టారు. ఆరంభ సీజన్‌లో యూపీ వారియర్స్‌పై వాంగ్ వరుసగా మూడు వికెట్లు తీసింది. కిరన్ నవ్‌గరే, సిమ్రాన్ షేక్, సోఫీ ఎకిల్‌స్టోన్‌లను ఔట్ చేసింది.

ధర్మఘంట

# చైల్డ్ ఆర్టిస్ట్ నుంచి బోల్డ్ నిర్ణయాల వరకు..
# తేజస్వి మదివాడ చెప్పిన జీవిత పాఠాలు



చిన్న వయసులోనే సినిమాల్లో అడుగుపెట్టి, క్రమంగా హీరోయిన్‌గా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి తేజస్వి మదివాడ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, హార్ట్ అటాక్, పండగ చేస్కో వంటి విజయవంతమైన సినిమాల్లో కీలక పాత్రల్లో కనిపించిన ఆమె, ఆ తర్వాత కేరింత, ఐస్ క్రీమ్ లాంటి చిత్రాలతో హీరోయిన్‌గా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన ఐస్ క్రీమ్ సినిమాలో ఆమె చేసిన డిఫరెంట్ రోల్ అప్పట్లో పెద్ద చర్చకే దారి తీసింది.కొన్ని సినిమాలు, వెబ్ సిరీస్‌లు, టాక్ షోలతో బిజీగా కనిపించిన తేజస్వి ఇటీవల పెద్దగా తెరపై కనిపించకపోయినా, ఆమె గతంలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరోసారి సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. ఒక ఇంటర్వ్యూలో ఆమె తన కెరీర్‌తో పాటు వ్యక్తిగత జీవితానికి సంబంధించిన అనుభవాలను చాలా ఓపెన్‌గా పంచుకుంది. 33 ఏళ్ల వయసులోనూ ఫిట్‌నెస్‌పై ప్రత్యేక దృష్టి పెట్టానని, జిమ్‌లో కష్టపడి తనను తాను మార్చుకున్నానని తేజస్వి చెప్పింది. విదేశీ ట్రిప్స్‌లో బికినీ ఫోటోషూట్లు చేయడం, కిస్సింగ్ సన్నివేశాల్లో నటించడం వంటి విషయాలు తన ప్రొఫెషన్‌లో భాగమే తప్ప వ్యక్తిగతంగా వేరే అర్థం లేదని స్పష్టం చేసింది. తాను అమాయకురాలిని కాదని, తన జీవితం గురించి స్పష్టత ఉన్న వ్యక్తినని కూడా ఆమె పేర్కొంది. అలాగే, బిగ్ బాస్ షోపై కూడా ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. 2017లో ఆ షోలో పాల్గొనడం తన కెరీర్‌కు పెద్దగా ఉపయోగపడలేదని, అప్పటి మానసిక ఒత్తిడి వల్ల దాదాపు రెండేళ్ల పాటు సినిమాలకు దూరంగా ఉండాల్సి వచ్చిందని వెల్లడించింది. ఆ దశలో తన మెంటల్ స్టేట్‌ను ఎవరూ అర్థం చేసుకోలేదని, ఆ ప్రభావం వ్యక్తిగత జీవితంపై కూడా పడిందని చెప్పింది. పరిస్థితులు ఇంత తీవ్రంగా మారడంతో ఇండియా వదిలి వెళ్లాలనే ఆలోచన కూడా వచ్చినట్టు తేజస్వి భావోద్వేగంగా చెప్పుకొచ్చింది. ఇక పరిశ్రమలో కమిట్‌మెంట్స్ అంశంపై మాట్లాడిన తేజస్వి, తనను నేరుగా ఎవరూ అడగలేదని తెలిపింది. అయితే కెరీర్ ప్రారంభ దశలో కొన్ని అసౌకర్యకర పరిస్థితులను ఎదుర్కొన్నానని, కానీ తన స్పష్టమైన వ్యక్తిత్వం, ధైర్యంగా మాట్లాడే స్వభావమే తనను ఇలాంటి వాటి నుంచి కాపాడిందని చెప్పింది. ఇలాంటి సమస్యలు సినిమా పరిశ్రమకే పరిమితం కాదని, ఏ రంగంలోనైనా ఉంటాయని, వాటిని ఎదుర్కొనే బాధ్యత ప్రతి ఒక్కరిదేనని ఆమె అభిప్రాయపడింది. మొత్తంగా చూస్తే, తేజస్వి మదివాడ జీవితం కేవలం సినిమాలకే పరిమితం కాకుండా, అనుభవాలతో నిండిన ఒక ప్రయాణంలా కనిపిస్తోంది. కెరీర్‌లో వచ్చిన ఎత్తుపల్లాలు, వ్యక్తిగత పోరాటాల గురించి ఆమె చెప్పిన మాటలు ఇప్పుడు చాలా మందికి ప్రేరణగా మారుతున్నాయి.



# 'ఖైదీ 150' తర్వాత
# 'మన శంకర వరప్రసాద్ గారు' రికార్డ్

మెగాస్టార్ చిరంజీవి నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' ప్రీమియర్ షోల విషయంలో దుమ్మురేపుతున్నాడు. హైదరాబాద్‌లో ఏకంగా 200 స్క్రీన్స్‌లలో ప్రీమియర్స్ ప్రదర్శించనున్నారు. రూ. 600 టికెట్ ఉన్నప్పటికీ దాదాపు అన్ని థియేటర్స్ హౌస్‌ఫుల్ అయ్యాయి. ఆపై నార్త్ అమెరికాలో కూడా టికెట్స్ బుకింగ్ జోరు కనిపిస్తుంది. ఈ క్రమంలో తాజాగా చిత్ర యూనిట్ ఒక పోస్టర్‌ను విడుదల చేసింది. అమెరికాలో కేవలం ప్రీమియర్స్ ద్వారానే 9 లక్షల డాలర్లు (రూ. 8.12కోట్లు) కలెక్ట్ చేసినట్లు ప్రకటించారు. 1మిలియన్ మార్క్ కూడా చేరవచ్చని తెలుస్తోంది. దీంతో చిరంజీవి కెరీర్‌లో మరో అతిపెద్ద ఓవర్సీస్ ఓపెనింగ్‌గా ఈ మూవీ రికార్డ్ క్రియేట్ చేసింది. 'మన శంకర వరప్రసాద్ గారు' అమెరికా ప్రీమియర్స్‌లో సత్తా చాటుతున్నాడు. ప్రీమియర్స్ కలెక్షన్స్ పరంగా చిరు కెరీర్‌లో రెండో చిత్రంగా నిలిచింది. మొదటి స్థానంలో ఖైదీ 150 మూవీ ఉంది. చిరు రీఎంట్రీ మూవీ కావడంతో కేవలం ప్రీమియర్స్ ద్వారా 1.25 మిలియన్ డాలర్స్ వచ్చాయి. ఆ తర్వాత అంతటి రేంజ్ ఓపెనింగ్స్ కలెక్షన్స్ 'మన శంకర వరప్రసాద్ గారు' మూవీకి దక్కింది. అయితే, చిరు హిట్ సినిమా వాల్తేరు వీరయ్య కూడా 6 లక్షల డాలర్ల వద్దే ఆగిపోయింది. సంక్రాంతి పండుగ కాబట్టి చిరు సినిమాకు పాజిటీవ్ టాక్ వస్తే తన కెరీర్‌లోనే బిగ్గెస్ట్ కలెక్షన్స్ రాబట్టిన చిత్రంగా 'మన శంకర వరప్రసాద్ గారు' నిలిచే ఛాన్స్ ఉంది.

# 'నారీ నారీ నడుమ మురారి'
# అదిరిపోయేలా ట్రైలర్




శర్వానంద్ నటిస్తున్న 'నారీ నారీ నడుమ మురారి' మూవీ ట్రైలర్ తాజాగా విడుదలైంది. సంక్రాంతి కానుకగా జనవరి 14న సాయంత్రం 5:49 గంటలకు థియేటర్లలో విడుదలకానుంది. ఈ మూవీని దర్శకులు రామ్ అబ్బరాజు తెరకెక్కించగా.. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మించారు. ఇందులో సంయుక్త, సాక్షీ వైద్య హీరోయిన్లుగా నటించారు. వివాహ భోజనంబు, సామజవరగమన వంటి సినిమాలకు దర్శకుడిగా పనిచేసిన రామ్ అబ్బరాజు తొలిసారి సంక్రాంతి రేసులో ఉన్నారు. ఈ మూవీలో శ్రీవిష్ణు అతిథి పాత్రలో కనిపించనున్నారు.

# నవీన్ పోలిశెట్టికి 'అనగనగా ఒక రాజు' అగ్ని పరీక్ష..
# సినిమా సినిమాకి అంత గ్యాప్ ఎందుకు అంటే..!



తెలుగు సినిమా రంగంలో తనదైన స్టైల్‌తో దూసుకెళ్తున్న యువ నటుడు నవీన్ పోలిశెట్టి, "తక్కువ సినిమాలు ఎక్కువ ప్రభావం" అనే విధానంతో ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్నాడు. ఒక్కో సినిమా మధ్య ఎక్కువ విరామం తీసుకున్నా, వచ్చిన ప్రతీసారి ప్రేక్షకులను కొత్తదనంతో పలకరించడం అతని బలంగా మారింది. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ'తో వినూత్నమైన క్రైమ్‌కామెడీని పరిచయం చేసిన నవీన్, 'జాతిరత్నాలు'తో మాస్ ప్రేక్షకులను ఉర్రూతలూగించాడు. ఆపై 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'తో క్లాస్ ఆడియెన్స్‌ను ఆకట్టుకుని తన పరిధిని మరింత విస్తరించాడు.ఇప్పుడు సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదలకు సిద్ధమైన 'అనగనగా ఒక రాజు'పై అంచనాలు పెరిగిపోతున్నాయి. కళ్యాణ్ శంకర్ దర్శకత్వంలో, మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో గోదావరి ప్రాంతానికి చెందిన యువకుడిగా నవీన్ కనిపించనున్నాడు. ట్రైలర్‌లో కనిపించిన స్థానిక యాస, సహజమైన హాస్యం, టైమింగ్ ప్రేక్షకుల్ని ఆకట్టుకోవడంతో సినిమాపై ఆసక్తి మరింత పెరిగింది. ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో నవీన్ తన కెరీర్ దృష్టికోణాన్ని స్పష్టంగా వివరించాడు. సినిమాల మధ్య గ్యాప్‌లపై వస్తున్న ప్రశ్నలకు సమాధానంగా, ప్రేక్షకుడు థియేటర్‌లో పెట్టే ప్రతి రూపాయి విలువైనదేనని, అందుకే కథల ఎంపికలో చాలా జాగ్రత్తగా ఉంటానని చెప్పాడు. ముంబయిలో అవకాశాల కోసం తిరిగిన రోజుల్లో సినిమా చూడటానికీ డబ్బులు లేక ఇబ్బంది పడ్డ అనుభవాలు తనలో ఇప్పటికీ ఉన్నాయని, అప్పటి బాధే తనను ఇంకా బాధ్యతాయుతంగా ఆలోచించేలా చేస్తుందని తెలిపాడు. తన మొదటి రోజుల గురించి మాట్లాడుతూ, నటనను కెరీర్‌గా ఎంచుకున్నప్పుడు ఇంట్లో అభిప్రాయ భేదాలు వచ్చాయని, ముఖ్యంగా నాన్నతో జరిగిన చర్చలు కష్టంగా అనిపించాయని గుర్తు చేసుకున్నాడు. అవకాశాలు దొరకని సమయంలో ఆ ఒత్తిడి ఎక్కువైందని, కానీ ఆ దశలో అమ్మ తనకు అండగా నిలిచిందని భావోద్వేగంగా చెప్పాడు. "ఆమెనే నా ఎనర్జీ" అంటూ తల్లికి కృతజ్ఞతలు తెలిపాడు. సినిమాల విషయానికి వస్తే, ఎస్.ఎస్. రాజమౌళి, రాజ్‌కుమార్ హిరానీ, జోయా అక్తర్ లాంటి దర్శకులతో పనిచేయాలన్న కోరిక ఉందని చెప్పిన నవీన్, తనకు ప్రేరణనిచ్చే వ్యక్తులుగా ఎంఎస్ ధోనీ, లియోనెల్ మెస్సీలను ప్రస్తావించాడు. ఒత్తిడిని ప్రశాంతంగా ఎదుర్కొనే వారి తత్వమే తనకు ఇష్టమని అన్నాడు. ఒక సినిమా ఒప్పుకున్నాక స్క్రిప్ట్ నుంచి డాన్స్ వరకు ప్రతి అంశంలో పూర్తిగా లీనమవుతానని, అదే సమయంలో పని మీద మునిగిపోవడం వల్ల వ్యక్తిగత జీవితంలో కొన్ని దూరాలు పెరిగాయని కూడా నిజాయితీగా ఒప్పుకున్నాడు.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

# యరగండ్లపల్లిలో... ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ -3

## ప్రారంభించిన గ్రామ సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్

## ఆరు టీంలతో జనవరి 11 నుండి16 వరకు నిర్వహణ






**ధర్మఘంట జనవరి 11 మర్రిగూడ**

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం యరగండ్లపల్లి గ్రామంలోని, ముత్యాలమ్మ గుడి పక్కన క్రికెట్ మైదానంలో సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ నిర్వహిస్తున్న ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్-3ని ఆదివారం గ్రామ సర్పంచ్ వల్లంల సంతోష్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష్ మాట్లాడుతూ...ఆరు టీంలతో జనవరి 11 నుండి 16 వరకు, క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తామని తెలిపారు. టోర్నమెంట్ లో గెలుపొందిన విజేతలకు,మొదటి బహుమతిగా రూ.25 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు,తృతీయ బహుమతిగా రూ.10 వేల బహుమతులతో పాటు టోర్నీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి,ప్రత్యేకమైన బహుమతులను ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమనికి ఆర్గనైజర్లు గ్రామ యువత,వార్డ్ నెంబర్లు,బీఆర్ఎస్ నాయకులు వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.

# ప్రజా పోరాటాలే సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతాయి

## ప్రజల కోసం పోరాడేది కమ్యూనిస్టులే.. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్






**ధర్మఘంట జనవరి 11 భువనగిరి**

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం పోరాటాలే మార్గమని పోరాటాలే సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతుందని, ప్రజల హక్కుల కోసం,వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడేది మార్క్సిస్టులేనని సిపి(ఐ)ఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు యండి జహంగీర్ అన్నారు.ఆదివారం భువనగిరి మండల పరిధిలోని అనాజిపురం గ్రామంలో సిపి(ఐ)ఎం గ్రామ శాఖ జనరల్ బాడీ సమావేశం (పిక్నిక్) శాఖ కార్యదర్శి ఏదునూరి వెంకటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రపంచమంతా శాస్త్రీయంగా అభివృద్ధి చెందుతూ ఉంటే మన దేశంలో మాత్రం కేంద్రంలోని బిజెపి మోడీ ప్రభుత్వం మూఢాచారాలకు పెద్దపీట వేస్తుందని విమర్శించారు. సమాజంలో సామాజిక అసమానతలు, మహిళలపై దాడులు రోజురోజు పెరుగుతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు.సోషలిస్టు దేశాల్లో ఎర్రజెండా పాలనలో ఆకలి,దారిద్ర్యం,దోపిడి, అణిచివేత లేకుండా ప్రజలందరికీ విద్యా, ఉద్యోగం ఉపాధి అందించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. బిజెపి పాలనలో మాత్రం కులాల,మతాల పేరిట విద్వేషాలు పెరిగిపోతున్నాయన్నారు. విద్యా,వైద్యం సామాన్య ప్రజలకు అందని ద్రాక్షలా మిగిలిపోయాయన్నారు.కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు.తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా గెలిచిన సర్పంచ్ లు గ్రామాల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం చేయాలన్నా,గ్రామాల అభివృద్ధికి పాటుపడాలన్న రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి తగిన నిధులు కేటాయించాలని జహంగీర్ సూచించినారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ,జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ,మండల కార్యదర్శి, చీమలకొండూరు సర్పంచ్ పల్లెర్ల అంజయ్య,మండల కార్యదర్శివర్గ సభ్యులు ఎదునూరి మల్లేష్, కొండమడుగు నాగమణి, సిపిఎం సీనియర్ నాయకులు గునుగుంట్ల శ్రీనివాస్,మాజీ సర్పంచులు బొల్లెపల్లి కుమార్, గునుగుంట్ల కల్పన, ఏదునూరి ప్రేమలత,గ్రామ సర్పంచ్ రాయపురం సురేష్, సిపిఎం మండల కమిటీ సభ్యులు అబ్దుల్లాపురం వెంకటేష్,బొల్లపల్లి లీల, గ్రామ నాయకులు ఎండి జహంగీర్,కడారి కృష్ణ, స్వామి,మల్లేష్,కిషన్, పాండు,బాలమల్లేష్, బాలరాజు,కళ్యాణి,జ్యోతి, హేమలత,కావ్య,ప్రీతి, నజీమా తదితరులు పాల్గొన్నారు.

# సమాజంపై ఫేక్ న్యూస్ ప్రభావం!



గంట సోమన్న, సీనియర్ జర్నలిస్ట్.

సోషల్ మీడియా యుగంలో ఒక నకిలీ వార్త (ఫేక్ న్యూస్) క్షణాల్లో లక్షలాది మందికి చేరుతుంది.ఇది కేవలం అబద్ధం మాత్రమే కాదు, అది సమాజంలో ద్వేషం,హింస, రాజకీయ అస్థిరత,ఆర్థిక, కుటుంబ నష్టాలను సృష్టిస్తుంది. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 2024- 2025 గ్లోబల్ రిస్క్ రిపోర్ట్ ప్రకారం...మిస్ ఇన్ఫర్మేషన్ ప్రపంచంలోనే అతిపెద్ద ముప్పుగా ఉంది.భారతదేశం ఈ రిస్క్‌లో మొదటిస్థానంలో ఉంది.ఫేక్ న్యూస్ ఎలా వ్యాప్తి చెందుతుందో,దాని ప్రభావం ఎంత తీవ్రంగా ఉంటుందో, సమాజాన్ని, రాజకీయాలను,ఆర్థిక వ్యవస్థను ఎలా దెబ్బతీస్తుందో? ప్రస్తుత సోషల్ మీడియా జమానా రుజువు చేస్తుంది. భారతదేశంలో ఫేక్ న్యూస్ యొక్క నిజమైన ప్రభావాలు దేశంలో సోషల్ మీడియాలో ఫేక్ న్యూస్ వ్యాప్తి చెందడం వల్ల సామాజిక హింస మరియు ద్వేషం పెరిగిపోతుంది.మత సంఘర్షణలు,రాజకీయ ఆరోపణలు తీవ్రమవడానికి ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి.బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడుల గురించి 2024లో వ్యాప్తి చెందిన నకిలీ వీడియోలు భారతదేశంలో ద్వేషాన్ని పెంచాయి.2019,2024 ఎన్నికల్లో వాట్సాప్,ఫేస్‌బుక్ లో ఫేక్ న్యూస్ ఓటర్ల అభిప్రాయాలను మార్చాయి. ప్రస్తుత కాలంలో డీప్‌ఫేక్‌లు, ఏఐ-జనరేటెడ్ వీడియోలు విపరీతంగా పెరిగాయి.ఇది మరింత ప్రమాదకరంగా మారే అవకాశం ఉంది.ఒక అధ్యయనం ప్రకారం... భారతదేశంలో ఫేక్ న్యూస్‌లో 46% రాజకీయ సంబంధించినవే,ఇవి ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసి, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తాయి. ఫేక్ న్యూస్ మతపరమైన, రాజకీయపరమైన ద్వేషాలనే కాదు స్టాక్ మార్కెట్‌లో హెచ్చుతగ్గులు సృష్టిస్తూ ఆర్థిక నష్టాలు కూడా కలిగిస్తాయి. ఫేక్ న్యూస్ వల్ల ప్రపంచ వ్యాప్తంగా స్టాక్ మార్కెట్‌లో బిలియన్ల డాలర్ల నష్టం వాటిల్లుతుంది. భారతదేశంలో కూడా ఇది ఇన్వెస్టర్ల నమ్మకాన్ని కోల్పోయేలా చేస్తుంది.దీనితో ఉద్యోగాలు తగ్గుతాయి,ఉత్పత్తి కూడా తగ్గుతుంది.

కుటుంబాలపై కూడా ప్రభావం

ఫేక్ న్యూస్ ప్రభావంతో కుటుంబ సభ్యుల మధ్య మనస్పర్థలు ఏర్పడి,కలహాలకు దారితీసిన సంఘటనలు కోకొల్లలు.జరిగిన విషయాన్ని మరో కోణంలో బంధువులకు చేరవేయడం వల్ల బంధాలు దూరమై శత్రువులుగా మారినవారు లేకపోలేదు. ఒకప్పుడు వీటిని పుకార్లు అనేవారు.ఇప్పుడు అవే నకిలీ ఆధారాలతో ఫేక్ న్యూస్ గా రూపాంతరం చెంది,మానవ మెదళ్లను హైజాక్ చేశాయి. మనుషుల మధ్య,వ్యవస్థల మధ్య అగాధం సృష్టిస్తున్నాయి. సమాజం మొత్తం ప్రస్తుతం వాస్తవాల కంటే అవాస్తవాల మీదనే ఎక్కువగా ఆధారపడి నడుస్తుంది. అందుకే రక్త సంబంధీకుల మధ్య కూడా ఘర్షణలు తలెత్తి రక్తం చిందుతుంది.

ఇలాంటి పరిస్థితుల్లో మనం ఏమి చేయాలి?

ఫేక్ న్యూస్ వల్ల నష్టం వాటిల్లకుండా ఉండాలంటే మీడియా లిటరసీ పెంచుకోవాలి.చుసిన,విన్న ప్రతిదానిని గుడ్డిగా నమ్మి వెనుకాముందు ఆలోచించకుండా షేర్ చేయవద్దు.ఫాక్ట్-చెకింగ్ సైట్లు (ఆల్ట్ న్యూస్,బూమ్ లైవ్) ఉపయోగించి వాస్తవాలు తెలుసుకొని నిర్ధారణ అయ్యాక ముందుకు వెళ్ళాలి.ఎందుకంటే ఫేక్ న్యూస్ కేవలం అబద్ధం మాత్రమే కాదు,అవి సమాజాన్ని విచ్ఛిన్నం చేసే ఆయుధాలనే సత్యాన్ని గ్రహించకపోతే,జీవితం నాటకం ముగిసిన తర్వాత మిగిలే అపనమ్మకంగా మారుతుంది.

## అమీనాబాద్ గ్రామంలో దొడ్డి కొమరయ్య బయోపిక్ టీం పర్యటన

**కోదాడ :జనవరి 11 (ధర్మాఘంట)**




తెలంగాణ వీరుల పోరాట చరిత్రను ప్రపంచానికి తెలియజేయాలనే మహత్తర సంకల్పంతో నూతనంగా నిర్మించబోయే దొడ్డి కొమరయ్య జీవిత చరిత్ర ఆధారిత చిత్రానికి సంబంధించిన సినిమా సహాయ నిర్మాణ చేరికల కార్యక్రమం శనివారం అనంతగిరి మండలం అమీనాబాద్ గ్రామంలో నిర్వహించారు.సినిమా డైరెక్టర్ సేనాపతి ఆధ్వర్యంలో, సినిమా నిర్మాణ కమిటీ చైర్మన్, సహ నిర్మాత అంకతి అనసూర్య నేతృత్వంలో గ్రామ గ్రామాన పర్యటిస్తూ ప్రజలను కలుసుకొని సినిమా లక్ష్యాలను వివరించారు. ఈ సందర్భంగా దొడ్డి కొమరయ్య చేసిన వీరోచిత పోరాటం, తెలంగాణ ఉద్యమ చరిత్రలో ఆయన పాత్రను భావితరాలకు తెలియజేయాల్సిన అవసరాన్ని వారు వివరించారు.గ్రామస్తుల నుండి ఈ సినిమాకు విశేష స్పందన లభించగా, తెలంగాణ వీరుల చరిత్రను వెండితెరపై ఆవిష్కరించే ఈ ప్రయత్నానికి పూర్తి సహకారం అందిస్తామని పలువురు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణ సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడే దిశగా ఈ చిత్రం ఒక మైలురాయిగా నిలుస్తుందని నిర్వాహకులు తెలిపారు.

## ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు



**ధర్మఘంట జనవరి 11,సూర్యాపేట జిల్లా ప్రతినిధి**

జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్ అంబేద్కర్ విగ్రహం వద్ద స్వతంత్ర సమరయోధులు ఒడ్డెర జాతి ముద్దుబిడ్డ వడ్డే ఓబన్న 219వ జయంతి వేడుకలు తెలంగాణ వడ్డెర మేలుకొలుపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు, ఐ ఎన్ టి యు సి సూర్యాపేట జిల్లా అధ్యక్షులు ఆలకుంట్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలు గా మాజీ కౌన్సిలర్లు మడ్డిపల్లి విక్రమ్, జ్యోతి కర్ణాకర్ లు పాల్గొని మాట్లాడుతూ మాట్లాడుతూ వడ్డెర జాతిని ప్రభుత్వం అధికారికంగా గుర్తించి జనవరి 11 వ తారీకున ప్రభుత్వం వడ్డే ఓబన్న జయంతి వేడుకలు నిర్వహించడం సంతోషకరమైన అన్నారు. వడ్డెరలను సామాజిక,రాజకీయ రంగాలలో గుర్తించాలని అన్నారు. ఆలకుంట్ల బాలకృష్ణ మాట్లాడుతూ కొండలను పిండి చేసే సత్తా కేవలం వడ్డెరలకు మాత్రమే ఉండేదని అన్నారు. అప్పట్లో దేవాలయాలు, కోటలు, గడులు, కట్టే వాళ్ళని అన్నారు. బ్రిటిష్ వాళ్లతో యుద్ధాలు చేయాలన్న మేమే ఉండాలి అన్నారు. అసెంబ్లీలో ఇంతవరకు వడ్డెర ల గురించి ప్రస్తావించలేదని అన్నారు. వడ్డెరలు కేవలం ఓటర్ల గానే కాకుండా నాయకులుగా కూడా ఎదగాలని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చిన మమ్మల్ని పట్టించుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా మాకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి సోమన్న, మహేష్, సోషల్ మీడియా ఇన్చార్జ్ శివరాత్రి గోపి, వరి కుప్పల నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

### సూర్యాపేట చరిత్రలో 500 పైగా పాల్గొన్న మహిళలు






**ధర్మఘంట జనవరి 11,సూర్యాపేట జిల్లా ప్రతినిధి**

సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి పండుగ అని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ప్రధాన కార్యదర్శి ఉమా నల్గొండ జిల్లా ఇంచార్జ్ వట్టే జానయ్య యాదవ్ అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రం సద్దల చెరువు సమీపంలో వారు ముగ్గుల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. తెలంగాణలో అగ్రవర్ణాల పాలన అగమ్య గోచరంగా ఉంది అని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు అందరూ ఏకం కావాలి అని అన్నారు. తీన్మార్ మల్లన్న సారథ్యంలో భవిష్యత్తులో రాజ్యాధికార పార్టీ అధికారంలోకి వస్తుందని అన్నారు. 97% శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఉన్నారని 3% శాతం ఉన్న అగ్ర వర్ణాలను గద్దె దించే సమయం వచ్చిందని అన్నారు. వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో జనరల్ స్థానాల్లో ఎస్సీ ఎస్టీ బీసీలను నిలబెట్టి గెలిపించుకుంటామని అన్నారు.కుల మతాలకు సంబంధం లేకుండా ముగ్గుల పోటీలకు మహిళలు అత్యధిక సంఖ్యలో పాల్గొన్నారని అన్నారు. సూర్యాపేట చరిత్రలోనే ఇంతమంది మహిళలు పాల్గొన్నారు అని సూర్యాపేట ప్రజలందరూ చర్చించుకుంటున్నారని అన్నారు. ఈ ముగ్గుల పోటీకి వచ్చిన మహిళలందరికీ వారు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం గెలిచిన మహిళలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ నీరజ గౌడ్, జిల్లా అధ్యక్షులు మామిడి అంజయ్య ప్రధాన కార్యదర్శి మీరు అక్బర్ మైనార్టీ జిల్లా అధ్యక్షులు చాంద్ పాషా, సూర్యాపేట పట్టణ అధ్యక్షుడు కుంభం నాగరాజు, మాజీ కౌన్సిలర్ అన్నెపర్తి నాగరాజ్, లింగస్వామి, సైదులు, ఆవుల అంజయ్య, మంజుల గౌడ్, వర్రే కవిత, నారాయణదాసు కవిత, సేవ్య నాయక్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## చైనా మంజా విక్రయిస్తున్న ఆరుగురిపై కేసులు నమోదు

**ధర్మఘంట జనవరి 11 సూర్యాపేట:**



సూర్యాపేట పట్టణంలో ఆదివారం చైనా మాంజా విక్రాలపై పట్టణ పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఇన్స్పెక్టర్ వెంకటయ్య మాట్లాడుతూ...అక్రమంగా చైనా మంజా విక్రయిస్తున్న ఆరుగురు వ్యక్తులను గుర్తించి, ఆరుగురుపై ఆరు కేసులు నమోదు చేశామని తెలిపారు.సూర్యాపేట పట్టణ ఎస్ఐలు శివతేజ్,మహేందర్ నాథ్,ఏడుకొండలు ఆధ్వర్యంలో టీమ్స్ ఏర్పాటు చేసి,రైడ్స్ నిర్వహించామన్నారు.చైనా మాంజా విక్రయించినా,కొనుగోలు చేసినా నేరమని,ఇలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.చైనా మాంజా ఉపయోగించడం వల్ల సీసపుదారం ప్రయాణికులకు,పక్షులకు తగలడం వల్ల ప్రాణాపాయాలు సంభవిస్తున్నాయని తెలిపారు.తల్లిదండ్రులు ఎవరు కూడా పిల్లలకు ఈ చైనా మాంజాను కొనివ్వకూడదని సూచించారు.

ధర్మఘంట

# లక్ష్యం 11 ఏమిటి!

నగరాలను సమ్మిళితంగా, సురక్షితంగా,స్థితిస్థాపకంగా మరియు స్థిరంగా మార్చడం

నగరాలు ఆవిష్కరణ మరియు ఆర్థిక వృద్ధికి కేంద్రాలు.కానీ,అవి పేదరికం,అసమానత మరియు పర్యావరణ క్షీణత వంటి సవాళ్లను కూడా ఎదుర్కొంటాయి.లక్ష్యం 11 సమ్మిళిత,సురక్షితమైన మరియు స్థితిస్థాపకంగా ఉండే నగరాలను సృష్టించడానికి స్థిరమైన పట్టణ అభివృద్ధిని ప్రోత్సహిస్తుంది. నగరాలు ప్రపంచ జీవన భవిష్యత్తును సూచిస్తాయి. 2022లో ప్రపంచ జనాభా 8 బిలియన్లకు చేరుకుంది,సగానికి పైగా పట్టణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు.ఈ సంఖ్య పెరుగుతుందని మాత్రమే అంచనా వేయబడింది.2050 నాటికి 70 శాతం మంది ప్రజలు నగరాల్లో నివసిస్తారని భావిస్తున్నారు.అయితే ఈ నగరాల్లో చాలా వరకు ఈ వేగవంతమైన పట్టణీకరణకు సిద్ధంగా లేవు,ఇది గృహనిర్మాణం, మౌలిక సదుపాయాలు మరియు సేవల అభివృద్ధిని అధిగమిస్తుంది.ఇది మురికివాడలు లేదా మురికివాడల వంటి పరిస్థితుల పెరుగుదలకు దారితీసింది. నగరాల్లో పట్టణ విస్తరణ,వాయు కాలుష్యం మరియు పరిమిత బహిరంగ బహిరంగ ప్రదేశాలు కొనసాగుతున్నాయి.2015లో ఎస్డీజీలను అమలు చేసినప్పటి నుండి మంచి పురోగతి సాధించబడింది.ఇప్పుడు జాతీయ మరియు స్థానిక విపత్తు ప్రమాద తగ్గింపు వ్యూహాలను కలిగి ఉన్న దేశాల సంఖ్య రెట్టింపు అయింది.కానీ, సమస్యలు ఇంకా అలాగే ఉన్నాయి.2022 నాటికి పట్టణ జనాభాలో సగం మందికి మాత్రమే ప్రజా రవాణా సౌకర్యం అందుబాటులో ఉంది.పట్టణ స్థలాలను నిర్మించే మరియు నిర్వహించే విధానాన్ని గణనీయంగా మార్చకుండా స్థిరమైన అభివృద్ధి సాధించలేము.ప్రాథమిక సేవలు,సరసమైన గృహాలు, సమర్థవంతమైన రవాణా మరియు అందరికీ పచ్చని ప్రదేశాలకు ప్రాధాన్యతనిచ్చే సమ్మిళిత,స్థితిస్థాపక మరియు స్థిరమైన పట్టణ అభివృద్ధి విధానాలు మరియు పద్ధతులను అమలు చేయడంపై ప్రయత్నాలు దృష్టి పెట్టాలి.

నగరాలు ఇంకా భవిష్యత్తుకు ఎందుకు రుజువు కాలేదు? పట్టణ వృద్ధిలో ఎక్కువ భాగం చిన్న నగరాలు మరియు ఇంటర్మీడియట్ పట్టణాలలో జరుగుతోంది.అసమానతలు మరియు పట్టణ పేదరికాన్ని తీవ్రతరం చేస్తోంది.ప్రపంచ వ్యాప్తంగా 3 బిలియన్ల మంది వరకు నివసించడానికి స్థలం కోసం కష్టపడుతున్నారు.1.12 బిలియన్ల మంది ప్రాథమిక సేవలు లేకుండా మురికివాడలు లేదా అనధికారిక స్థావరాలలో నివసిస్తున్నారు.సురక్షితమైన,స్థితిస్థాపక మరియు స్థిరమైన నగరాలను సృష్టించడానికి సరసమైన గృహనిర్మాణం, వాతావరణ స్థితిస్థాపక మౌలిక సదుపాయాలు మరియు సమగ్ర పాలనలో సమన్వయంతో కూడిన పెట్టుబడులు అవసరం.



**ప్రభుదాస్ గండమళ్ళ,**
ఎకనామిక్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ మరియు
ప్రపంచ బ్యాంకు సివిల్ సొసైటీ పాలసీ ఫోరమ్ సభ్యుడు, వాషింగ్టన్ డి.సి,యూఎస్ఏ.
9441464767, 9390381267

నగరాలు ఎదుర్కొంటున్న కొన్ని అత్యంత ముఖ్యమైన సవాళ్లు ఏమిటి? 2040 నాటికి,2 బిలియన్లకు పైగా పట్టణ నివాసితులు కనీసం 0.5డిగ్రీల అదనపు ఉష్ణోగ్రత పెరుగుదలను ఎదుర్కోవలసి ఉంటుంది.ప్రపంచ పట్టణ జనాభాలో 36 శాతం మంది వార్షిక సగటు ఉష్ణోగ్రతలు 29డిగ్రీల లేదా అంతకంటే ఎక్కువ భరించాల్సి రావచ్చు.వరద ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయి.2025 లో 1 బిలియన్ ప్రజలు తీవ్రమైన నదీ వరదలకు గురయ్యే ప్రాంతాలలో నివసిస్తున్నారు.వారిలో సగం మంది నగరాల్లోనే ఉన్నారు. అసమానత మరియు పట్టణ శక్తి వినియోగం మరియు కాలుష్య స్థాయిలు కొన్ని సవాళ్లు ఎదుర్కొన్నాయి.నగరాలు భూమి యొక్క భూమిలో కేవలం 3 శాతం మాత్రమే ఆక్రమించాయి. కానీ,శక్తి వినియోగంలో 60-80 శాతం మరియు కార్బన్ ఉద్గారాలలో 75 శాతం వాటా కలిగి ఉన్నాయి.చాలా నగరాలు వాతావరణ మార్పు మరియు ప్రకృతి వైపరీత్యాలకు ఎక్కువగా గురవుతున్నాయి.ఎందుకంటే వాటి అధిక సాంద్రత మరియు స్థానం కారణంగా మానవ, సామాజిక మరియు ఆర్థిక నష్టాలను నివారించడానికి పట్టణ స్థితిస్థాపకతను నిర్మించడం చాలా ముఖ్యం. ఇది ఎలా ప్రభావితం చేస్తుంది?లిఈ సమస్యలన్నీ చివరికి ప్రతి పౌరుడిని ప్రభావితం చేస్తాయి. అసమానత అశాంతి మరియు అభద్రతకు దారితీస్తుంది. కాలుష్యం ప్రతి ఒక్కరి ఆరోగ్యాన్ని క్షీణింపజేస్తుంది. కార్మికుల ఉత్పాదకతను మరియు అందువల్ల ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ప్రకృతి వైపరీత్యాలు ప్రతి ఒక్కరి జీవనశైలిని దెబ్బతీసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. లక్షలాది మంది ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే వాయు కాలుష్యం పట్టణ సమస్య మాత్రమే కాదు,పట్టణాలు మరియు గ్రామీణ ప్రాంతాలను కూడా ప్రభావితం చేస్తుంది.

నగరాలను సేంద్రీయంగా పెరగడానికి వదిలేస్తే ఏమి జరుగుతుందంటే పేలవమైన ప్రణాళికతో కూడిన పట్టణీకరణ ఖర్చును ప్రపంచవ్యాప్తంగా ఉన్న కొన్ని భారీ మురికివాడలు, చిక్కుబడ్డ ట్రాఫిక్,గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు మరియు విశాలమైన శివారు ప్రాంతాలలో చూడవచ్చు.స్థిరంగా వ్యవహరించడం ద్వారా,అన్ని పౌరులు మంచి జీవన నాణ్యతను జీవించే నగరాలను నిర్మించాలని ఎంచుకొని,నగరం యొక్క ఉత్పాదక డైనమిక్స్‌లో భాగమవ్వాలని,పర్యావరణానికి హాని కలిగించకుండా ఉమ్మడి శ్రేయస్సు మరియు సామాజిక స్థిరత్వాన్ని సృష్టిస్తామని ప్రతినబూనాలి.

స్థిరమైన పద్ధతులను అమలు చేయడం ఖరీదైనదా? ప్రయోజనాలతో పోలిస్తే ఖర్చు చాలా తక్కువ.ఉదాహరణకు, క్రియాత్మక ప్రజా రవాణా నెట్‌వర్క్‌ను సృష్టించడానికి ఖర్చు ఉంటుంది.కానీ,ఆర్థిక కార్యకలాపాలు,జీవన నాణ్యత, పర్యావరణం మరియు నెట్‌వర్క్ చేయబడిన నగరం యొక్క మొత్తం విజయం పరంగా ప్రయోజనాలు భారీగా ఉంటాయి.ఈ లక్ష్యాన్ని సాధించడంలో నేను ఏమి చేయగలను? అని ఆలోచించాలి.

మీ నగరం యొక్క పాలన మరియు నిర్వహణలో చురుకైన ఆసక్తిని చూపండి.మీకు అవసరమని మీరు నమ్మే నగరం కోసం వాదించండి.మీ భవనం, వీధి మరియు పరిసరాల కోసం ఒక దృష్టిని అభివృద్ధి చేసుకోండి. ఆ దృష్టిపై చర్య తీసుకోండి. తగినంత ఉద్యోగాలు ఉన్నాయా? మీ పిల్లలు సురక్షితంగా పాఠశాలకు నడవగలరా? మీరు మీ కుటుంబంతో రాత్రిపూట నడవగలరా? సమీపంలోని ప్రజా రవాణా ఎంత దూరం ఉంది? గాలి నాణ్యత ఎలా ఉంటుంది? మీ ఉమ్మడి ప్రజా స్థలాలు ఎలా ఉంటాయి? మీ కమ్యూనిటీలో మీరు ఎంత మెరుగైన పరిస్థితులు సృష్టిస్తే,జీవన నాణ్యతపై అంత ప్రభావం ఉంటుంది.పట్టణ స్థలాల నిర్మాణం మరియు నిర్వహణ విధానాన్ని గణనీయంగా మార్చకుండా స్థిరమైన అభివృద్ధిని సాధించలేము.

## ఆదాయపు పన్ను శాఖ అధికారి రవి కిరణ్ జన్మదిన వేడుక

### యువతకు ఆదర్శంగా నిలిచిన ఆదాయపు పన్ను శాఖ అధికారి రవి కిరణ్







**ధర్మఘంట, జనవరి 11, హైదరాబాద్:**

కామినేని హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అంజయ్య జేష్ఠ కుమారుడు, ఆదాయపు పన్ను శాఖ అధికారి రవి కిరణ్ పుట్టినరోజును పురస్కరించుకొని, నేడు హైదరాబాద్ అత్తాపూర్‌లోని వారి నివాసంలో డి.బి.ఎస్.ఏ ఆధ్వర్యంలో ఘనంగా బహుజన బర్త్‌డే వేడుకలు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం డాక్టర్ అంజయ్య సమక్షంలో, వారి కుమారులు హరి కిరణ్, సాయి కిరణ్, అలాగే డాక్టర్ అంజయ్య సోదరి ఆశ మరియు కుటుంబ సభ్యుల మధ్య ఆత్మీయంగా, సంతోషభరిత వాతావరణంలో సాగింది. బహుజన విలువలు, కుటుంబ అనుబంధాలు ప్రతిబింబించేలా ఈ వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా ఓయూ పీహెచ్డీ రీసెర్చ్ స్కాలర్, డి.బి.ఎస్.ఏ స్టేట్ కోఆర్డినేటర్ జంగిలి దర్శన్ మాట్లాడుతూ సమాజానికి సేవ చేసే విలువలు, క్రమశిక్షణ, నిజాయితీ వంటి లక్షణాలు కలిగిన కుటుంబంలో పుట్టిన రవి కిరణ్ పుట్టినరోజును బహుజన భావజాలంతో జరుపుకోవడం గర్వకారణమని తెలిపారు. డాక్టర్ అంజయ్య వంటి సేవాభావం కలిగిన వ్యక్తి కుటుంబంలో పెరిగి, ప్రజాసేవను తన జీవన లక్ష్యంగా ఎంచుకున్న రవి కిరణ్ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని అన్నారు. రవి కిరణ్ ఆదాయపు పన్ను శాఖ అధికారిగా ప్రభుత్వ ఉద్యోగంలో విధులు నిర్వర్తిస్తూ, నీతి, నిజాయితీతో ఉద్యోగ బాధ్యతలను సమర్థంగా నిర్వహించడం సమాజానికి గర్వకారణమని తెలిపారు. మంచి వ్యక్తిత్వం, ఉన్నత విలువలు కలిగిన ఇలాంటి అధికారులు ప్రజాస్వామ్యానికి బలంగా నిలుస్తారని, యువతకు దిశానిర్దేశం చేసే ఆదర్శప్రాయులని అన్నారు. రవి కిరణ్ మరింత ఉన్నత స్థాయికి చేరుకుని ప్రజల పక్షాన నిలబడి ముందుకు సాగాలని ఆకాంక్షించారు. అనంతరం బహుజన మేధావి డాక్టర్ మేడే శాంతి కుమార్ మాట్లాడుతూ బహుజన సమాజంలో చదువు, చైతన్యం, బాధ్యతాయుతమైన సేవ ఎంత ముఖ్యమో రవి కిరణ్ జీవితం స్పష్టంగా చూపుతోందని అన్నారు. అధికారంలో ఉన్నా నేలమీద నిలబడి ఆలోచించే వ్యక్తులే నిజమైన సామాజిక మార్పుకు కారణమవుతారని, డాక్టర్ అంజయ్య కుటుంబం విద్యను ఆయుధంగా, సేవను మార్గంగా ఎంచుకుని సమాజానికి దిశ చూపుతోందని పేర్కొన్నారు. రవి కిరణ్ తన వృత్తి బాధ్యతలతో పాటు సామాజిక బాధ్యతను కూడా సమతుల్యంగా నిర్వర్తిస్తూ ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ వేడుకల్లో బహుజన మేధావి డాక్టర్ మేడే శాంతి కుమార్ తో పాటు డి.బి.ఎస్.ఏ నాయకుడు ప్రణయ్, బి. శంకర్ రావు తదితరులు పాల్గొని, రవి కిరణ్ కు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బహుజన భావజాలంతో, ఆత్మీయతతో సాగిన ఈ కార్యక్రమం అందరి మనసుల్లో మధుర జ్ఞాపకాలుగా నిలిచింది.

## సుధాకర్ విజన్ క్లబ్, వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు




**ధర్మఘంట, జనవరి 11, సూర్యాపేట**

సుధాకర్ విజన్ క్లబ్, వాసవి కపుల్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం 10 గంటలకు విద్యానగర్ లోని శ్రీ రామలింగేశ్వర దేవాలయం వద్ద సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలు, వంటల పోటీలులిశ్రీ నిర్వహిస్తున్నట్లు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ఐపిఈ సింగరికొండ రవీందర్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ విద్యానగర్ ని రామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద జరిగే ముగ్గుల పోటీలు వంటల పోటీలలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముగ్గుల పోటీలలో గెలుపొందిన వారికి మొదటి బహుమతి వెట్ గ్రైండర్, రెండవ బహుమతి మిక్సీ, మూడవ బహుమతి కుక్కర్ ను శ్రేష్ఠ హాస్పిటల్ వారి సహకారంతో అందజేస్తామని తెలిపారు. అలాగే వంటల పోటీలలో విజేత లకు మొదటి, రెండవ, మూడవ బహుమతులు చీరలను గండూరి షాపింగ్ మాల్ యజమాని గండూరి క్రపాకర్ సహకారంతో అందజేస్తామని, ముగ్గుల పోటీలలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి శివసాయి మార్కెటింగ్ సోలార్ ఎనర్జీ వారి ఆధ్వర్యంలో బహుమతులు అందజేస్తామని తెలిపారు. ఈ పోటీలలో స్థానిక మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఐపిసిలు పబ్బతి వేణుమాధవ్, బిక్కుమళ్ల కృష్ణ, వెంపటి శబరినాథ్, గో సేవ జిల్లా ఇంఛార్జ్ కలకోట లక్ష్మయ్య, ఆర్ ఎస్ కలకోట అనిత, ఆర్ సి నాగరాజు, శ్రీరంగం రాము లు పాల్గొన్నారు.

## దహన సంస్కారాలలలో అన్నీ తానైన గండూరి కృపాకర్




**ధర్మఘంట, జనవరి 11,సూర్యాపేట:**

45వ వార్డులోని ప్రజలకు ఏ ఆపదొచ్చిన ముందుండి అన్ని తానే నిలిచే ప్రజానాయకుడు గండూరి కృపాకర్. శనివారం ఆయన వార్డులో అద్దె ఇంటిలో ఉంటున్న ఆర్యవైశ్య సంతతికి చెందిన చెన్నూరు వెంకటేశ్వర్లు గుండెపోటుతో మరణించడంతో ఇంటి యజమాని దహన సంస్కారాలకు అనుమతి ఇవ్వక పోవడం తో వార్డు ప్రజలు గండూరి కృపాకర్ ను సంప్రదించగా వార్డు ప్రజలకు ఉచితంగా ఏర్పాటుచేసిన తన వాటర్ ప్లాంట్ లో ఆశ్రయం ఇచ్చి తన ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆదివారం స్వయంగా పాడే మోసి దహన సంస్కారాలు పూర్తయ్యే వరకు ముందుండి తమ సేవలను అందించారు. ఎన్నికల సమయంలోనే ప్రజలను ఉపయోగించుకుంటే రాజకీయ నాయకులకు భిన్నంగా గత పది సంవత్సరాలుగా తన వార్డు ప్రజలకు ఎన్నో సేవలు అందిస్తూ ముందు వరుసలో నిల్చున్నారు. నిజమైన ప్రజా నాయకుడు గండూరి కృపాకర్ అంటూ వార్డు ప్రజలు కొనియాడారు.వీరు కులమతాలకతీతంగా ఏ పండుగలు జరిగిన, ఏవరికీ ఏ ఆపద వచ్చినా నేనున్నానంటూ ముందుకు వచ్చి వార్డు ప్రజల మన్ననలు పొందుతున్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం మరణించిన వారినీ స్మశాన వాటికకు తీసుకపోవడానికి ఉచితంగా వైకుంఠ రథాలు ఏర్పాటు చేసినట్టుగానే సూర్యాపేటలో అద్దె ఇళ్లలో నివాసం ఉంటున్న వారి కుటుంబ సభ్యులలో ఎవరైనా మరణించినట్లయితే దాన సంస్కారాలు చేసుకోనే విధంగా ప్రభుత్వం వైకుంఠ భవనాలు నిర్మించాలని కోరారు.

## ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఉగ్రవాదిగా ప్రకటించిన ముహమ్మద్ మసూద్ అజార్ అల్వి బెదిరింపులు

**ధర్మఘంట, జనవరి 11, హైదరాబాద్**



మే 2019లో ఐక్య రాజ్య సమితి ప్రపంచ ఉగ్రవాదిగా ప్రకటించిన ముహమ్మద్ మసూద్ అజార్ అల్వి ఒక పాకిస్తాన్ ఉగ్రవాద నాయకుడు, జైష్-ఎ-మోహన్ ఉగ్రవాద సంస్థ వ్యవస్థాపకుడు మరియు ప్రస్తుత నాయకుడు... ముహమ్మద్ మసూద్ అజార్ అల్వీ ఒక పాకిస్తానీ తీవ్రవాద నాయకుడు, అతను పాకిస్తాన్ ఆధారిత ఇస్లామిక్ దేవ్బంది జిహాదిస్ట్ సంస్థ అయిన జైష్-ఎ-మొహమ్మద్ యొక్క స్థాపకుడు

**మా దగ్గరున్న సూసైడ్ బాంబర్ల గురించి తెలిస్తే..: మసూద్ అజర్**

ఏ క్షణమైనా దాడి చేసేందుకు సిద్ధంగా తమ వద్ద భారీగా సూసైడ్ బాంబర్లు ఉన్నారని జైషే మహ్మద్ (జీఎవీ) చీఫ్ మసూద్ అజర్ హెచ్చరించాడు. ఇందుకు సంబంధించిన ఓ ఆడియో బయటికి వచ్చింది. తమ సూసైడ్ బాంబర్ల సంఖ్య 1000 కంటే ఎక్కువని అందులో తెలిపాడు. ఆ నంబర్ చెబితే రేపు మొత్తం ప్రపంచ మీడియాలో అలజడి రేగుతుందని చెప్పాడు. ఇండియాలోకి చొరబడేందుకు అనుమతివ్వాలని ఆ బాంబర్లు తనపై ఒత్తిడి తెస్తున్నారని అన్నాడు.

# ఘనంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు





**మరిపాడు**

కదిరినాయుడు పల్లి ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలను విద్యార్థుల ఆనందోత్సాహాల మధ్య ఎంతో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఉదయగిరి మాజీ శాసనసభ్యులు కంభం విజయరామిరెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు అనుబంధంగా ట్రస్ట్ ఉండడం ఈ పాఠశాల అదృష్టమని,రామిరెడ్డి గంగిరెడ్డి కుమారులు విద్య ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించి అమెరికాలో ప్రముఖ వైద్యులుగా ఇతర వృత్తులలో గా సేవలందిస్తూతమ ప్రాంతంలోని అన్ని కుటుంబాలు అభివృద్ధి చెందాలనే తలంపుతో విద్య,వైద్యం రెండు కళ్ళుగా భావించి చారిటబుల్ ట్రస్ట్ స్థాపించి,వివిధ రకాల సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని,ఈ ట్రస్ట్ ద్వారా పడమటి నాయుడు పల్లి,చుంచులూరు పంచాయతీలలోని వందల మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగును నింపారని అన్నారు.ప్రవాస భారతీయులు రామిరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దేది చదువు మాత్రమేనని, విద్యార్థులందరూ సంస్కారంతో కూడిన చదువు నేర్చుకుని ఉన్నత స్థాయికి చేరాలని అన్నారు.అనంతరం నిర్వహించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతగానో ఆకట్టుకు న్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రవీంద్ర,ఆత్మకూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ గంగాధరరావు, మర్రిపాడు సబ్ ఇన్స్పెక్టర్ కాసుల శ్రీనివాసులు,నిష్ బిట్ సాఫ్ట్ వేర్ కంపెనీ అధినేత,సాహో ఫౌండేషన్ వ్యవస్థాపకులు పడచల నాగేశ్వరరావు,దుత్తలూరు మాజీ మండలా ధ్యక్షురాలు అనసూయమ్మ,విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, గంగిరామ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బంక శ్రీధర్ రెడ్డి,ట్రస్ట్ సభ్యులు లక్ష్మీ దేవమ్మ,కోట వెంకటేశ్వర్లు, కదిరినాయుడు పల్లి క్లస్టర్ అసిస్టెంట్ సెక్రటరీ విజయ భాస్కర్ రెడ్డి,ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఓబన్న జయంతి వేడుకలు



**దేవనకొండ**

మండల పరిధిలోని తెర్నేకల్ గ్రామంలో స్వాతంత్ర సమరయోధుడు వద్దే ఓబన్న జయంతి వేడుకలు ఆ కుల పెద్దలు ఘనంగా నిర్వహించారు.ముందుగా వడ్డేర వీధి నుండి ప్రధాన రహదారుల గుండా ఓబన్న చిత్రపటాన్ని డప్పు వాయిద్యాలతో ఊరేగింపుగా తీసుకెళ్లి బ్రిటిష్ పాలకులపై పోరాడిన ముత్తుకూరు గౌడప్ప విగ్రహం ముందు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ వారికి వ్యతిరేకంగా పడిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి ముఖ్య సైనికుడుగా పని చేసిన స్వాతంత్ర సమరయోధుడు ఓబన్న అన్నారు. ఈ కార్యక్రమంలో రెండవ వార్డ్ మెంబర్ వడ్డే మాదన్న, హనుమన్న, వెంకటరాముడు, పెద్ద లక్ష్మన్న, చిన్న లక్ష్మన్న, రంగస్వామి, దారాల పెద్దయ్య, పులికొండ, అశోకు, మాదన్న, మధు,రాజు, అంజనేయ తదితరులు పాల్గొన్నారు.

## వివేకానందుడి అడుగుజాడల్లో నడవడమే యువతకు నిజమైన నివాళి

**స్వామి వివేకానంద జయంతి జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా తిరుపతిలో 5కే రన్**




**తిరుపతి**

స్వామి వివేకానంద జయంతి జాతీయ యువజన దినోత్సవాన్ని పురస్కరించుకుని తిరుపతిలో నిర్వహించిన 5కే రన్‌లో తుడా చైర్మన్, టీటీడీ ఎక్స్ అఫిషియో సభ్యుడు, తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి ఉత్సాహంగా పాల్గొన్నారు. స్థానిక యువత, క్రీడాకారులు, విద్యార్థులతో కలిసి పరుగు పందెంలో భాగస్వాములై కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, లేవండి, మేల్కొనండి గమ్యం చేరే వరకు విశ్రమించకండి"అన్న వివేకానందుడి నినాదం నేటి యువతకు శాశ్వత స్ఫూర్తి అని అన్నారు. యువత శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసంపై కూడా దృష్టి సారించాలన్నారు. 5 కే రన్ వంటి కార్యక్రమాలు కేవలం పరుగు మాత్రమే కాకుండా ఆరోగ్యం పట్ల అవగాహన పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. తిరుపతిని ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చిదిద్దడంలో యువత భాగస్వామ్యం అత్యంత అవసరమని స్పష్టం చేశారు. వివేకానందుడి ఆశయాలకు అనుగుణంగా యువతకు మెరుగైన భవిష్యత్తు అందించడమే తమ లక్ష్యమని వెల్లడించారు. కార్యక్రమంలో విజేతలుగా నిలిచిన యువతీ యువకులకు డాలర్స్ దివాకర్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి భాజపా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, బీజేపీ నాయకుడు పృథ్వి, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో యువతీ యువకులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సాయుధ పోరాట వీరుడు వడ్డే ఓబన్న





**ఓబన్న పోరాటం స్ఫూర్తిదాయకం:జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి**

**కర్నూలు**

ప్రజల సమస్యలు తీర్చడానికి సాయుధ పోరాట యోధుడు వద్దే ఓబన్న చేసిన కృషి స్ఫూర్తిదాయకమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఓబన్న జన్మదినం సందర్భంగా పేర్కొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించి మాట్లాడుతూ బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ పాలనలో ఉన్న సమయంలో, రేనాటి పాలెగాళ్లకు, కంపెనీకి మధ్య 'కమర్జు భత్యాల' విషయంలో మొదలైన ఘర్షణలు పోరాటాలుగా మారాయన్నారు.ఆ పోరాటాల్లో ముఖ్యమైనది నొస్సం పాలెగాడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చేసిన సాయుధ పోరాటం అని, ఈ వీరోచిత పోరాటంలో సైన్యాధ్యక్షుడిగా వడ్డె ఓబన్న అత్యంత కీలక పాత్ర పోషించారన్నారు. ఓబన్న పోరాటం స్ఫూర్తిదా యకమని కలెక్టర్ తెలిపారు. ఓబన్న భయం అనేది ఎరగకుండా వడ్డెర్లు, బోయలు, చెంచులతో కూడిన సంచార తెగల సైన్యాన్ని సమర్థవంతంగా నడిపించారన్నారు. దట్టమైన నల్లమల అడవుల్లో బ్రిటిష్ సైన్యాన్ని ముప్పుతిప్పలు పెట్టి, వారిని చెల్లాచెదురు చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారన్నారు. తన నాయకుడైన నరసింహారెడ్డిని, ఆయన కుటుంబాన్ని రక్షించడంలో ఓబన్న ఎప్పుడూ ముందుండేవారన్నారు.ఈరోజు ఆయన జీవిత చరిత్రని తలుచుకోవడం మనందరికీ గర్వకారణం అన్నారు. స్వాతంత్ర్య సమరయోధులు మనకు నేర్పింది ఒక్కటే – నిస్వార్థంగా, ఐకమత్యంతో పని చేయాలని నేర్పించారన్నారు. వడ్డెర కమ్యూనిటీ యువత చదువుల్లో మరియు ఉద్యోగాల్లో రాణించి,సమాజ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జనవరి 11 న ప్రత్యేకంగా వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా జరుపుకోవాలని నిర్ణయించిందని, ఈ సందర్భంగా ఆయనను గుర్తు చేసుకోవడం అవసరమని జిల్లా కలెక్టర్ తెలియజేశారు.కొండారెడ్డి బురుజు నుంచి అలంపూర్ వరకు ఉన్న టన్నెల్ (సురంగం) అభివృద్ధి చేయాలని కోరారని, దీనిని తప్పకుండా పరిశీలిస్తాం అన్నారు.వడ్డె ఓబన్న విగ్రహాన్ని ఏర్పాటు చేయడానికి కొన్ని ప్రదేశాలను సిఫార్సు చేశారని, విగ్రహం ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు.ఈ సందర్భంగా బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహించాలని ప్రభుత్వం గత సంవత్సరం ప్రత్యేక జీవో ద్వారా తెలపటం జరిగిందని తెలిపారు.స్వాతంత్ర సమరయోధుడు వడ్డే ఓబన్న జీవిత చరిత్ర లోని ముఖ్యంశాలను వివరించారు.వడ్డే ఓబన్న 11 జనవరి 1807 సంవత్సరంలో నంద్యాల దగ్గర నొస్సం గ్రామంలో జన్మించారు. తొలి నుండి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేసే వారని , 1845 సంవత్సరంలో 9,000 మందితో రైతుల హక్కులను కాపాడే ఉద్దేశంతో బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేయడం, ప్రజల హక్కులను కాపాడడం ధ్యేయంగా పనిచేశారు. 1857 లో బ్రిటిష్ పాలకులకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమానికి వీరి ఉద్యమం నాంది పలికింది. 1846 అక్టోబర్ 6న ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ని పట్టుకోడానికి బ్రిటిష్ వారు వెళుతున్న సమయంలోనే పేరు సోమల గ్రామం సమీపంలో బ్రిటిష్ వారు ఓబన్న ను కాల్చి చంపారు అని వివరించారు.వడ్డేర రాష్ట్ర అధ్యక్షులు లక్ష్మీకాంతం మాట్లాడుతూ మా 20 సంవత్సరాల పోరాట ఫలితంగా ఈరోజు ఈ కార్యక్రమం జరుపుకోవటం సాధ్యమైందని తెలుపుతూ ఈ రోజు అనంతపురంలో రాష్ట్ర ప్రభుత్వం తరపున అధికారిక కార్యక్రం జరుగుతున్నదని తెలిపారు.22వేల జనాభా కలిగిన కర్నూలు పట్టణంలో వడ్డే ఓబన్న విగ్రహాన్ని ప్రతిష్టించాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. వడ్డెర రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు చంద్రిక మాట్లాడుతూ 45 సంవత్సరాలు దాటిన వడ్డెర మహిళలకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.సంస్కృత భాష ఉపాధ్యాయులు సర్వేశ్వరరావు , జైపాల్ బాబు లు మాట్లాడుతూ వడ్డెరలు నిర్మించిన కొండారెడ్డి బురుజు కర్నూల్ కు తలమానికంగా ఉన్నదని , ఇక్కడ నుండి అలంపూర్ కు ఉన్న సొరంగ మార్గాన్ని వెలుగులోకి తీసుకొచ్చి పర్యాటకాన్ని అభివృద్ధి చేయాలని జిల్లా కలెక్టర్ ను కోరారు. కర్నూలులో ఓబన్న విగ్రహాన్ని ప్రతిష్టించాలని కోరారు.ఈ సమావేశానికి జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి ప్రసూన ,బి.సి.కార్పొరేషన్ ఈడి జాకీర్, వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు బత్తుల లక్ష్మి కాంతం ,జిల్లా అధ్యక్షుడు బండ్ల రవి ,వడ్డెర మహిళల రాష్ట్ర అధ్యక్షురాలు చంద్రిక, నాయకులు తిరుపాల్ బాబు ,సర్వేశ్వరరావు ,జయపాల్ బాబు ,సత్యనారాయణ , చంద్ర ,వెంకటస్వామి ,జానకి రామ్, సోమన్న , శివుడు ,బి.సి. సంఘ నాయకులు నక్కమిట్టల శ్రీనివాసులు ,వలసల రామకృష్ణ , కుర్మి సంఘం చైర్మన్ మునెప్ప ,ఉప్పర సంఘం డైరెక్టర్ చంద్ర , వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ లు వలసల రామకృష్ణ ,మురళి ,చల్లా వారి వీధి వడ్డెర సంఘ నాయకులు పాల్గొన్నారు.

## ఇస్రో అన్వేష ... వీడియో గేమ్ అటాక్




**ధర్మఘంట, జనవరి 11, హైదరాబాద్**

రేపు పీఎస్ఎల్వి – సి62తో అన్వేష ఉపగ్రహాన్ని ఇస్రో నింగిలోకి పంపుతోంది. ఈ డిఆర్డీఓ శాటిలైట్ ఓ సూపర్ పవర్ కెమెరా, 150 కి.గ్రా. ల బరువుండే ఈ హైపర్ స్పెక్ట్రల్ ఇమేజింగ్ శాటిలైట్ కాంతి తరంగాలు విశ్లేషిస్తూ క్షేత్రస్థాయిలోని లైవ్ ఫీడ్ అందిస్తుంది. చొరబాట్లు, కూరగాయల బుట్టల్లో తరలించే ఆయుధాలు, ఉగ్రవాద షెల్టర్లు ఇలా అన్నింటిపై ఆర్మీకి రియల్ టైమ్ డేటా అందుతుంది. దీంతో వీడియో గేమ్ ఆడినట్లుగా జవాన్లు ఆపరేషన్లో పాల్గొనవచ్చు.

## పోలిరెడ్డిపల్లి హైస్కూల్‌లో పూర్వ విద్యార్థులుఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం

**30 ఏళ్ల తర్వాత ఒకే పాఠశాలలో కలుసుకున్న 199798, 199899 పదవ తరగతి విద్యార్థులు**
**గురువులకు కృతజ్ఞతలుడపాఠశాల అభివృద్ధికి సహకారం అందిస్తామని పూర్వ విద్యార్థుల హామీ**



**మరిపాడు**

మండలంలోని చిన్నమాచనూరు పంచాయతీ పరిధిలోని పోలిరెడ్డిపల్లి హైస్కూల్ నందు పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆహ్లాదకర వాతావరణంలో జరిగింది. 199798 మరియు 199899 విద్యా సంవత్సరాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఒకే పాఠశాల ప్రాంగణంలో మళ్లీ కలుసుకోవడం ఎంతో ఆనందాన్ని, భావోద్వేగాన్ని కలిగించిందని ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పేర్కొన్నారు. విద్యాభ్యాసం చేసిన రోజులను గుర్తు చేసుకుంటూ అప్పటి అనుభవాలు, ఉపాధ్యాయుల బోధనా విధానాలు, పాఠశాల వాతావరణం గురించి పరస్పరం ముచ్చటించుకున్నారు.ఉపాధ్యాయులు మాట్లాడుతూ విద్యార్థుల విజయంలో క్రమశిక్షణ, కృషి, గురువుల మార్గనిర్దేశం ముఖ్యమని తెలిపారు. పూర్వ విద్యార్థులు తమ జీవిత ప్రయాణంలో ఉపాధ్యాయుల బోధనలు ఎంతో ఉపయోగపడ్డాయని కృతజ్ఞతలు తెలిపారు.

## నేలపట్టు పక్షుల కేంద్రాన్ని సందర్శించిన హీరో మంచు విష్ణుదొరవారిసత్రం

జిల్లాలోని ప్రసిద్ధ నేలపట్టు పక్షుల అభయారణ్యాన్ని సినీ నటుడు మంచు విష్ణు కుటుంబం సమేతంగా సందర్శించారు.ఈ సందర్భంగా ఆయనకు ఫ్లెమింగో పెస్టివల్ నిర్వహిస్తున్న అధికారులు ఆయనకు స్వాగతం పలికి సన్మానించ్చారు.శీతాకాలం కావడం తో విదేశాల నుంచి వేల మైళ్ల దూరం ప్రయాణించి వచ్చిన రకరకాల పక్షులను చూసి ఆయన ముగ్ధులయ్యారు.ఫ్లెమింగో ఫెస్టివల్ నేపథ్యంలోపక్షుల సందడి.. ప్రకృతి ఒడిలో..సందడి చేశారు.ప్రతి ఏటా అక్టోబర్ నుండి మార్చి వరకు సాగే పక్షుల సీజన్‌లో భాగంగా నేలపట్టుకు విచ్చేసే గూడబాతులు (పెలికాన్స్), నత్తగుల్ల కొంగలు మరియు ఇతర వలస పక్షుల విన్యాసాలను ఆయన ఆసక్తిగా గమనించారు.ఈ సందర్భంగా ఆయన అక్కడి వాచ్ టవర్ ఎక్కి పక్షుల ఆవాసాలను వీక్షించారు. అనంతరం అభయారణ్యంలోని మ్యూజియం మరియు విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించి పక్షుల జీవనశైలి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

## రేనాటి పోరాట చరిత్రకు స్మరణ పోలీస్ శాఖ లో వడ్డే ఓబన్న జయంతి

**తిరుపతి**

తిరుపతి జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రేనాటి సమరయోధుడు, వడ్డే ఓబన్న జయంతి వేడుకలు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమం జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు ఆదేశాల మేరకు జరిగింది. కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ వడ్డే ఓబన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ, బ్రిటిష్ పాలకుల దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఉయ్యాలవాడ నరసింహారెడ్డితో కలిసి పోరాడిన వీరుడు వడ్డే ఓబన్న ధైర్యసాహసాలు, కర్తవ్యనిష్ఠ, ప్రజాసేవాభావం ప్రతి ఒక్కరికి ముఖ్యంగా పోలీస్ సిబ్బందికి

# విద్యుత్ సవరణ చట్టాన్ని రద్దు చేసేవరకు పోరాటం ఆగదు


**గట్టుప్పల్ :** లేబర్ కోడ్స్ తెచ్చి కార్మిక వర్గ హక్కుల్ని కాలరాస్తూ,ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తూ, విద్యుత్ సవరణ చట్టం పేరుతో రైతులను ప్రజలను మోసం చేస్తున్న మోడీ ప్రభుత్వం పై సమరశీల ఐక్య ఉద్యమాలకు కార్మిక వర్గం, రైతాంగం సిద్ధం కావాలని రైతు సంఘం రాష్ట్ర నాయకులు బండ శ్రీశైలం కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు.ఆదివారం గట్టుపల మండల కేంద్రంలో సిపిఎం మండల కమిటీ సమావేశం కర్నాటి వెంకటేశం అధ్యక్షతన సమావేశం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల అనుసరిస్తున్న కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం, రైతాంగం వ్యవసాయ కార్మికులు ఐక్యంగా జనవరి నెల మొత్తం పెద్ద ప్రచార క్యాంపెయిన్ చేపడుతున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజలను సమీకరించి సమరశీల ఉద్యమాలు చేస్తామని అన్నారు. మోడీ విధానాలు మార్చుకోకపోతే ప్రజల నుండి ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. చేసుకోవడానికి అవకాశం ఇ మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని విబిజి రామ్ జీ గా మార్చి పేదల పొట్ట కొట్టడానికి ప్రభుత్వం సిద్ధమైందని



ఆవేదన వ్యక్తం చేశారు.విద్యుత్ సవరణ చట్టం 2025 ప్రకారం భవిష్యత్తులో విద్యుత్ రంగం ప్రైవేటుపరమై సబ్సిడీలు పోతాయని ప్రజలపై రైతులపై మరింత భారం పెరగనుందని అన్నారు. ఈ విధానాలపై కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త ప్రచార క్యాంపెయిన్ జయప్రదం చేయాలని కోరారు.గ్రామస్థాయి వరకు ప్రచార జాతలు జనవరి 19న భారీ సభతో ప్రభుత్వానికి ఒక హెచ్చరిక చేస్తామని అన్నారు. ఈనెల 19న జరిగే నల్లగొండలో జరిగేసభకు అధిక సంఖ్యలో కార్మికులు కర్షకులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం గట్టుప్పల మండల కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యులు కర్నాటి మల్లేశం, చాపల మారయ్య, కర్నాటి సుధాకర్, అచ్చిన శ్రీనివాస్, వల్లూరి శ్రీశైలం, రాచమల్ల వెంకటరెడ్డి, పెదగాని నరసింహ, కర్నాటి వెంకటేశం, ఎండి రబ్బాని, బండారి కృష్ణయ్య, కర్నాటి యాదగిరి, పసుపుల చెన్నయ్య, బొబ్బల చంద్రయ్య, నల్లవెల్లి బిక్షం, ఖమ్మం, రాములమ్మతదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 2026 పురస్కారం ముగింపు





**వరంగల్ ఉమ్మడి జిల్లా,జనవరి 11: (తెలంగాణా గీతం)** వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని పోతన నగర్ ఆడిటోరియం లో ఆదివారం తెలంగాణ భాషా సంస్కృతికి శాఖ సౌజన్యంతో జె.బీ కల్చర్ ఆర్ట్స్ సొసైటీ నిర్వాకులు జడల శివ హరిత ఆధ్వర్యంలో వరంగల్ సంక్రాంతి సకల క్రాంతి పురస్కారం 2026 ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం విజేత కళాకారులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జడల శివ హరిత దంపతులను గత 30 సంవత్సరాల గా జే.బి ఆర్ట్స్ సొసైటీ ద్వారా ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి కళాకారుల కళలను వెలికి తీసారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మర్రి పెల్లి రవి. ఆడెపు రవీందర్. చిప్ప వెంకటేశ్వర్లు. సింగర్ రాము. శ్రీనివాసు హరినాథ్ హరిప్రియతో పాటు వందల కళాకారులు పాల్గొన్నారు.

# ఘనంగా ఒడ్డె ఓబన్న జయంతి ఉత్సవాలు

**ఎల్బీనగర్ :** స్వాతంత్ర్య సమర యోధుడు ఒడ్డె ఓబన్న 219 జయంతి ఉత్సవాలు హయత్ నగర్ మండల కేంద్రంలోని మహనీయుల విగ్రహాల వద్ద బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎత్తిరి భీమ్ రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వడ్డే ఓబన్న సుబ్బమ్మ సుబ్బయ్య దంపతులకు రాయలసీమ నంద్యాల జిల్లాలో జన్మించారని అన్నారు. ఓబన్న రాయలసీమ గడ్డమీద స్వాతంత్ర సమరభేరి మోగించి బ్రిటిష్ పాలకుల పాలనపై సమర శంఖారావం పూరించి బ్రిటిష్ పాలకుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించి గడగడలాడించిన సమరయోధుడు ఓబన్న సైరా నరసింహారెడ్డి సమస్థానంలో మండల దిశగా విధులు నిర్వహించారని అన్నారు. వడ్డే ఓబన్న అంటే ధైర్యం త్యాగం సామాజిక న్యాయం అని కొనియాడారు.వడ్డే ఓబన్న సేవలను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి ఆయన యొక్క జయంతి వర్ధంతిలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించడం గర్వించదగ్గ విషయం అని ఆయన యొక్క జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాలలో చేర్చాలని రాబోయే తరాలకు వడ్డే ఓబన్న జీవిత చరిత్ర తెలియజేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు ఆయన యొక్క విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో హయత్ నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజు గౌడ్ ,ఎస్ ఐ వెంకటరెడ్డి, లక్ష్మీనారాయణ, పారందస్వామి, రాష్ట్ర ఉపాధ్యక్షులు తెలంగాణ అంబేద్కర్ సంఘం,ఎర్ర




రవీందర్ సీనియర్ నాయకులు ఎమ్మార్పీఎస్ పవన్ కుమార్ ,హయత్ నగర్ మండల నాయకులు వడ్డెర సంఘం మొసస్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు వడ్డెర సంఘం ఎత్తరి అరవింద్ సీనియర్ నాయకులు వడ్డెర సంఘం తదితరులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ జిల్లాకు పీవీ నరసింహారావు పేరు పెట్టాలి

## తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు.

**ఎల్బీనగర్ :** అపరచానిక్యుడు ఆర్థిక సంస్కరణల కు ఆద్యుడు బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన పీవీ నరసింహారావు మాజీ ప్రధానమంత్రి పేరును ఉమ్మడి వరంగల్ జిల్లాలోని హుజురాబాద్ కు పెట్టాలని తెలంగాణ బ్రాహ్మణ సంఘ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు, పివి జిల్లా సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు పోచంపల్లి రమణారావు డిమాండ్ చేశారు. ఆదివారం నాడు ఆయన పత్రికా సమావేశంలో ఒక ప్రకటన విడుదల చేస్తూ రాష్ట్ర ముఖ్య మంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి మాజీ ప్రధానమంత్రి, విశేష ప్రజ్ఞ కలిగిన ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు తెలంగాణ ప్రజల ముద్దుబిడ్డ పాములపర్తి వెంకట నరసింహారావు (పీవీ నరసింహారావు ) పేరును ఉమ్మడి వరంగల్ జిల్లా హుజూరాబాద్ కు ఆయన పేరు పెట్టాలని సూచించారు.ఇట్టి విషయాన్ని పరిశీలించి రేవంత్ రెడ్డి మంత్రివర్గం తక్షణమే ఒక నిర్ణయం తీసుకోవాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి మంత్రివర్గంలోని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు, అరకర వేణుగోపాల్, ఏఐ సి సి జనరల్ సెక్రటరీ కోటా నీలిమ తదితరులు ఈ విషయమై ప్రత్యేక దృష్టి సారించాలని అదేవిధంగా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కూడా, తెలంగాణలోని ప్రాముఖ్యం అయిన ఉమ్మడివరంగల్ జిల్లా లోని హుజురాబాద్ కు పీవీ నరసింహారావు జిల్లా గా పేరు పెట్టాలని దీనితో వంగర గ్రామానికి ఒక ప్రత్యేకత ఏర్పడుతుందని ఆ ప్రత్యేకతతో పీవీ నరసింహారావు దేశానికి చేసిన సేవలు శాశ్వతంగా గుర్తుంటాయని ఆయన ఆకాంక్షించారు. గతంలో అనేకమంది ముఖ్యమంత్రులకు పీవీ నరసింహారావు పేరులు ఏదో ఒక జిల్లాకు పెట్టాలని అనేక వినతి పత్రాలు అందజేయడం జరిగిందని యువకుడు ఉత్సాహవంతులు అయినా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



తలచుకుంటే ఇది పెద్ద సమస్య కాదని తక్షణమే ఈ సమస్యకు పరిష్కారం ఏర్పాటు చేసి మా అందరి హృదయాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి శాశ్వతంగా నిలిచి ఉండాలని ఆకాంక్షించారు.

## క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం:జెర్కోని రాజు



**ఇబ్రహీంపట్నం :** యువతకు భవిష్యత్తు బాగుండాలంటే మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దని ఇబ్రహీంపట్నం నియోజకవర్గ బిఆర్ఏస్ యువజన యువ నాయకులు జెర్కోని రాజు అన్నారు.ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని 9,11,12వార్డులోని యువకులతో ప్రీమీయం లీగ్ క్రికెట్ టోర్నమెంట్ సీజన్ -3లో మొదటి బాహుమతి గెలుపొందిన రైనా వారియర్స్ కు 30,వేల రూపాయల బాహుమతిని అందజేసిన జెర్కొని రాజు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక దారుఢ్యానికి ఎంతో దోహదపడతాయని అన్నారు.విధి నిర్వహణలో ప్రతీ ఒక్కరు ఒత్తిడికి లోనవుతారని, క్రీడలతో ఒత్తిడికి దూరమవుతుందని, స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందన్నారు.క్రీడలతో మానసికంగా దృఢంగా తయారవుతారని పేర్కొన్నారు. యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం అంధకారమై జైలు జీవితాన్ని గడపాల్సివస్తుందని అన్నారు.యువత డ్రగ్స్ దూరంగా ఇండాలని సూచిం చారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ఆకుల సురేష్,శంఖర్ నాయక్, 12వ వార్డు అధ్యక్షులు కొండిగారి రాములు,బోళ్ళ సీతయ్య, శంకర్ చెనమోని శంకర్, మోహన్ నాయక్ , త్రిలోక్, సందీప్ రెడ్డి, సురేష్, రాంరెడ్డి , కార్తీక్,రాందాసు, రాఘవేందర్ , జోరిగల శ్రీను,వేణు, సొప్పరి కర్ణకర్, దయచారి, జెలెందర్ (చిన్న), సోనూ, ప్రశాంత్ , తదితులు పాల్గొనారు.

## విరాట్‌నగర్‌లో నీటి శుద్ధి

**చింతపల్లి :** చింతపల్లి మండలం గొల్లపల్లి గ్రామ పరిధిలోని విరాట్‌నగర్ కాలనీలో స్వచ్ఛమైన తాగునీటి సరఫరాకు గ్రామ పంచాయతీ చర్యలు చేపట్టింది. గ్రామ సర్పంచ్ ఆనంతుల శ్రీను గౌడ్ ఆదేశాల మేరకు కాలనీలోని వాటర్ ట్యాంక్‌ను పూర్తిస్థాయిలో శుద్ధి చేయించారు. కాలనీ వాసులకు ఆరోగ్యకరమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు సర్పంచ్ తెలిపారు. ట్యాంక్ శుద్ధి ద్వారా నీటిలో కలుషితం తొలగించి, నీటి వల్ల వచ్చే వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకు న్నామని పేర్కొన్నారు.గ్రామంలో తాగునీటి సరఫరా వ్యవస్థను మరింత పటిష్ఠం చేయడంతో పాటు పారిశుధ్యం,



రహదారులు, వీధిదీపాలు, డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి కూడా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రతి కాలనీలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని వెల్లడించారు.

## స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణకు ఆహ్వానం



**చింతపల్లి :** చింతపల్లి మండల ఎస్సై ముత్యాల రామ్మూర్తిని ఆదివారం నిర్వాహకులు మర్యాదపూర్వకంగా కలిసి, రేపు సోమవారం (జనవరి 12) నిర్వహించనున్న స్వామి వివేకానంద విగ్రహ ఆవిష్కరణతో పాటు జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జరగనున్న కార్యక్రమాలకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా కార్యక్రమాల వివరాలను ఎస్సైకు వివరించారు. కార్యక్రమాలు శాంతియుతంగా, విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ నుంచి పూర్తి సహకారం అందిస్తామని ఎస్సై రామ్మూర్తి భరోసా ఇచ్చారు.

## ఘనంగా స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతి వేడుకలు

**దేవరకొండ :** స్వాతంత్ర సమరయోధుడు వడ్డెర ఓబన్న జయంతిని పురస్కరించుకుని ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు హైదరాబాద్ ఉప్పల్‌లోని తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం భవనంలో ఘనంగా జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం తెలంగాణ రాష్ట్ర వడ్డెర సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి ఆయిలు మల్లు గారి ఆధ్వర్యంలో జరిగింది. ఈ యొక్క కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ మెదక్ మాజీ ఎంపీ వెంకటేష్ నేత పాల్గొన్నారు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 33 జిల్లాల మండల అధ్యక్షులు, నియోజకవర్గ కన్వీనర్లు, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్ద సంఖ్యలో



హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరంలో వడ్డెర ఓబన్న చేసిన త్యాగాలను వక్తలుస్మరించుకున్నారు. ఆయన పోరాట స్ఫూర్తిని నేటి తరానికి ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం నుంచి వడ్డెర సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఇరగ దిండ్ల కృష్ణ ఆధ్వర్యంలో 46 మంది ప్రతినిధులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో దేవరకొండ నియోజకవర్గ కార్యదర్శి ఇరగ దిండ్ల వెంకటేష్, వరికుప్పల రాములు, ఇరగ దిండ్ల రాములు, విజయ్ కుమార్, గండికోట వెంకటయ్య, వరికుప్పల వెంకటయ్య, ఇరగ దిండ్ల బాలరాజు, ఇరగ దిండ్ల ఎల్లయ్య, ఓర్సు బిక్షపతి, వేముల గోవిందు తదితరులు పాల్గొన్నారు